Regd. No. HSE/929/2014-2016
Published on 02-08-2014
Sthanika Palana
RNI No. APTEL/27888/2009
No. AP/HSE-03/WPP/2013-2014




తాజా సమాచారం కోసం www.apard.gov.in
మరియు YouTube facebook /amrapard
టోల్ ఫ్రీ నెం.: 1800 425 7070



ఆగస్టు, 2014

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 6 సంచిక: 7 పేజీలు: 68 వెల: రూ. 20/-





తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మొదటి సారిగా ఎ.ఎం.ఆర్.- అపార్డును సందర్శించిన సందర్భంగా స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపల్ కార్యదర్శి జె. రేమండ్ పీటర్, ఐ.ఎ.ఎస్., అపార్డు డైరెక్టర్ జి.డి. ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్. తదితర అధికారులు.



తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎ.ఎం.ఆర్ - అపార్డులో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించుతున్నారు



ఎ.ఎం.ఆర్ - అపార్డు ప్రచురించిన పుస్తకాల ప్రదర్శనను తిలకించిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు పబ్లికేషన్స్ గూర్చి అడిగిన ప్రశ్నలకు డైరెక్టరు జి.డి. ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్. వివరిస్తున్నారు





ఎ.ఎం.ఆర్ - అపార్డు క్యాంపస్‌ను సందర్శించిన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మొక్క నాటుతున్నారు



ఎ.ఎం.ఆర్ - అపార్డులో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంను సందర్శించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు అందుగల సౌకర్యాలను గూర్చి అధికారులు ఆయనకు వివరించుతున్నారు మరియు పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్, త్రాగునీటిశాఖల మంత్రి సిహెచ్ అయ్యన్న పాత్రుడు గ్రామాలలో త్రాగునీటి కొరతను తీర్చాలని వివరించారు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి కె. జవహర్‌రెడ్డి, ఐ.ఎ.ఎస్., గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ డి. ప్రసాదరావు, ఐ.ఎ.ఎస్., అపార్డు డైరెక్టరు జి.డి. ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్. తదితర అధికారులు.

ఎఎంఆర్ అపార్డ్
AMR-APARD

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 6 సంచిక: 7

ఆగష్టు, 2014

ఎడిటర్
**జి.డి. ప్రియదర్శిని** ఐ.ఏ.ఎస్.
డైరెక్టర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**కె. యాదయ్య**
**హెచ్. కూర్మారావు**
**ఆర్. సూర్యనారాయణరెడ్డి**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా & పబ్లికేషన్స్, అపార్డ్**
**& కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. - అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in

ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని అపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.

# విషయ సూచిక

సంపాదకీయం ..... 4
ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అపార్డు సందర్శన ..... 5
గ్రామ పంచాయతీల ప్రణాళికలపై ఎం.ఒ.టి. లకు శిక్షణ ..... 6
నీరు-పారిశుద్ధ్యంపై ప్రజలలో మరింత అవగాహన పెంపొందించవలసిన అవసరం ఉంది ... 7
మధ్యాహ్నం భోజన పథకం ..... 8
పరిపూర్ణత దిశగా పంచాయతీరాజ్ ..... 10
ప్రాణాళికా వికేంద్రీకరణ - ముఖ్యాంశాలు ..... 14
నైతిక విలువలు ..... 17
భారతదేశంలో స్థానిక ప్రభుత్వ అధికారాలు బదలాయింపు పరిస్థితి ..... 21
ప్రగతి సోపాన ప్రణాళికలతో - బంగారు తెలంగాణకు బాటలు వేద్దాం ..... 24
గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి దాకా ప్రత్యేక ప్రణాళికలు ..... 27
ఐదు సంవత్సరాల డిగ్రీ కోర్సును టిస్ (టి.ఐ.ఎస్.ఎస్.)లో ప్రారంభించిన ఎ.ఎం.ఆర్-అపార్డ్ డైరెక్టరు జి.డి. ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్. ..... 28
ప్రజా ఆరోగ్యం - గ్రామ పంచాయతీ పాత్ర ..... 29
గ్రామ పంచాయతీ పనుల నిర్వహణ ..... 30
భూమి పరిపాలన చట్టాలు - నూతన భూమి పొందే చట్టాలు - 2013 పై రెవెన్యూ అధికారులకు అపార్డులో శిక్షణ ..... 32
వర్క్‌షాప్ ఆన్ జండర్ బడ్జెటింగ్ ..... 32
గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకు కృషి చేయాలి ..... 33
భారత నిర్మాణ్ వాలంటీర్ల అపూర్వ విజయాలు ..... 34
ఎ.ఎం.ఆర్ - అపార్డు జిల్లా శిక్షణా మేనేజర్లు సమీక్షా సమావేశం ..... 36
భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ..... 37
గ్రామీణ జీవనోపాధి అవకాశాలు ..... 38
కనీస మద్దతు ధరలను సాధించిన మహిళల ఐక్యత ..... 39
మన గ్రామం - మన మండల పరిషత్తు ..... 41
సర్పంచ్‌ల అధికారాలు, బాధ్యతలు ..... 44
దళిత మహిళా సర్పంచ్ - వివరణలు ..... 47
సమాచార హక్కు చట్టం-2005 (ఆర్.టి.ఐ. యాక్ట్) గూర్చి తెలుసుకుందామా! ..... 50
స్థానిక ప్రభుత్వాలు - సుపరిపాలన ..... 51
మనం గ్రామాల దగ్గరకు ఎందుకు వెళ్ళాలి ! ..... 52
పర్యావరణం - ప్రజారోగ్యం ఆవశ్యకత ..... 53
గ్రామ ప్రణాళికలకు నాంది పలికిన ఎస్.కె.డే పాత్ర ..... 55
వివిధ పంటలలో నాణ్యమైన విత్తనాన్ని సేకరించడానికి అవలంభించవలసిన మెళుకువలు 57
గ్రామీణ జీవితంలో జానపద కళారూపాలు ..... 59
ఖరీఫ్ సాగుకు అనువైన మేలైన మొక్కజొన్న మరియు చిరుధాన్యాల రకాలు ..... 61
ప్రైమింగ్ ప్రక్రియతో జొన్నలో అధికోత్పత్తి ..... 64
ఎ.ఎం.ఆర్. అపార్డులో సర్పంచులు ఎం.పి.టి.సి.లు, ఎం.పి.పి.లు, జెడ్.పి.టి.సి.లు, జెడ్.పి. ఛైర్మన్‌లకు శిక్షణ ..... 65
ఇ - పంచాయితీ పోర్టల్‌పై పంచాయితీరాజ్ సిబ్బందికి శిక్షణ ..... 66

# అభివృద్ధిని పెంచే "మన ఊరు – మన ప్రణాళిక"లు

మనిషి ఎదుగుదలకు ఒక క్రమబద్ధమైన ప్రణాళిక అవసరం. అదే విధంగా దేశాభివృద్ధి ప్రణాళికలు మనదేశంలో 1950 లోనే మొదలయినాయి. అయినా ఇంకా దేశంలో 29.5% జనాభా పేదరిక దిగువునున్నట్లు మనదేశ అధికార లెక్కలు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 2, 2014 న నూతన రాష్ట్ర తెలంగాణ ఏర్పడింది. ఆ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు నూతన నినాదంతో గ్రామాలను అభివృద్ధి పరచి రాష్ట్రాన్ని అభివృద్ధిలో తొలి భాగాన నిలిపేందుకు కృషి చేయాలని ప్రజలకు పిలుపునిచ్చి "మన ఊరు - మన ప్రణాళికలు" కార్యక్రమంతో గ్రామీణాభివృద్ధి ముందుకు తీసుకొని వెళ్ళాలని నిర్ణయించారు. ఆ పిలుపును కృత నిశ్చయంతో కార్యరూపంలోకి తెచ్చి లక్ష్యాలను సాధించేందుకు అధికారులకు ఆదేశాలను జారీ చేసినారు. ఈ పిలుపు మేరకు గ్రామ పంచాయతీ సర్పంచులు తమ ఊరును తామే పురోభివృద్ధికి నడిపించేందుకు ఆ ఊరు సభ్యులు గ్రామ సభలో పాల్గొని వారి అవసరలు ఏమిటి? అని తెలుసుకొని అందుకు అనుగుణంగా గ్రామ ప్రణాళికలను రూపొందించి గ్రామసభ ఆమోదంతో ఆ ప్రణాళికలను అమలు చేసి ఊరి అవసరలను తమకు తామే నెరవేర్చు కొనులాగున చేయుట అందుకు అవసరమైన సహాయ సహకారాలను గ్రామంలోనే రూపొందించుకొనడం, ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను పెంపొందించుకొనడంకు ఉద్దేశించబడింది. ఈ మేరకు స్థానికంగా గ్రామాధికారులు ఆయా గ్రామాలలో ఏర్పరుచుకొన్న ప్రణాళికలకు తగిన సహాయం. చేయూత, నిధులు సమకూర్చడం జరుగుతుంది.

గ్రామాలలోని ముఖ్యమైన సమస్యలు సురక్షితమైన త్రాగునీరు ఏర్పాటు, పారిశుద్ధ్యం, విద్యా సౌకర్యాలు, అంగన్‌వాడీని పని చేయించడం మరుగుదొడ్ల నిర్మాణం, పిల్లల సంరక్షణ, బాలింతల పౌష్టికహారం పెంపొందించడం. గ్రామాలలో స్మశానాల ఏర్పాటు, ముఖ్యంగా చెత్తా చెదారం వేసే ప్రాంతం ఏర్పాటు, పాఠశాలను నడిపించడం టీచరు పనిచేయులాగును చర్యలు తీసుకోవడం ఇవి అన్నియు గ్రామ ప్రణాళికలో చేర్చి వీటిని నేరవేర్చేందుకు కావలసిన వనరులు, నిధులను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పొందడం అన్ని విషయాలను క్రమానుగతంగా ఒక పద్ధతి ప్రకారం అమలు చేసి మంచి ఫలితాలను సాధించేందుకు స్థానికాధికారులను బాధ్యులుగా చేయుటకు ఇందులో గ్రామస్థులతో పాటు వార్డు సభ్యులుగా ఎన్నుకొనబడిన గ్రామ సర్పంచ్ ఆ ఊరు ధనవంతులు, భూస్వాముల సహకారంతో తమ ఊరును తామే బాగు చేయు లాగున ప్రణాళికలను నిర్మించుకోవడం. అందుకు కావలసిన చేయూత ప్రభుత్వమే అందిస్తుంది. అదే విధంగా మండల స్థాయిలో మండల ప్రాదేశిక సభ్యులు మండల అధ్యక్షుడు వారి వారి ప్రాంతాలకు కావలసిన మౌళిక సదుపాయాలు (infrastructure) ను ఏర్పరుచుకొని ఆయా ప్రాంతాల అభివృద్ధిని తోడ్పాటునందించడం. ఇందుకు ఎం.పి.పి.లు తమ ప్రాంతాలలో గ్రామాలు ఈ అభివృద్ధి పథంలో నడిపించాలి. అందుకు మండల అభివృద్ధి అధికారులు తగిన వనరులు, అవకాశాలను కల్పించుతారు.

జిల్లా పరిషత్ స్థాయిలో జిల్లాలోని గ్రామాలన్నింటిలోను ఈ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేసిన యెడల ఆశించిన, లక్ష్యాలను సాధించడమే గాక అవిద్య, అవిజ్ఞానంను పారద్రోలి నిజమైన తెలంగాణాను నిర్మించుకొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మొత్తం తెలంగాణా గ్రామాలు, మండలాలు, జిల్లాలు స్థాయిలో వికేంద్రీకరణలో భాగంగా అన్ని స్థాయిల్లో "మన ఊరు - మన ప్రణాళికలను" అమలు చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలను ఆదేశించారు. దానితో రాష్ట్ర అధికారులు తగిన ప్రణాళికలను రూపొందించి అమలు చేయుటకు నోడల్ అధికారులకు శిక్షణనివ్వడం జరిగింది. వారు వారి గ్రామాలలోను మండలాలలోను కలెక్టర్స్ ఆదేశానుసారంగా "మన ఊరు - మన ప్రణాళికలను" రాజ్యాంగ సవరణ 73, 74 నను సరించి 29 రంగాలలో అభివృద్ధి చేయుటకు నిర్ణయించారు. అందుకు జిల్లాల కలెక్టర్స్ ప్రణాళికలను రూపొందించి అమలు చేయుటకు సమాయత్తమగుతున్నారు. ఈ మన ఊరు - మన ప్రణాళికనే భావనను 1950 లో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పేరుతో ఆనాటి మంత్రి ఎస్.కె.డే అందించిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్, గ్రామసభ - పార్లమెంట్‌వంటిదన్నారు. అభివృద్ధికి తగిన ప్రణాళికాభివృద్ధిని రూపొందించుకొని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పురోభివృద్ధితో మరింత ముందుకు సాగాలని ఆశిద్దాం.

(జి.డి. ప్రియదర్శిని)



# ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అపార్డు సందర్శన

**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు జూలై 8వ తేదీన ఎ.ఎం. ఆర్ -అపార్డును సందర్శించారు.**

**ఎ.ఎం.ఆర్ -అపార్డులో స్థానిక స్వపరిపాలనా, పంచాయతీ రాజ్ వ్యవస్థలోను, గ్రామీణాభివృద్ధిలో వి.ఆర్. ఓ ల నుండి డిప్యూటీ కలెక్టర్ల వరకు శిక్షణ ఇస్తుందని, సర్పంచులు, ఎం.పి.పి. అధ్యక్షులు, ఎ.పి.టి.సి లు, జడ్. పి.టి.సిలకు శిక్షణను ఏర్పాటు చేసి ఎన్నో విధాలుగా అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించటానికి కృషి చేస్తుందని తెలంగాణా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీ జె. రేమాండ్ పీటర్, ఐ.ఎ.ఎస్. చెప్పారు.**

ఎ.ఎం.ఆర్ -అపార్డులో స్థానిక స్వపరిపాలన, పంచాయతీ వ్యవస్థలోని వివిధ స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అపార్డు డైరెక్టర్ జి.డి. ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్ ముఖ్యమంత్రికి వివరించారు.

ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఎంతో ఆసక్తితో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రచురణలు, శిక్షణ నమూనాలు తదితర ఎన్నో అంశాలను పరిశీలించారు. డైరెక్టర్ జి.డి. ప్రియదర్శిని ముఖ్యమంత్రికి వీటి గురించి వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖర్ రావు ఎ.ఎం. ఆర్- అపార్డులో జరుగుతున్న కార్యక్రమాలతో పాటు, ఆడిటోరియం నిర్మాణాలను పరిశీలించారు. అంతకు ముందు ఆయన అపార్డు ఆవరణలో చెట్టు నాటారు.

ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుతో పాటు తెలంగాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ఐ.ఎ.ఎస్., ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీ జె. రేమండ్ పీటర్ ఐ.ఎ.ఎస్., ప్రభుత్వ సలహాదారులు రమణాచారీ, ఎ.కె. గోయల్, రామలక్ష్మణ్, ఒఎస్‌డి శ్రీ నరసింగరావు, ఐ.ఎ.ఎస్., ఇతర ఉన్నతాధికారులు అపార్డు శిక్షణా కార్యక్రమ వివరాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు లకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎ.ఎం.ఆర్ అపార్డు జాయింట్ డైరెక్టరు కె. యాదయ్య, ఇతర సెంటర్ హెడ్స్, తదితర అధికారులు పాల్గొన్నారు.

*- సిఎంపి*

# గ్రామ పంచాయతీల ప్రణాళికలపై MOT లకు శిక్షణ



**అట్టడుగు స్థాయిలో ఉన్న గ్రామ పంచాయతీల నుండి ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని, దానికి అనుగుణంగా లక్ష్యాలను నిర్ధేశించుకొని వచ్చే ఐదు సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంకు నడిపించాలని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జె. రేమాండ్ పీటర్, ఐఎఎస్ అన్నారు.**

ఎ.ఎం.ఆర్ -అపార్డులో జూలై 9న జరిగిన పంచాయతీ రాజ్ శాఖ 'మాస్టర్-శిక్షకుల' ఒక రోజు సమావేశంలో ఆయన మాట్లాడి గ్రామీణ స్థాయి ప్రణాళికలను తయారు చేసుకొని అందులో ముఖ్యమైన అంశాలు వైద్యం, ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ స్కూళ్ళ నిర్వహణ, గ్రామసభల నిర్వహణ, వాటర్ షెడ్ మెనేజ్‌మెంట్ సాధించాల్సిన ఆవశ్యకత అంశాలలో లక్ష్యాలను ఆవశ్యకత ఎంతో ఉందని చెప్పారు.

అందుకు శిక్షకులు ఏమి చేయాలో ఒక ప్రశ్నావళిని తయారు చేసి వాటిని సాధించుకొంటూ గ్రామాభివృద్ధిని సాధించవలసిన ఆవశ్యకత ఎంతో ఉందని రేమాండ్ పీటర్ వివరించారు.

అదేవిధంగా శిక్షణా సామర్థ్యాన్ని పెంచుకొని వాటిని గ్రామీణ స్థాయిలో అమలు చేసేటట్లు ఆయన అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా మాజీ ఐఎఎస్ అధికారి సోషల్ ఎక్టివిస్టు ఎ. మనోహర్ ప్రసాద్ మాట్లాడుతూ, నేడు పేదవాని స్వరంను గూర్చి పట్టించుకొనే ఉద్యోగ స్వామ్యమే కరువైందని ఎన్ని కోట్లు ఖర్చు పెట్టిన పేదవానికి చేరేది కొంతైన ఉండటంలేదని, ఆ కేటాయింపులు దారి మళ్ళిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సి.డి.పి ఎ సెంటర్ హెడ్ ఆర్. సూర్య నారాయణ రెడ్డి గ్రామ స్థాయి పాలన లక్ష్యాలను గూర్చి వివరించారు.

అనంతరం పంచాయతీ రాజ్ శాఖ గ్రామీణాభివృద్ధి పేదరిక నిర్మూలన ఏజెన్సీ సిఇఓ జె. మురళీ, ఐఎఎస్, తదితరులకు, శిక్షకులకు శిక్షణనివ్వడం జరిగింది.

వీరు గ్రామస్థాయి ప్రణాళికలు తయారుచేసి వారిచే అమలు చేయటానికి తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అపార్డు డైరెక్టరు జి.డి. ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్. అన్నారు.

*- సిఎంపి*





# నీరు-పారిశుద్ధ్యంపై ప్రజలలో మరింత అవగాహన పెంపొందించవలసిన అవసరం ఉంది

**మనిషి మనుగడకు నీరు అత్యంత అవశ్యకమైనది. నీటి ద్వారానే మనిషి జీవన గమనం మంచిగా నడిస్తుంది. నీటిలో త్రాగునీరు ప్రాముఖ్యత ఎంతో ఉంది. మనిషికి స్వచ్ఛమైన త్రాగునీరు కల్పించటం అధికారులు, పాలకుల బాధ్యత. అదే విధంగా మనం నివసిస్తున్న పరిసరాల పారిశుద్ధ్యం కూడా ఎంతో ముఖ్యం.**

ప్రజలలో నీరు, పారిశుద్ధ్యాన్ని గూర్చి అవగాహనను మరింతగా పెంపొందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అంతర్జాతీయ సంస్థలు యు.ఎన్.డి.పి (ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం) వారు కలిసి ఆయా దేశాలలో పారిశుద్ధ్యాన్ని గూర్చి ప్రచారం చేస్తున్నారు. అయినా మనదేశంలో 50% మంది ఇంకా మలవిసర్జన బహిర్భూమిలో చేయడం జరుగుతుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం కల్పిస్తూ దేశ వ్యాప్తంగా కృషి చేస్తుంది. ఈ కృషిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణంలోనే ముందంజలో అవగాహన కల్గించేందుకు ఎన్నో విధాలుగా వర్క్‌షాప్‌లు, సదస్సులు నిర్వహించడమేగాక భారత నిర్మాణ్ వాలంటీర్ల ద్వారా ఆయా గ్రామ పంచాయతీలలో ప్రచారాన్ని కొనసాగిస్తుంది.

ప్రచారం చేయటానికి ఎ.ఎం.ఆర్.-అపార్డ్ డైరెక్టర్ జి.డి.ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్ ఎంతో శ్రద్ధ తీసుకొని అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామపంచాయతీలను పారిశుద్ధ్యం, త్రాగునీరు సరఫరాలో భాగస్తులను చేసి బహిరూమిలో మలవిసర్జను అరికట్టాలని అన్నారు.

అపార్డులో జూలై 2న జరిగిన సదస్సులో కేంద్ర పంచాయితీ రాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ రష్మీ శుక్లాశర్మ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం త్రాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత అంశాలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో యు.ఎన్.డి.పి. ప్రతినిధి మాట్లాడుతూ, బహిర్భూమిలో మలవిసర్జన వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయని ఆ మలవిసర్జన జంతువులు, పక్షుల కాళ్ళకు అంటే తిరిగి మన గృహాలలో అనారోగ్యాన్ని కల్గిస్తున్నాయని, అందుకు తగిన చర్యలు పాటించాలని అన్నారు.

అనంతరం అపార్డులోని శయనం వసతి గృహం వద్ద చెట్లు నాటటం జరిగింది. పరిసరాల పరిరక్షణలో గ్రామీణాభివృద్ధి సంస్థలు ఎంతో ముందంజలో ఉన్నాయి.

అపార్డు దేశంలోని SIRD లలో ప్రముఖస్థానం సంపాయించి మంచి కార్యక్రమాలను చేపట్టి శిక్షణ ఇస్తుందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీమతి రష్మీ శుక్లా ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో సి.డబ్ల్యూ.ఎన్, ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

*- సిఎంపి*





# మధ్యాహ్న భోజన పథకం

**మన గ్రామాలలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు వారు, వ్యవసాయ కూలీలు తమ పిల్లలను కూడా తమతో పనులకు తీసుకుపోతున్నారు. అందువలన పిల్లలకు చదువుకునే అవకాశం లేకుండా పోతున్నది.**

**వెనుకబడిన, పేద విద్యార్థులకు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు రప్పించడం కోసం, పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచటం, వీరి హాజరు శాతం తగ్గకుండా చూడడం పిల్లల పోషక స్థాయిని మెరుగుపరచటానికిగాను మధ్యాహ్న భోజన పథకం ప్రాథమిక విద్యా స్థాయిలో సార్వత్రీకరించబడింది.**

గ్రామీణ ప్రాంతాలలో వుండే లక్షలాది మంది ప్రజల అవసరాలనును తీర్చడానికి దోహదం చేసే విధంగా పంచాయతీరాజ్ సంస్థలను పునరుజ్జీవనం, బలోపేతం చేయడానికి ఈ పథకం నిర్దేశించబడింది.

### పంచాయితీరాజ్ సంస్థలకు బదలాయించిన విద్యాశాఖకు చెందిన విధులు

* ప్రతీ గ్రామపంచాయితీలో గ్రామ సర్పంచ్ అధ్యక్షునిగా, ఒక మహిళా వార్డు సభ్యురాలు, షెడ్యూల్డు కులాలు/తెగలు, వెనకబడిన తరగతులకు చెందిన ఇద్దరు వార్డు సభ్యులతో విద్యకు సంబంధించిన ఒక ఉపకమిటీని ఏర్పాటు చేయాలి.
* ఈ విద్యా ఉపకమిటీ గ్రామ పంచాయితీ పరిధిలో గల అన్ని పాఠశాలల పనితీరుని పర్యవేక్షించే అధికారం కలిగి ఉంటుంది. సిబ్బంది రోజువారీ హాజరు, పాఠశాలలో బోధించే విద్యా ప్రమాణాలు, పాఠశాల యందు గల భౌతిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందించే పదార్థాల నాణ్యత మొదలైన వాటిని పర్యవేక్షించే అధికారం కలిగి ఉంటుంది.



| | | ఒక విద్యార్థికి కేటాయించిన క్వాంటిటీ | | క్యాలరీస్ గ్రాములలో | |
|---|---|---|---|---|---|
| క్ర సం | ఐటమ్ | ప్రైమరి | అప్పర్ ప్రైమరి | ప్రైమరి | అప్పర్ ప్రైమరి |
| 1. | బియ్యం (Rice) | 100 గ్రా॥ | 150 గ్రా॥ | 330 | 510 |
| 2. | పప్పులు (Pulses) | 20 | 30 | 60 | 100 |
| 3. | కూరగాయలు (Leaf.also) | 50 | 75 | 25 | 30 |
| 4. | ఆయిల్ | 5 | 7.5 | 25 | 30 |
| 5. | ఉప్పు మరియు ఇతరాలు | అవసరం మేరకు | అవసరం మేరకు | - | - |
| 6. | గ్రుడ్లు / పండ్లు | వారానికి రెండు సార్లు | వారానికి రెండు సార్లు | 200 గ్రా | 200 గ్రా |

* గ్రామ పంచాయతీలో గల అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, విద్యార్థుల నమోదు, గైర్హాజరు, డ్రాపవుట్, విద్యార్థుల వివరాలు పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్, పుస్తకాలు, భవన మరమ్మత్తులు తదితర విషయాలను చర్చించి తగు చర్యలు తీసుకోవాలి. పై విషయాలపై తనిఖీ చేసి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నదీ లేనిదీ సరిచూసుకోవాలి.

ప్రభుత్వ పథకాలైన సర్వశిక్షా అభియాన్, మధ్యాహ్న భోజన పథకాలు మన గ్రామాలలో ఎలా అమలు అవుతున్నాయో పర్యవేక్షించాలి. గ్రామ విద్యావసరాలను గ్రామ పంచాయితీలో చర్చించాలి. పర్యవేక్షణలో ఏదైనా లోపాలను కనుగొన్నట్లైతే సంబంధిత అధికారులైన యం.ఇ.ఓ, యం.పి.డి.ఓలకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలి. అంతేకాకుండా తగు చర్య తీసుకునే విధంగా అధికారులను సంప్రదించాలి.

గ్రామ విద్యా ప్రణాళికలలో పొందుపరచిన అంశాలను చర్చించాలి. ప్రణాళికలో పొందుపరచిన అంశాల అమలును సమీక్షించాలి.

* పథకం అమలు తీరును పర్యవేక్షించాలి.
* పథకానికి సంబంధించిన రికార్డులను, లెక్కలను పరిశీలించాలి.
* మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పిల్లలకు అందేటట్లు చర్యలు గైకొనవలెను.
* వందశాతం విద్యార్థులు బడికి హాజరు అయ్యేటట్లుగా చర్యలు తీసుకోవాలి.

**మధ్యాహ్న భోజన పథకం మెను**

| క్ర.సం. | స్టేజి | కేంద్రం | రాష్ట్రం | మొత్తం |
|---|---|---|---|---|
| 1. | ప్రైమరి | రూ. 1.88 | రూ. 1.67 | రూ. 3.55 |
| 2. | అప్పర్ ప్రైమరి | రూ. 2.81 | రూ. 1.15 | రూ. 3.96 |

*పై ధర ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేది నాటికి 7.5% పెంచబడుతుంది.*

* విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు వంట చేసే స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు ఉంటే, సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకుని వెళ్ళాలి.

### మధ్యాహ్న భోజన పథకం నిధులు

* జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖధికారి నోడల అధికారిగా ఈ పథకానికి అయ్యే నిధులను విడుదల చేస్తారు.
* మండల స్థాయిలో మండల విద్యా శాఖాధికారి, మండల తహశీల్దారు ఆహారధాన్యాలను ప్రతి పాఠశాల/అమలు పరిచే ఏజెన్సీకి విడుదల చేస్తారు.
* పాఠశాల స్థాయిలో సంబంధిత ప్రధానోపాధ్యాయులు/అమలు పరిచే ఏజెన్సీ వారికి అవసరమయ్యే ఆహార ధాన్యాలను విడిపించుకుని నిల్వ చేస్తారు.

# గంగా యమున నదుల ప్రక్షాళన కార్యక్రమం

జల వనరులు, పారిశుద్ధ్యం రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు, నదులలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టే అంశం స్థానిక రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినది. కాలుష్య నివారణకు సంబంధించి రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలకు కేంద్రం సహాయ సహకారాలను మాత్రమే అందించగలదని కేంద్ర జలవనరుల



శాఖ సహాయమంత్రి శ్రీ సంతోష్ కుమార్ గంగ్వార్ రాజ్యసభకు తెలియజేశారు.

గంగా నదిని శుద్ధి పరిచేందుకుగాను ప్రధానమంత్రి అధ్యక్షతన 2009లో నేషనల్ గంగా రివర్ బేసిన్ అథారిటీ (ఎన్‌జిఆర్‌బిఎ)ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలియజేశారు.

గంగతోపాటు యమునా నదిలో కూడా కాలుష్యాన్ని తొలగించేందుకు ఎన్‌జిఆర్‌బిఎ కృషి చేస్తోందని తెలిపారు. ఈ సంస్థ ఏర్పాటైన నాటి నుంచి గంగానది ప్రవహించే రాష్ట్రాల్లో కాలుష్యాన్ని నివారించేందుకు 76 ప్రాజెక్టులు చేపట్టి 5004,19 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది.

ఇందులో ఇప్పటివరకు 1229.87 కోట్ల రూపాయలను విడుదల చేశారు. రూ. 838.76 కోట్లను ఈ సంవత్సరం మార్చి మాసాంతం వరకు ఖర్చు చేశారు. గంగానదిని శుద్ధిపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖలతో సంప్రదింపులు జరిపి చర్యలు చేపడుతోందని శ్రీ సంతోష్‌కుమార్ తెలియజేశారు.

# పరిపూర్ణత దిశగా పంచాయతీరాజ్

**గాంధీజీ కలలుగన్న స్వతంత్ర భారతదేశం సాకారం కావాలని భావించే వారందరికీ మా నివేదికను ఈ వ్యాసం ద్వారా పరిచయం చేస్తున్నాం. తాను ఆశించిన 'స్వతంత్ర భారతావని స్వప్నం' అనే అంశంపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా గాంధీజీ తన పత్రిక 'యంగ్ ఇండియా' 1930 సెప్టెంబర్ 10 సంచికలో ఇలా జవాబిచ్చారు.**

**"పేదలు ఇది నా దేశం అని భావించే భారతదేశం కోసం నేనే పని చేస్తాను. అలా దేశాన్ని రూపొందించడంలో పేదవాని వాణికి ప్రాధాన్యత ఉండాలి."**

నివేదిక ముఖచిత్రాన్ని ఈ దృష్టితో రూపొందించడంతో పాటు, నివేదిక అంతటా ఇదే భావం కనిపిస్తుంది.

దేశంలో నిరుపేద భారతీయుడైన ఆమ్ (సామాన్య పౌరుడు) కి తనలాంటి 15-20 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపిలు ఉండే పార్లమెంటు పట్ల తనదనే భావన లేదు. అంతేకాకుండా సుదూర రాష్ట్ర రాజధానులలోనో లేదా ఢిల్లీలోనో లేదా అందుబాటులో లేని కలెక్టర్ కార్యాలయాలలోనో తీసుకునే నిర్ణయాలలో తన వాణికి ప్రాధాన్యత లేదనే భావన కూడా ఆమ్ ఆద్మీలో ఉంది.

స్వాతంత్ర్యం వచ్చిన 65 ఏళ్ల తరువాత కూడా దాదాపుగా భారతీయులందరూ తాము రాజకీయ, పరిపాలన ప్రక్రియల నుండి వేరు చేయబడినట్లుగా భావిస్తున్నారు. ఈ భావన ఆర్థిక, సామాజిక క్రమానుగతిలో కిందికి వెళ్తున్న కొద్దీ ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా తమ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలను భౌగోళికంగా దూరంగా ఉండే 'భవన్'లు తమపై రుద్దుతున్నాయనే భావన కూడా ఉంది. ఆరున్నర దశాబ్దాల ప్రజాస్వామ్యంలో దేశాన్ని బాగు చేసుకోవడంలో సామాన్య ప్రజల వాణికి ప్రాధాన్యత అనేది సుదూర స్వప్నంగానే మిగిలింది. నాటి వలస పాలనలో తమ తల్లిదండ్రులు, తాత, ముత్తాతల లాగానే తమ పరిస్థితి కూడా ఉందనే భావన సామాన్యులలో నెలకొని ఉంది.



ఒక ఆశా కిరణమేమిటంటే గాంధీ ప్రవచించిన ఐదు సూత్రాల వైపు తిరిగి దృష్టి సారించడమే. మన ప్రజాస్వామ్య వ్యవస్థలను పంచాయతీరాజ్ పునాదులపై నిర్మించాలనేది గాంధీజీ వాంఛ. ఈ విషయం శ్రీమన్ నారాయణ అగర్వాల్ 1964లో రచించిన 'ఎ గాంధీ కాన్‌స్టిట్యూషన్ ఫర్ ఇండిపెండెంట్ ఇండియా' (స్వతంత్ర భారతదేశానికి గాంధీ రాజ్యాంగం) అనే పుస్తకం ద్వారా వెల్లడైంది. ఈ పుస్తకాన్ని తాను సంపూర్ణంగా ఆమోదిస్తున్నానని గాంధీజీ దానికి రాసిన తొలి పలుకుల్లో పేర్కొన్నారు.

అనేక ప్రయాసల తరువాత తుదకు గాంధేయ సూత్రాలలోని కీలక అంశాలను 1992 డిసెంబర్‌లో 73, 74వ సవరణల ద్వారా ఏకగ్రీవంగా రాజ్యాంగంలో చేర్చారు. అనంతరం రాజ్యాంగం పదవ భాగంలో అవసరం మేరకు 1996 డిసెంబర్‌లో పంచాయతీల నియమాల (షెడ్యూల్డు ప్రాంతాల్లో విస్తరణ) చట్టం 1996 (పీసా) తీసుకువచ్చారు. పంచాయతీరాజ్ వ్యవస్థలను 'స్వపరిపాలన వ్యవస్థలు'గా రాజ్యాంగం పేర్కొంటుంది. ఇది పంచాయతీలకు సాధికారత కల్పించడంలో కీలకమైనది.

సుమారు పాతికేళ్ల తరువాత మనకు కొన్ని పంచాయతీరాజ్‌లు ఉన్నప్పటికీ 'పరిపూర్ణ' పంచాయతీరాజ్‌లు లేవు. ఈ లోటును సరిచేసే లక్ష్యంతో మేం నివేదిక రూపొందించాం. మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే ప్రజలకు ప్రభావంతంగా సేవలను అందించడం ద్వారా విఫలమైన అధికార యంత్రాంగం(బ్యూరోక్రాటిక్) తరహా నిర్వహణా వ్యవస్థ నుంచి భారాన్ని తొలగించాలనేది మా నివేదిక లక్ష్యం.

ప్రస్తుత అధికార యంత్రాంగ నిర్వహణా వ్యవస్థ నాటకీయంగా ఎలా విఫలమైందో చెప్పేందుకు రెండు త్రోసివుచ్చలేని సచిత్ర వాస్తవాలు ఉన్నాయి. మొదటిది ఏమిటంటే - ఆర్థిక సంస్కరణలు ప్రారంభించినప్పటి నుండి సామాజిక రంగానికి, పేదరిక నిర్మూలనా పథకాలకు కేంద్ర బడ్జెట్ వ్యయం 25 వంతులు (1992-93లో రూ.7,500 కోట్ల నుంచి ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్ల)కు పెరిగింది.

అదే సమయంలో ఐక్యరాజ్యసమితి మానవాభివృద్ధి సూచికలో మన దేశం అప్పటి నుండి ఇప్పటి వరకు మన స్థానం 135 దగ్గరే కొట్టుమిట్టాడుతుంది. ఇది అలీస్ ఇన్ వండర్‌ల్యాండ్ మాదిరిగా ఉంది. ఎంత వేగంగా మనం పరిగెట్టినా, ఎక్కడ మొదలయ్యామో అక్కడే ఉన్నాం. దీనిని నివేదిక 'ట్రెడ్‌మిల్ గ్రోత్'గా అభివర్ణించింది.

ఇక రెండవ వాస్తవం ఏమిటంటే, పన్నెండవ పంచవర్ష ప్రణాళిక నివేదికల ప్రకారం మన ఆర్థిక వ్యవస్థ గత ప్రణాళిక కాలం కంటే సుమారు ఎనిమిది శాతం వృద్ధి సాధించినప్పటికీ, పేదరిక నిర్మూలనా రేటు మాత్రం గత పదకొండేళ్ళలో 0.8 శాతం లోపే ఉంది. దీని సగటు ఏటా 1.5 శాతం వరకు ఉంది. ఇలా అంతరాలు, అసమానతలు పెరిగి పోతున్నాయి. సంస్కరణలు ద్వారా పెరిగిన ప్రభుత్వ ఆదాయాలను పూర్తిగా వినియోగించడంలో సమిష్టి వైఫల్యం కనబడుతుంది.

కేంద్ర ప్రభుత్వం 150కి పైగా పథకాలు ప్రవేశపెట్టినా, 25 ఏళ్ల క్రితం ఊహించినదాని కంటే ఎక్కువ నిధులు కేటాయించినా ఫలితం లేకుండాపోతుంది. ఇంత ఘోరంగా వనరులు వృధా అవడం ఎంతో బాధ కలిగిస్తుంది. ఇది 2007లో ఆర్థిక వ్యవస్థలోని ఉత్పాదక రంగాలకు రూ. 25 లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజీ ఇచ్చినా వృద్ధి రేటు పడిపోవడం, సబ్సిడీలలో లీకేజీలు పేరుతో నష్టపోవడం కంటే ఎంతో బాధకలిగించే అంశం.

దివంగత డాక్టర్ అర్జున్‌సేన్ గుప్తా 2007లో ఇచ్చిన నివేదికలో గుర్తించిన 70 శాతం పేద, అణగారిన వర్గాల ప్రజలకు వనరుల్లో వారి భాగం పంచనంత వరకు వారు వృద్ధి చెందరు, వారికి న్యాయం జరగదు. పెరుగుతున్న జాతీయ ఆదాయాన్ని సమంగా పంచడాన్ని ప్రోత్సహించినప్పటికీ, ఈ అంశం నిపుణుల కమిటీ పరిశీలనాంశాలలో లేదు. అయితే ఎనిమిదవ షెడ్యూలులో 29 రకాల ప్రభుత్వ సరుకులు, సేవల అంశం పంచాయతీరాజ్ పరిధిలో ఉన్నందున, పై అంశాన్ని కూడా మేము తాకినట్లయింది.

వివిధ అంశాలకు సంబంధించిన పలు కేంద్ర ప్రాయోజిత పథకాల (సిఎస్ఎస్)ను ఏడవ షెడ్యూలులోని రాష్ట్ర జాబితాలో చేర్చినప్పటికీ ఆచరణలో నిధులు మాత్రం కేంద్ర ప్రభుత్వం నుంచే వస్తాయి. వీటిని సిఎస్ఎస్ మార్గదర్శకాల ఆధారంగా వినియోగించాలి. వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. అయితే ఈ పథకాలకు సంబంధించి ఢిల్లీలో పనిచేసే జాయింట్ సెక్రెటరీ పనిలో 80 శాతం సమయం మార్గదర్శకాలకు అనుగుణంగా పథకాల అమలు, వినియోగ పత్రం (యూటిలైజేషన్ సర్టిఫికేట్) జారీలకే పరిమితమవుతోంది.

దురదృష్టవశాత్తు పంచాయతీరాజ్ సంస్థలకు విధులు, నిధులు, అధికారాలు అప్పగించడంలో సిఎస్ఎస్ మ్గాదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వాలు అరుదుగా పాటిస్తున్నాయి. వీటి నిర్వహణలో పంచాయతీరాజ్‌ను రాష్ట్రాల అధికార యంత్రాంగ వ్యవస్థ కేవలం ఒక ప్రత్యామ్నాయంగా, నామమాత్రంగానే భావిస్తూ, ఇతర ఏజెన్సీలు లేదా సమాంతర రిజిస్టర్డ్ సొసైటీలు (వీటి ఖాతాలను స్థానిక సంస్థలు లేదా కాగ ఆడిట్ చేయవు) ద్వారా కేంద్ర పథకాల లబ్దిని పంపిణీ చేయిస్తారు. ఫలితంగా లక్షిత లబ్దిదారులకు ప్రయోజనాలు అందించడంలో జవాబుదారీతనం లోపిస్తుంది.

స్థానిక ప్రజలకు బాధ్యత లేకపోవడం, పారదర్శకత లేకపోవడం తదితర అంశాల కారణంగా, పెద్ద యెత్తున నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ లబ్ధిదారులను అడుక్కునే విధంగా చేయడం లేదా మౌన ప్రేక్షకులుగా మార్చడం కనిపిస్తోంది.

ఫలితంగా 73, 74వ రాజ్యాంగ సవరణలు చేసినప్పటికీ కేంద్ర ప్రాయోజిత పథకాలలో పంచాయతీరాజ్ సంస్థలకు ఎలాంటి పాత్ర లేకుండా పోయింది. దీంతో దేశంలో అత్యంత పేదలు ప్రభుత్వ వ్యవస్థలో తమకు స్థానం లేదనే భావనలోనే ఉన్నారు. అయితే ఇందుకు రెండు మినహాయింపులు ఉన్నాయి.

మహాత్మాగాంధీ ఎన్ఆర్ఇజిఎస్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు (బిఆర్‌జిఎఫ్). ఈ రెండిటిలో పంచాయతీరాజ్ సంస్థలు, క్షేత్రస్థాయి ప్రణాళికలదే ముఖ్యపాత్ర. అత్యంత వెనుకబడిన జిల్లాలను ఉద్దేశించి రాజ్యాంగానికి అనుగుణంగా తప్పనిసరిగా జిల్లా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ పద్ధతిని అభివృద్ధి చెందిన జిల్లాలకు, ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల్లో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు విషయంలో ఎందుకు అనుసరించరు?

ఇక వామపక్ష తీవ్రవాద ప్రభావిత గిరిజన జిల్లాల్లో కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు పరిస్థితి భయానకంగా ఉంది. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు సంబంధించి 2008లో ప్రణాళికా సంఘం వేసిన దేబు బందోపాధ్యాయ కమిటీ ఇచ్చిన నివేదికను ఆ తరువాత పట్టించుకోలేదు. అభివృద్ధి పథకాల అమలుకు సరైన యంత్రాంగం లేని ఐదవ షెడ్యూలు ప్రాంతాల (వామపక్ష తీవ్రవాదం ఎక్కువగా ఇక్కడే ఉంది)లో అంటే వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలలో సమీకృత కార్యచరణ ప్రణాళికలో భాగంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బిఆర్‌జిఎఫ్‌ను) కలపాలి.

**పీసా కింద పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలి. స్థానికుల్లో తాము అభివృద్ధికి దూరమయ్యామనే భావనను తొలగించాలి. అందుకు వారిని అభివృద్ధిలో భాగస్వాములుగా చేయాలి. ప్రణాళిక, దాని అమలులో వారి ని భాగస్వామ్యం చేయనంత వరకు సమ్మిళిత అభివృద్ధి సాధ్యం కాదు. సమిష్టి పాలన లేని సందర్భంలో అనివార్యంగా అధికారయంత్రాంగంపై ఆధారపడాల్సి వస్తుంది. తద్వారా అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ప్రజల భాగస్వామ్యం ఉండదు.**

గడిచిన దశాబ్దంలో కేంద్ర ప్రాయోజిక కార్యక్రమాల అమలులో పంచాయతీరాజ్ వ్యవస్థల పాత్ర, వికేంద్రీకరణ వంటి అంశాలను అధికార యంత్రాంగం సరిగా అర్థం చేసుకోలేకపోయిన విషయాన్ని మా నివేదికలో నొక్కి చెప్పాం. అందుకే సిఎస్ఎస్‌ల అమలులో అనేక చర్యలు విఫలమయ్యాయి. మా నివేదిక ప్రధానంగా పంచాయతీరాజ్ సంస్థలను ప్రణాళిక రూపకల్పన మొదలు అమలు వరకు నిధులు, విధులు, అధికారాలను వికేంద్రీకరించాలని సూచించడంతో పాటు, ఎనిమిది ముఖ్య కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలకు సంబంధించిన మోడల్ యాక్టివిటీ మ్యాప్ (నమూనా కార్యాచరణ పటం) లను కూడా రూపొందించింది. వీటిని శాస్త్రీయంగా, ప్రజా పరిపాలన అనే మౌలిక సిద్ధాంతాల ఆధారంగా తయారు చేశాం.

కింది స్థాయిలో చేయవలసింది. ఆ స్థాయిలోనే చేయాలే తప్ప ఉన్నత స్థాయిలో కాదనేది దీని ఉద్దేశం. అలాగే కింది స్థాయిలో సాధ్యం కానిది, సంబంధిత ఉన్నత స్థాయిలోనే చేయాలే తప్ప కింది స్థాయిలో కాదు. ఏదైనా నిర్దేశిత కార్యక్రమానికి సరైన స్థాయిని గుర్తించాలని, వివిధ కేటగిరీలను రూపొందించాలని, సరైన స్థాయిలో సరిపడ వికేంద్రీకరణ జరపాలని మా ఉద్దేశం.

నివేదికలోని నాలుగవ భాగంలో కార్యచరణ పటాలను చేర్చాం. ఇందులో మరింత లోతుగా తీసుకోవాల్సిన చర్యలను వివరించాం. అంటే పంచాయతీరాజ్ సంస్థలకు నిధులు, విధులు, అధికారాల ను వికేంద్రీకరించడం ద్వారా కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు బాధ్యతను వాటికి తప్పనిసరిగా అప్పగించడం వంటివి.

ఉదాహరణకు సర్వశిక్ష అభియాన్ మార్గదర్శకాలను కమిటీ పరిశీలించగా, పిల్లలకు అక్షరమాల నేర్పేందుకు ముందు 325 కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంది. అందులో 200 పనులు తప్పనిసరిగా కేంద్రం లేదా రాష్ట్రం స్థాయిలో చేయవలసినవి కాగా, వంద పనులు జిల్లా లేదా ఉప జిల్లా లేదా పాఠశాల స్థాయిలో చేయవలసినవి. కమిటీ సర్వశిక్ష అభియాన్ అమలుకు రూపొందించిన నమూనా కార్యకలపాల పటం ప్రకారం ప్రస్తుతం పని విభజన ఆరు

స్థాయిల్లో (కేంద్రం, రాష్ట్రం, జిల్లా పంచాయతీ, మధ్యంతర పంచాయతీ, గ్రామపంచాయతీ, పాఠశాల) ఉండగా, వాటన్నిటినీ పంచాయతీరాజ్ సంస్థ స్థాయికి తీసుకురావచ్చు. లేదంటే పంచాయతీరాజ్ సంస్థకు, స్థానిక సమూహానికి గ్రామ సభ/ వార్డు సభ ద్వారా జావాబుదారీ తనం కల్పించే రీతిలో సంబంధం నెలకొల్పవచ్చు.

అంతేకాకుండా ఈ పటం నిధులు, ఏజెన్సీలు, అధికార యంత్రాంగం లేదా నిపుణులు భాగస్వామ్యం ఏ మేరకు ఉండాల నే కార్యక్రమాలకు సంబంధించి రాష్ట్రాలకు అనుగుణంగా నమూనా పటాన్ని రూపొందించి, వాటిని రాష్ట్రాలకు అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశం ఉండాలని నివేదిక సిఫార్సు చేసింది. అయితే మార్పులపై కేంద్రంతో సంప్రదించడంతో పాటు, ఎన్ని మార్పులు, చేసినప్పటికీ కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలలో పంచాయతీరాజ్ సంస్థలు కేంద్రంగా ప్రతీ రాష్ట్రం పటం రూపొందించుకోవడం తప్పనిసరి.

ఈ శాస్త్రీయమైన వికేంద్రీకరణ పద్ధతి ద్వారా రాష్ట్ర ప్రయోజనాలు, పంచాయతీరాజ్ సంస్థల ప్రయోజనాలకు నడుమ ఘర్షణకు తావు లేకుండా ఉంటుంది. ఆరు స్థాయిలు కూడా పథక విజయవంతానికి సహకారులుగా ఉండడంతో మంచి ఫలితాలు సాధించవచ్చు. ఎవరు కూడా వదిలివేయబడరు. అందరూ అభివృద్ధిలో భాగస్వాములవుతారు. తద్వారా గాంధీ స్వప్నం క్రమంగా వాస్తవరూపం దాలుస్తుంది.

కమిటీ సూచించిన పద్ధతి అమలు చేస్తే పంచాయతీరాజ్ వ్యవస్థ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అని, కేంద్రం ఈ విషయంలో ఏమి చేయలేదనే భావన తొలిగిపోతుంది. అయితే పంచాయతీల బలోపేతానికి రాజకీయ సంకల్పం లేదనే సాధారణ అభిప్రాయం ఉంది. అది సరైంది కాదు. రాజకీయ సంకల్పమే లేనట్లయితే రాజ్యాంగానికి సుదీర్ఘమైన, వివరణాత్మక సవరణలను పార్లమెంటు ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించేవే కావు.

రాజకీయ సంకల్పమే లేకుంటే రాజ్యాంగ సవరణలకు రాష్ట్రపతి ఆమోదానికి ముందు నాలుగు నెలల్లోనే సగం రాష్ట్రాల శాసనసభల సమ్మతం రాకపోయేది. రాజకీయ సంకల్పమే లేకుంటే పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి తప్పనిసరిగా పాటించాల్సిన రాజ్యాంగ అంశాలు వెలుగు చూసేవే కావు. తద్వారా రాష్ట్రాలలో చట్టానికి ఆమోదం, క్రమం తప్పకుండా పంచాయతీ ఎన్నికల నిర్వహణ, స్థానిక, కాగా, సామాజిక తనిఖీలు జరిగేవే కావు. అంతేకాకుండా 15 రాష్ట్రాలలో మహిళలకు 33 శాతం నుండి 50 శాతం వరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు పెంచేవారే కాదు.

రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య అమలులో తీవ్రమైన తేడాలు ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ సంస్థలకు అధికార వికేంద్రీకరణ విషయంలో కేరళ, కర్నాటక, తాజాగా మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలు ముందున్నాయి. ఈ విషయంలో ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ వెనుకబడి ఉన్నట్లు గడిచిన రెండు దశాబ్దాలలో పంచాయతీరాజ్‌లపై నిర్వహించిన సర్వేలో తేలింది. అధికార వికేంద్రీకరణలో కొన్ని రాష్ట్రాలు వెనుకబడినా, కొన్ని రాష్ట్రాలు చాలా ముందుండి, మంచి ఫలితాలు సాధించాయి. ఇందుకు అనేక ఉదాహరణలు మదిలో మెదులుతున్నాయి.

కేరళ రాష్ట్రం పంచాయతీరాజ్‌లు లేని పరిస్థితి నుండి 1990వ దశకం ద్వితీయార్థకంలో ఒక్కసారిగా ప్రథమ స్థానానికి చేరింది. త్రిపుర కూడా గత దశాబ్దంలో ఇలాగే భారీ ముందడుగు వేసింది. ఇటీవల కాలంలో బీహార్ నిస్పృహ నుండి ఆశావహ స్థితి దిశగా పయనిస్తోంది. హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు మంచి పురోగతిని సాధించాయి. పర్వత రాష్ట్రాలైన సిక్కిం, ఉత్తరాఖండ్‌లలో కూడా ఇది సాధ్యమేనని నిరూపితమైంది. గోవా వంటి చిన్న రాష్ట్రాలలో కూడా మంచి పనితీరును కనబరిచాయి. అస్సాం, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ వంటి పెద్ద రాష్ట్రాలలో ఆరంభం బాగానే ఉన్నా, తరువాత కొంత స్తబ్దత నెలకొంది. ఇటీవల కాలంలో మహారాష్ట్రను మినహాయిస్తే ఐదవ షెడ్యూలు ప్రాంతంలో ఉన్న తొమ్మిది రాష్ట్రాలలో పీసా అమలులో నిరుత్సాహజనక ఫలితాలు కనిపించాయి. ఈ జాబితా అసంపూర్ణంగా ఉన్నప్పటికీ రాజకీయ సంకల్పం లేదనే వాదనలను మాత్రం కొట్టిపారేస్తుంది.

అన్నింటికంటే ప్రధానంగా లోపించిందేమిటంటే అధికార యంత్రాంగ సంకల్పం. ఇది ప్రత్యేకించి ఢిల్లీలో కనిపిస్తుంది. ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ పగ్గాలు చేపట్టిన నెల రోజుల్లోనే (2004 జూన్ 29న) 'గ్రామీణ ప్రగతి, పంచాయతీరాజ్‌ల ద్వారా పేదరిక నిర్మూలన' అనే అంశంపై ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో ప్రధాని చేసిన ప్రారంభోత్సవ ప్రసంగంలో అనేక అంశాలను నివేదిక విస్తృతంగా ఉటంకించింది.

ఈ ప్రసంగంలో ప్రధాని పంచాయతీరాజ్ వ్యవస్థకు సూచించిన బలమైన, సమగ్రమైన రోడ్‌మ్యాప్‌నే కమిటీ నివేదికకు నమూనగా స్వీకరించింది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల (సిఎస్‌ఎస్) మార్గదర్శకాలను సరిచేయాలని అన్ని సిఎస్-ఎస్ కార్యదర్శులకు సర్క్యులర్ పంపాల్సిందిగా క్యాబినెట్ కార్యదర్శిని ప్రధాని ఆ సందర్భంగా ఆదేశించారు. అందుకు అనుగుణంగా 2004 నవంబర్ 8న క్యాబినెట్ కార్యదర్శి సర్క్యులర్ పంపి, రెండు నెలల్లో నివేదికను పంపాలని కార్యదర్శులను ఆదేశించారు.

అక్కడితోనే ఆ పని ఆగిపోయింది. మూడేళ్ళ తరువాత ఏ కేంద్ర మంత్రిత్వ శాఖ కూడా ప్రధాని ఆదేశాలను పట్టించుకోనట్లు తేలింది. నాటి కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి (ప్రస్తుత వ్యాస రచయిత) ఈ అంశంపై కేంద్ర క్యాబినెట్ సెక్రెటేరియెట్‌లో ఒక కార్యదర్శి, పంచాయతీరాజ్ కార్యదర్శితో కూడిన కమిటీని వేయించగలిగారు. ఈ కమిటీ కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల అమలుకు పంచాయతీరాజ్‌లకు అధికార వికేంద్రీకరణపై ఇతర కార్యదర్శులతో మాట్లాడి, కార్యకలాపాల పటాన్ని రూపొందించాలి. ఇందుకు మూడింట రెండొంతుల నిధులు ఖర్చయ్యే 15 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఎంపిక చేశారు. ఎట్టకేలకు ఈ కమిటీ కసరత్తు పూర్తి చేసి 2008 జనవరి 22న క్యాబినెట్ కార్యదర్శికి నివేదిక సమర్పించింది. కాని దానిపై తగిన చర్యలు తీసుకోలేదు. గత ఐదేళ్ళలో ఈ విషయం కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖల మధ్య నలుగుతోంది.

యుపిఏ-1 అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళల్లో రాజ్యాంగంలో ఆశించిన జిల్లా ప్రణాళికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్ళాలని ప్రణాళిక సంఘం భావించింది. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కోసం పాటుబడిన కేరళ రాష్ట్ర ప్రణాళిక మండలి మాజీ ఉపాధ్యక్షులు వి. రామచంద్రన్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. రామచంద్రన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా రాష్ట్ర ప్రణాళికలో జిల్లా ప్రణాళికలను చేర్చిన తరువాతే ఆమోదం కోసం తమ వద్దకు రావాలని ప్రణాళిక సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది. దురదృష్టవశాత్తు ప్రణాళిక సంఘం మార్గదర్శకాలను కోల్డ్ స్టోరేజీలో పెట్టింది. ప్రణాళిక సంఘం 2009 ఏప్రిల్ 1న జారీ చేసిన జిల్లా ప్రణాళిక మాన్యువల్‌ను

స్వయంగా పక్కన బెట్టింది. పంచాయతీరాజ్‌పై ఎన్‌డిసి నియమించిన సాధికార ఉపసంఘం నివేదికను కూడా ప్రణాళిక సంఘం బీరువాలో పెట్టింది.

దీనిని బట్టి పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజకీయ సంకల్పం లేకపోవడం కారణం కాదని, అధికార యంత్రాంగం వ్యతిరేకతే ప్రధాన అడ్డంకి అని అవగతమవుతోంది. మరో విధంగా చెప్పాలంటే సుమారు దశాబ్దం క్రితం మెరుగుపరిచిన కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల మార్గదర్శకాల అమలు విషయంలో వికేంద్రీకరణ అంశాన్ని అర్థం చేసుకోవడంలో అధికార యంత్రాంగం అసమర్థతే కారణం. ఈ లోపాన్ని ఎనిమిది ప్రధాన కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల అమలు తీరును వివరించడం ద్వారా మా నివేదిక ఎత్తిచూపింది. అంతే కాకుండా సిఎస్ఎస్ మార్గదర్శకాల ద్వారా ఎలా మెరుగైన ఫలితాలు సాధించవచ్చో కార్యకలాపాల పటాల ద్వారా వివరించారు.

కార్యకలపాల పటాల రూపకల్పనతో పాటు పరిపూర్ణమైన పంచాయతీరాజ్ వ్యవస్థ కోసం అవసరమైన విధానపరమైన, సంస్థాగతమైన అంశాలను కూడా కమిటీ లోతుగా పరిశీలించింది. నివేదిక మొదటి భాగంలో విస్తృత విధాన అంశాలు, వికేంద్రీకరణకు రాష్ట్రాల చర్యలు, జిల్లా ప్రణాళికల్లో సాంకేతిక అంశాలు, పంచాయతీల ఆర్థిక అంశాలు, శిక్షణ, సామర్థ్య పెంపుదల అంశాలు, పంచాయతీలలో మహిళలు, ఎన్.సి., ఎన్.టి., వికలాంగులు, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలను పంచాయతీ వ్యవస్థలో భాగస్వామ్యం చేయడం గిరిజనులకు ఐదవ షెడ్యూలు ద్వారా సంక్రమించిన న్యాయ, రాజ్యాంగ హక్కులు, 73వ సవరణ, పీసా, అటవీ హక్కుల చట్టం, తదితర అంశాల గురించి లోతుగా వివరించారు.

రెండవ భాగంలో సంస్థాగత అంశాలతో పాటు పదకొండవ షెడ్యూలులో సూచించిన అంశాలకు అనుగుణంగా సిఎస్ఎస్‌ను విభజించడం వంటి విషయాలను వివరించారు. ఇందులో గ్రామీణ ఉపాధి, గ్రామీణ మౌలిక సదుపాయాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక రంగాలు, విద్య, ఆరోగ్యం, మహిళలకు సంబంధించి కార్యక్రమాలు, అణగారిన వర్గాల పథకాల గురించి ఉన్నాయి. చివరి చాప్టర్‌లో ముఖ్యమైన పరిశీలనలు, కమిటీ సిఫార్సులు ఉన్నాయి.

సుమారు 1500 పేజీలు, 5 భాగాలలో ఉన్న నివేదికలోని సిఫార్సుల ను కేవలం 3,500 పదాల వ్యాసంలో వివరించడం అసాధ్యం. కాని మూడు జతల 'అనుబంధ చర్యలు' నివేదికలో ప్రత్యేకంగా నిలిచాయి.

మొదటిది, 'చెడ్డ పంచాయతీరాజ్ ఉండడం పంచాయతీరాజ్ లేకపోవడం కంటే ఘోరమైనది' అని నివేదిక పేర్కొంది. అలాగే పంచాయతీరాజ్ వ్యవస్థ సర్పంచ్‌రాజ్‌గా దిగజారరాదనే అంశాన్ని నొక్కి చెప్పింది. పంచాయతీరాజ్ సంస్థలను ఒక నిస్వార్థ సంస్థగా ఉండేలా చట్టబద్ధంగా, పరిపాలనాపరంగా నిర్మించాలని నివేదిక చివరలో చెప్పింది.

అలాగే పంచాయతీరాజ్‌లకు ఎన్నికయ్యే సభ్యులు కార్యక్రమ రూపకల్పనలో భాగస్వాములు ఉండాలని, కీలక నిర్ణయాలు సమిష్టిగా తప్ప అధ్యక్షుని ఇష్టాయిష్టాలకు అనుగుణంగా తీసుకోరాదని, నిర్ణయాల అమలును పంచాయతీ సభ్యులు కట్టుదిట్టంగా పరిశీలించాలని, గ్రామ/వార్డు సభలకు జవాబుదారీతనం, సామాజిక తనిఖీలను వినియోగించాలని సూచించింది.

ఈ వ్యవస్థకు గ్రామ/వార్డు సభనే ఆధారంగా ఉండాలి. సమాజ అవసరాలు ప్రతిబింబించేలా, సమాజ సంతృప్తి మేరకు ప్రణాళికల ను రూపొందించేందుకు, పదకొండవ షెడ్యూలు, 243జి, 243జెడ్‌డి అధికరణలు ఆశించిన ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ఉద్దేశించిన పథకాలను అమలు చేసేందుకు గ్రామ/వార్డు సభలకు చట్టబద్ధమైన పర్యవేక్షక అధికారాలు కల్పించాలి. ఈ నివేదిక 73, 74వ సవరణల పరిపూర్ణ స్వభావాన్ని సమీపించే విధంగా రాజ్యాంగంలోని అంశాలను అక్షరాక్షరం పరిపూర్ణంగా సాధించేందుకు కృషి చేయాలని సూచించింది.

రెండవ అంశమేమిటంటే, ఈ నివేదిక పంచాయతీరాజ్ సంస్థలకు అవసరమైన భారీ నిధుల గురించి లోతుగా పరిశీలన చేసింది. రాష్ట్ర ఆర్థిక సంఘం సక్రమంగా పనిచేసేందుకు, ఎస్ఎఫ్‌సి సిఫార్సులను అమలు చేసేందుకు, పంచాయతీ అకౌంటింగ్, తనిఖీలపై చేసిన సిఫార్సులతో పాటు, పంచాయతీరాజ్ సంస్థలను సొంత వనరులు పెంచుకునేలా ప్రోత్సాహించాలని నివేదిక సిఫార్సు చేసింది. అలాగే పంచాయతీరాజ్ వ్యవస్థలకు ఏకైక ముఖ్య ఆదాయ వనరుగా నిలిచిన ఆర్థిక సంఘాలను కొనియాడింది.

ఒకవైపు ప్రోత్సాహకాల ప్రాధాన్యతను నొక్కి చెబుతూనే, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాలు అధికారాలను వికేంద్రీకరించాలని, ఇంకోవైపు పంచాయతీరాజ్ సంస్థలు తమ కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనాలను పెంచుకోవాలని సూచించింది. అలాగే ప్రస్తుత పధ్నాలుగవ ఆర్థిక సంఘం పంచాయతీరాజ్ వ్యవస్థకు ఇచ్చే వాటాను 2.5 శాతం నుండి 6-7 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేసింది.

అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న విధానాన్ని పునర్వ్యవస్థీకరించి (1) మౌలిక, పనితీరుపై ప్రోత్సాహకంగా ఇచ్చే గ్రాంట్‌లను రాష్ట్రాల నుండి వికేంద్రీకరించాలని, (2) అలాగే పారదర్శకత, జవాబుదారీతనం అవలంభిస్తున్న పంచాయతీరాజ్ సంస్థలకు మౌలిక, పనితీరు గ్రాంట్‌ల ను ఇవ్వాలని కోరింది. ఈ పద్ధతి పంచాయతీరాజ్ వ్యవస్థకు స్థిరత్వాన్ని ఇవ్వడంతో పాటు అవినీతికి ఆస్కారం తగ్గుతుంది.

అనుబంధ చర్యలలో మూడవ జత ఏమిటంటే రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు, 10 భాగం, పీసా/అటవీ హక్కుల చట్టంలోని అంశాల ను అనివార్యంగా అమలు చేయాలి. తద్వారా ప్రధాని చెప్పినట్లు అంతర్గత భద్రతకు ఏకైక అత్యంత ముఖ్యమైన సవాలుగా మారిన పెరుగుతున్న నక్సలిజం ప్రమాదాన్ని అడ్డుకోవచ్చు. భద్రతా చర్యలకు సంబంధించి జాతీయ ప్రాధాన్యత చర్యల్లో తగిన స్థానం ఉంటుంది. అలాగే అభివృద్ధికి కూడా.

అయితే భాగస్వామ్య పాలన ఆధారిత భాగస్వామ్య లేనంత వరకు పీసాలో ఆశించిన విధంగా అభివృద్ధి, భద్రత అనే రెండు అంశాలు కూడా వాస్తవ రూపం దాల్చవు. పీసాను అమలు చేయడంలో వైఫల్యానికి, ఫలితంగా ఐదవ షెడ్యూలు ప్రాంతాల్లో భద్రత దిగజారడానికి ఒకటి కంటే ఎక్కువ అంశాలు కారణంగా ఉన్నాయి.

ఐదవ షెడ్యూలు ప్రాంతంలో పాలనపై ఆదేశాలు ఇచ్చేందుకు కేంద్రానికి హక్కు (విధి) ఉన్నది. ఐదవ షెడ్యూలు ప్రాంతాల్లో పీసా అమలు వాగ్దానంలో రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం నేపథ్యంలో కేంద్రం ఈ ప్రాంత వ్యవహారాలను తన చేతుల్లోకి తీసుకోవాలని నిరోధించినట్లయితే, ఇతర రాష్ట్రాలు కూడా దానిని అనుసరించి, కింది స్థాయిలో ప్రజాస్వామిక స్థిరతను సాధించేందుకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

*-జి.ఓ.ఐ*

# ప్రణాళికా వికేంద్రీకరణ - ముఖ్యాంశాలు

## జిల్లా ప్రణాళిక రూపకల్పన

ప్రణాళికా సంఘం తయారు చేసిన సమగ్ర జిల్లా ప్రణాళికపై వచ్చిన రిపోర్టు రెండు సంపుటాలుగా వెలువడింది. మొదటి సంపుటంలో భాగస్వామ్య పద్ధతిలో జిల్లా ప్రణాళికా సంస్కరణలను, అమలును వివరించగా, రెండో దానిలో వివిధ భాగస్వామ్య పక్షాలు ఏ విధంగా వాటిని అమలులో పెట్టాలో వివరించబడింది. ఈ సంస్కరణలను ఇంకా చాలా రాష్ట్రాలు సీరియస్‌గా అమలు చేయడం లేదు. దీని క్కారణం కొన్ని సంస్కరణలకు ఇంకా తుది రూపం ఇవ్వకపోవడమే.

జిల్లా ప్రణాళికల్లో సంస్కరణలను ప్రవేశపెట్టడం రాజ్యాంగ పరంగా తప్పనిసరి. కానీ కొన్ని రాష్ట్రాలు వీటికి ఏ మాత్రం ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. మామూలుగానే జిల్లా ప్రణాళికా కమిటి అధికారాలు లేని బలహీనమైన కమిటీ అని అంతా భావిస్తుంటారు. జిల్లా ప్రణాళిక అమలు బాధ్యతను ఈ కమిటీకి ముడి పెట్టడం వల్ల ఆశించినంత ఫలితాలు కన్పించడం లేదు. కొన్ని రాష్ట్రాలలో జిల్లా ప్రణాళికా సంఘాలు సమర్థవంతంగా పని చేస్తున్నందున, సంస్కరణలను, అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించడం లేదు. కానీ మరి కొన్ని రాష్ట్రాలలో జిల్లా ప్రణాళికా సంఘాలు కేవలం రబ్బరు స్టాంప్ వేయడానికి మాత్రమే ఉంటున్నాయి.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను అందుకున్నాక జిల్లా ప్రణాళికా సంఘం దాన్ని ఆమోదించాలన్న నిబంధనను పాటించాలి కాబట్టి, ఈ సంఘం అవసరమవుతుందన్న వాదనలు ఉన్నాయి. జిల్లా ప్రణాళికా సంఘాలలో పూర్తి కాలం పనిచేసే నిపుణులు, అధికారులు ఉండాల్సిన అవసరం ఉంది. వారు జిల్లా ప్రణాళికను సిద్ధం చేయడానికి ఏడాది పొడవునా కృషి చేయడమే కాకుండా వివిధ స్థాయిల్లోని స్థానిక సంస్థలకు ప్రణాళికలు రూపొందించడానికి మార్గ దర్శకత్వం వహించాల్సిన అవసరం ఉంది. ఈ విధమైన ఏర్పాటు ఉంటే జిల్లా ప్రణాళికా సంఘం పటిష్టమవుతుంది.

కొన్ని రాష్ట్రాలలో ఉత్తమ సాంప్రదాయాలను పాటించే జిల్లా ప్రణాళికా సంఘాలను అధ్యయనం చేసి కేంద్ర ప్రణాళికా సంఘానికి రికమెండేషన్లు చేయాలి. అటువంటి ఉత్తమ సంఘాలకు ప్రత్యేక సహాయం అందించాల్సిన అవసరం కూడా ఉంది. నిబంధనల ప్రకారం, ప్రతి గ్రామపంచాయతీ వార్షిక ప్రణాళికలను రూపొందించాల్సి ఉంది. కానీ వాటికి నైపుణ్యం ఉన్నవారు అందుబాటులో ఉండరు. గ్రామస్థాయిలో భాగస్వామ్య ప్రణాళికను రూపొందించి దాని అమలును పర్యవేక్షించేందుకు బ్లాక్ / మండల స్థాయిలో కొంతమేరకు మార్గదర్శకత్వం వహించే వారి అవసరం ఉంటుంది. రిసోర్స్ సెంటర్లుగా పిలువబడే బ్లాక్ స్థాయి సంస్థలకు కూడా నిపుణుల అవసరం ఉంటుంది. ఆ స్థాయిలో చాలా కొద్ది మంది మాత్రమే నైపుణ్యం గల వారుంటున్నారు.

ప్రణాళికా ప్రక్రియ రెండు రకాలుగా ఉంటుంది. మొదటి దాంట్లో గ్రామస్థాయిలో ప్రాధాన్యాలను, కార్యకలాపాలను గుర్తించడం. వాటిని పై స్థాయిలో చర్చించేలా చేయడం, పై స్థాయిలో ఈ ప్రాధాన్యాలన్నింటినీ ఒక చోట చేర్చి విశ్లేషించడానికి కొంత సాంకేతిక నైపుణ్యం అవసరమవుతుంది. ఇక రెండో అంశానికొస్తే, ఒక స్థానిక సంస్థ స్థాయిలో వివిధ రంగాల కార్యకలాపాలను సంఘటితం చేయాల్సి ఉంటుంది. మొదటి అంశంలో పేర్కొన్న విధంగా గ్రామస్థాయిలో ప్రణాళికా ప్రకియను చేపట్టడం చాలా కష్టతరమైన పని. రెండోదానికి, జిల్లా ప్రణాళికలు రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు సాంకేతిక సహాయం ఎక్కువగా అవసరం అవుతుంది.

## జిల్లా ప్రణాళికా స్వరూపం, ప్రణాళికా సంఘాల నిర్వహణ

జిల్లా ప్రణాళికను రూపొందించే ప్రక్రియను ప్లానింగ్ కమీషన్ తయారు చేసిన రిపోర్టులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ప్రక్రియను అన్ని రాష్ట్రాలలో ఎలా ప్రారంభించాలన్నదే ప్రధానమైన సమస్య. జిల్లా ప్రణాళికను తప్పనిసరిగా తయారు చేయాలన్న నిబంధన పెట్టడం ఒక మార్గం. ప్రస్తుతం అమల్లో ఉన్న స్వతంత్ర ప్రణాళికా పద్ధతిలో కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖల కింద నడిచే ప్రధాన పథకాలలో కొన్ని మార్పులు చేయాల్సి ఉంది. అక్కడ ప్రతి రంగానికి ఒక సమగ్ర ప్రణాళిక ఉంటుంది. అది స్వతంత్రమైన ప్రణాళికైనా సమగ్రంగా ఉండాలని అనేక మంత్రిత్వ శాఖలు కోరుతున్నాయి. ప్రణాళిక సమగ్రంగా ఉండాలన్న నిబంధన ఏదీ లేకపోవడం వల్ల కొన్ని రాష్ట్రాలు తమ ఇష్టం వచ్చిన రీతిలో రూపొందించుకొంటున్నాయి. ఒక రంగంలో వేరువేరు లక్ష్యాలతో అమలయ్యే జాతీయ పథకాలకు ఒక విధమైన సమగ్రత ఉండాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు NRHM పథకం కింద రూపొందిన ఆరోగ్య ప్రణాళిక, ICDS పథకంతో నడిచే పోషకాహార కార్యక్రమం లేకుండా అసంపూర్తిగా ఉంటుంది.

అలాగే తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలతో ఆరోగ్య పథకం ముడిపడి ఉంటుంది. పంచాయతీరాజ్ సంస్థలు పటిష్టంగా ఉన్న కొన్ని రాష్ట్రాలు నిధులను ఒక చోట కూడ కట్టడానికి ప్రయత్నం చేశాయి. ఈ ప్రయత్నాలను అట్టడగు స్థాయినుంచి అంటే గ్రామ స్థాయి నుంచి చేయాల్సి ఉంది. అయితే, ఒక పథకాన్ని అమలు చేయాల్సిన శాఖ, ఇతర శాఖల నుంచి నిధులను రాబట్టడం వీలుకాదు కాబట్టి స్వతంత్రంగా ఆ పథకాన్ని కొనసాగించడానికే అటువంటి శాఖలు ఇష్టపడతాయి. అందువల్లనే ఆయా పథకాలు అమలు చేశాక అనుకొన్న లక్ష్యాలను సాధించడంలో విఫలమవుతున్నాయి. ప్లానింగ్ కమీషన్ వంటి సంస్థలు మాత్రమే సమగ్ర జిల్లా ప్రణాళికను రూపొందించి, వివిధ శాఖల పద్దుల కింద మంజూరయ్యే నిధులను కూడగట్టగలవు. అలాగే, ప్లానింగ్ కమీషన్ మాత్రమే రాష్ట్ర ప్రణాళికలను ఆమోదించే అధికారం కలిగి ఉంటుంది. ప్రణాళికలను రాష్ట్రాలు అమలు చేసేందుకు ఈ కింది చర్యలు తీసుకోవాలి.

1. ప్రతి శాఖ జిల్లాల వారీగా ప్రణాళికలు రూపొందించి, వాటికి

## జిల్లా, గ్రామస్థాయి ప్రణాళికలు

సంబంధించిన వనరులన్నింటినీ జిల్లాలకు తెలియజేయాలి.

2. రాష్ట్ర ప్రణాళికా సంఘంతో జిల్లా ప్రణాళికా సంఘం ఛైర్మన్, కార్యదర్శులు తప్పనిసరిగా సమావేశమై జిల్లా వనరులపై చర్చించి విస్తృత స్థాయిలో రాష్ట్రాభివృద్ధికి దోహదపడే అంశాలను చర్చించాలి.

3. స్థానిక సంస్థలకు నిధులను కేటాయించేటప్పుడు, బడ్జెట్‌లో ఏ పద్దుల కింద ఎంత మొత్తాన్ని కేటాయిస్తున్నదీ స్పష్టంగా పేర్కొనాలి.

4. ప్రతి జిల్లాకు ఒక నమూనా టేబుల్ (టెంప్లేట్) ను తయారు చేసి ఆ జిల్లాకు సంబంధించిన ముఖ్యమైన సాంఘిక, ఆర్థిక సూచీలను పొందు పరచాలి. అలాగే రాష్ట్ర ప్రణాళికా సంఘం అన్ని స్థానిక సంస్థలకు సంబంధించిన డేటా బేస్‌ను రూపొందించాలి. అలా చేయడం ద్వారా ముందుచూపుతో ప్రణాళికా రూపకల్పన చేయడం సాధ్యమవుతుంది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ నిధులు అందించేందుకు అన్ని జిల్లాల సమాచారాన్ని ఒక వెబ్‌సైట్‌లో ఉంచి, అందులో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలి.

5. జిల్లాలో శాఖప్రణాళికలను తగిన విధంగా రూపొందించి వాటికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయించాలి.

తమకు అప్పగించిన విధులను అమలు చేయడానికి రాష్ట్రాలు తగిన సహాయం అందించాలి. ప్రతి జిల్లా ప్రణాళికా సంఘంలో ఒక ముఖ్యమైన నైపుణ్యంగల అధికార బృందాన్ని నియమించాలి. జిల్లా, కింది స్థాయిల్లో డేటా బేస్‌ను రూపొందించడానికి, ప్రణాళికలు రూపొందించడానికి కనీస నిధులను కేటాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు సహాయపడాలి. జిల్లా ప్రణాళికా సంఘం పని చేయడానికి కనీస ఆఫీస్ వసతి ఉండాలి. ప్రస్తుతం రాష్ట్ర ప్రణాళికా సంఘాలిస్తున్న సహాయం ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్లాన్‌ప్లస్ వంటి ఆదాయపు పన్నుల సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించేందుకు జిల్లా ప్రణాళికా సంఘానికి ఐ.టి. నిపుణులు కావాలి. జిల్లాలోని NRDMS విభాగాలను, రాష్ట్ర స్టాటిస్టికల్ డైరెక్టరేట్ సిబ్బందిని జిల్లా ప్రణాళికా సంఘం పరిధిలోకి తేవాలి. అటువంటి యంత్రాంగాలు లేని రాష్ట్రాలు కొత్తగా వాటిని ఏర్పాటు చేసుకోవటానికి నిధులందించాలి.

స్థానిక సంస్థల ప్రణాళిక రూపొందించడానికి గ్రామీణ పట్టణ సమగ్రతా విషయాలు, ప్రాదేశిక ప్రణాళికాంశాలు చాలా ప్రధానమైనవి. ప్రతి జిల్లాకు కనీసం ఒక ప్లానింగ్ నిపుణుడు ఉండాలి. రాష్ట్ర ప్రణాళికా బోర్డులలో కనీసం కొంతమంది ప్రొఫెషనల్స్ ఉండాలి. ఒక్కోసారి ప్రాదేశిక రూపంలో ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉండవచ్చు. ప్రాదేశిక ప్రణాళికకు GIS ఫ్లాట్ ఫాంలో మ్యాపులను తయారు చేసి, వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలి. ఈ మ్యాపులను కనీసం జిల్లా స్థాయి వరకైనా రూపొందించాలి. ముఖ్యమైన సిబ్బంది, ముఖ్యమైన సదుపాయాలు అన్ని జిల్లాలలో ఉండేందుకు ప్లానింగ్ కమీషన్ గ్రాంట్‌లను ఇవ్వాలి.

## గ్రామ స్థాయి భాగస్వామ్య ప్రణాళిక

గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామీణుల భాగస్వామ్యంతో ప్రణాళికలను రూపొందించాలి. కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో వేరు వేరు పద్ధతులలో ప్రణాళికా రూపకల్పన జరిగింది. ఆ పద్ధతులను అన్ని రాష్ట్రాలు అధ్యయనం చేసి ఎవరి కనుగుణంగా వారు అమలు చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రాథమికమైన కార్యకలాపాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ప్రతి గ్రామంలో ఒక వాలంటీర్ల బృందాన్ని ఎంపికచేసి వారికి ప్లానింగ్, అభివృద్ధి కార్యకలాపాలను ఎలా నిర్వహించాలి అన్న అంశాలపై శిక్షణ ఇవ్వాలి ఈ స్వచ్ఛంద కార్యకర్తల్లో మహిళలు, బలహీన వర్గాల వారికి తగిన ప్రాధాన్యతలు ఇవ్వాలి.

2. గ్రామస్థాయి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు, వారికి మార్గదర్శకత్వం వహించేందుకు ఒక నిపుణుల బృందాన్ని నియమించాలి. ఆ బృందాన్ని ప్రైవేటు సంస్థల నుంచి అవుట్ సోర్స్ చేయాలి. లేదా రాష్ట్ర ప్రభుత్వమే ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

3. గ్రామాలలో ప్రాథమిక, సెకండరీ డేటాను సేకరించడం, దాన్ని నిపుణుల సహాయంతో విశ్లేషించి ప్రణాళిక రచనకు సిద్ధం చేయాలి.

4. ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి గ్రామస్థాయి, బ్లాక్‌స్థాయిలో డేటాను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలి. డేటా ఫీడింగును ఎప్పుడూ పర్యవేక్షిస్తుండాలి. ఒక వేళ గ్రామస్థాయిలో కంప్యూటర్లు లేకపోతే, బ్లాక్ స్థాయిలకెళ్ళి ఆ పని చేయాలి. బ్లాక్ స్థాయిలో ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉంటే, డేటాను బ్లాక్‌ల స్థాయిలో చూసే అవకాశం ఉంటుంది. ఆ డేటాను ప్లానింగ్ కమీషన్ వెబ్‌సైట్‌లో ఉంచవచ్చు.

5. గ్రామ పంచాయతీలకు వివిధ పథకాల కింద నిధుల మంజూరుకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుతుంది.

6. గ్రామ స్థాయిలో NREGA వంటి పనులను ఇతర పథకాలతో అనుసంధానం చేయడానికి ఉపయోగపడుతుంది.

7. గ్రామ స్థాయి ప్రణాళికను మదింపు చేయడం, రాష్ట్ర ప్రణాళికకు అనుగుణంగా దాన్ని సిద్ధం చేయడం, గ్రామసభల్లో వాటిని అనుమతించడం వంటి కార్యకలాపాలను చేపట్టవచ్చు.

8. ఫలానా గ్రామస్థాయి ప్రణాళికా కిందకు వస్తుందా, దానిపై స్థాయికి వస్తుందా అన్న విషయాన్ని నిర్ణయించాలి. గ్రామ పరిధిలోకి రాని అంశాలను బ్లాక్ స్థాయిలో చేపట్టాలి.

9. పంచాయతీ సమితులు (బ్లాక్‌లు), జిల్లా పరిషత్‌ల ప్రణాళికలను కింది స్థాయి రికమెండేషన్ల ఆధారంగానే జరగాలి.

## ప్రక్రియను ఎలా ప్రారంభించాలి?

ప్రణాళికా ప్రక్రియను పూర్తి చేయడం అనుకున్నంత తేలిక కాదు.

సరైన మార్గదర్శకత్వంలో ముందుకు సాగాల్సి ఉంటుంది. నాణ్యత చెడకుండా ఫలితాలు రావాలంటే చాలా కాలం పడుతుంది. జిల్లా ప్రణాళికా సంఘం సభ్యులు, ఎన్నికైన ప్రతినిధులు, ఇతర సిబ్బందికి పునశ్చరణ తరగతులను నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్లానింగ్ అంశాలపై నిరంతర శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అనుభవాలు తెలుపుతున్నాయి. ప్లానింగ్ ప్రక్రియలో పాల్గొనే వారికి ప్రతి ఏడాది స్వల్పకాలిక శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. గ్రామస్థాయిల్లో పాల్గొనే వాలంటీర్లలో కొంత మంది మధ్యలో మానివేసే అవకాశం ఉంది. ప్రణాళికా ప్రక్రియ మొదలు పెట్టే ప్రతిసారీ నూతనోత్సాహం నింపాల్సిన అవసరం ఉంది. బ్లాక్ స్థాయిలో శిక్షణనివ్వడానికి జిల్లాస్థాయిలోని అంకిత భావమున్న శిక్షకులను ఎంపిక చేసి నిర్దిష్టకాల వ్యవధిలో శిక్షణను పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర స్థాయినుంచి గ్రామ స్థాయి వరకు శిక్షణ సిబ్బందికి సంబంధించిన స్పష్టమైన ప్రణాళికను, కాలవ్యవధిని ముందే ఖరారు చేసి ఉంచుకోవాలి.

ఇటువంటి దీర్ఘకాలిక ప్రక్రియను చేపట్టటానికి రాష్ట్రాలు ఆసక్తి కనపర్చవు. వాటికి సత్వర పరిష్కారం చూపే మార్గాలు కావాలి. ఈ సత్వర మార్గాల వల్ల ప్రణాళికా నాణ్యత దెబ్బ తింటుంది. సత్వర మార్గాలలో ఓ ప్రత్యేక పథకానికి సంబంధించిన ప్రత్యేక ప్రణాళికలు, వాటిని అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యల జాబితా, నిధుల లభ్యత, మార్గదర్శక సూత్రాల వంటివి ఉంటాయి. మానవవనరుల అభివృద్ధి, జీవనోపాధి అవకాశాల విస్తరణ, మౌలిక వనరులు కాకుండా ఇతర అంశాలపై అంచనాలు వేసేందుకు తగిన నిపుణులు ఉండాలి. సాధారణంగా ఈ విషయాలపై నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తూ ఉంటారు. అభివృద్ధి లక్ష్యాలను విశ్లేషించే సామర్థ్యం ఉండాలి. మానవవనరులు, సాంకేతిక పరిజ్ఞానం, సమాజవనరులు, నిధుల వంటి అన్ని రూపాల వనరులను అభివృద్ధి పరచడానికి ప్రత్యక్ష జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ జోక్యం ముఖ్యంగా అట్టడుగు స్థాయి నుంచి ఉండాలి. ఇది దేశమంతటా ఒక్కసారే అచరణలో చూడాలంటే సాధ్యంకాదు. క్రమంగా ప్రవేశపెడుతూ పోవాలి.

ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రణాళికా పద్ధతులను రాష్ట్రాలు అనుసరిస్తూ నిరంతరం మార్పులూ చేర్పులూ చేస్తూ ఉండాలి. కెపాసిటీ బిల్డింగ్ అంటే, కేవలం శిక్షణనివ్వడమే కాదు. స్థానిక భాషలతో ప్రణాళికా మాన్యువల్స్‌ను రూపొందించాలి. సంస్కరణలు విజయవంతంగా అమలు జరిగే చోటుకి, వాలంటీర్లను తీసుకెళ్లి చూపించాలి. ఉత్తమ సంప్రదాయాలను పుస్తక రూపంలో రూపొందించి అందరికీ అందుబాటులోకి తెచ్చి, అవి పాటించేలా చర్యలు తీసుకోవాలి.

## పర్యవేక్షణ, మదింపు

ప్రణాళికా వికేంద్రీకరణను పర్యవేక్షించే లేదా మదింపు చేసే యంత్రాంగం చాలా బలహీనంగా ఉంది. వార్షిక ప్రణాళికపై జరిగే ప్రస్తుతపు చర్చా పద్ధతి చాలా అసమగ్రంగా ఉంది. ప్లానింగ్ ప్రక్రియను దగ్గరగా ఉండి పర్యవేక్షించి మదింపు చేసే ఏర్పాటు ఉండాలి. ఇప్పటి పద్ధతులు ప్రణాళికా ఖర్చులను కనిపెట్టేవిగా మాత్రమే ఉన్నాయి. ఖరీదైన "ప్లాన్ ప్లస్" సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడంతోపాటు, జిల్లా స్థాయిలో ప్రణాళికలను విశ్లేషించి, వాటి అమలును పర్యవేక్షించి, లోపాలను అంటే ప్రణాళిక ప్రకారం అమలు జరగని వాటిని గురించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి. ఇ - గవర్నెన్స్ పద్ధతులు ఇందుకు చాలా ఉపయోగపడతాయి. దీనికోసం జిల్లా స్థాయిలో నిపుణుల అవసరం ఉంటుంది. ప్రతి రాష్ట్ర ప్రణాళికా సంఘం, జిల్లా ప్రణాళికా సంఘాలలో సరిపోయేంతమంది నిపుణులను నియమించాలి. నిపుణుల ఎంపికకు వృత్తి నైపుణ్య సంస్థలు లేదా విశ్వవిద్యాలయాల సహకారం తీసుకోవాలి. ప్రణాళికా ప్రక్రియలో పాలుపంచుకొనే డిగ్రీ కళాశాలలకు వికేంద్రీకరణ ప్రణాళికలపై పరిశోధనలు చేసే వారికి ప్రత్యేక రాయితీలు లేదా ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

## ప్రణాళికా వికేంద్రీకరణను బలపరిచే ఇతర సంస్థాగత ప్రక్రియలు

ప్రణాళికా రచన ఒక్కటే సరిపోదు. దాన్ని అమలు పరిచే స్థానిక సంస్థలు, ప్రభుత్వ శాఖలు ఉండాలి. స్థానిక సంస్థల బడ్జెట్‌ను రూపొందించడం, దాన్ని అమల్లో పెట్టి, పర్యవేక్షించడం కూడా చాలా ముఖ్యం. దిగువ స్థాయిలో రూపొందించే బడ్జెట్ రాష్ట్ర స్థాయి ప్రణాళికకు అనుగుణంగా ఉండాలి. స్థానిక సంస్థల బడ్జెట్ అందుబాటులో ఉన్న అవసరాలు, ఖర్చులకు అనుగుణంగా ఉన్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. కింది సంస్థలు పైసంస్థలకు అనుబంధంగా ఉండాలన్న నియమం ప్రాతిపదికగా ఆచరణ ఉండాలి. ముందు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సరైన పథకాన్ని రూపొందించడం, దాన్ని అమలు చేయడం, వస్తు సేకరణ వ్యవస్థ, అకౌంటింగ్ మొదలైన విషయాలన్నింటినీ పటిష్టంగా చేసినప్పుడే ప్రణాళికలో అనుకున్న ఫలితాలు వస్తాయి.

సరైన ప్రణాళికకు వనరుల సమీకరణ ఒక్కటే కాదు, నిధులు కూడా సకాలంలో అందినప్పుడే ప్రణాళిక పటిష్టంగా అమలు జరుగుతుంది. నిధుల విడుదలలో ఉన్న షరతులు ఒక ఎత్తు అయితే స్థానిక అవసరాల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్లక్ష్యభావన ఉండటం వల్ల నిధుల విడుదలలో చాలాసార్లు జాప్యం జరుగుతుంది. నిధుల బదిలీ మరో పెద్ద సమస్య. బ్యాంకుల సహాయంతో నిధులను ఎలక్ట్రానిక్ రూపంలో బదిలీచేసి, అవి సక్రమంగా చేరుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. పంచాయతీ వ్యవహారాలలో ప్రజల భాగస్వామ్యం భాగస్వామ్య ప్రణాళికా ప్రక్రియలో అతి ముఖ్యమైన అంశం. ప్రజలు కోరుకున్నవి అమలు జరుగుతున్నాయంటే, అది ప్రజల భాగస్వామ్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తే ప్రణాళికా ప్రక్రియలో ప్రజలు నిరంతర భాగస్వాములు అవుతున్నట్లు లెక్క. ఈ విషయంలో కూడా రాష్ట్రాల మధ్య ఎంతో వ్యత్యాసం. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ వ్యవస్థను పద్ధతి ప్రకారం అభివృద్ధి చేయాల్సి ఉంది.

■

**నైతిక విలువలు అని చెబితే మనలో చాలా మంది నవ్వనివారు ఉండరేమో. ఇందుకు కారణాలు అనేకం.**

**అయితే విధి నిర్వహణలో నైతిక విలువలు పాటించవలసిన అవసరం ఏమిటి? మనకు ఒకరు నైతిక విలువలు నేర్పడం ఏమిటి? మనకు నైతిక విలువలు తెలియవా? లేవా? అనే సందేహాలు మనలో చాలా మంది మదిలో తలెత్తుతుంటాయని ఊహించగలం!**

మనలో చాలామంది ఒక వ్యవస్థను అనుసరించే సమయంలో, అసలు వ్యవస్థ నియమాలను కాకుండా ప్రస్తుతం వ్యవస్థలో ఏమి జరుగుతుందో అదే వ్యవస్థ అని అపోహపడుతుంటారు.

అంటే... ప్రస్తుత వ్యవస్థలోని అవినీతి, బంధుప్రీతి, అలసత్వం, రాజకీయ ప్రేరణలు, అధికారదర్పం మొదలైన అవలక్షణాలు సహజమైనవనీ, వాటినే కొనసాగించాలనే ఉద్దేశ్యంలో ఉంటారు. ఐతే ఇదే సమయంలో మనలో మరికొన్ని ఆలోచనలు కూడా వస్తుంటాయి. అవి....ఈ వ్యవస్థకు అనుగుణంగా వ్యవహరించక పోతే మనం మనుగడ సాగించలేమనే భయం, కొందరు పెద్దల బెదిరింపులు ఒకవైపున, మరోవైపున 'మనం మంచి అధికారం, ఆదాయంగల ఉద్యోగంలో ఉన్నాం, ఈ అధికారం, ఆదాయంతో మనం, మన కుటుంబం నిశ్చింతగా బ్రతకగలం' అనే ధోరణి కనుక, వ్యవస్థలోని దుర్లక్షణాలను వ్యతిరేకించకుండా సర్దుకుపోవడం పూర్తిగా రాజీపడడం ద్వారా అంతా సజావుగా సాగిపోతుందని భావిస్తాం.

# నైతిక విలువలు

అతి తక్కువకాలంలోనే పెరిగి పెద్దదై, తనలాంటి అనేక విషపు మొక్కలను విస్తరింప చేసే పార్థీనియం మొక్కను చూసి కూడా మనం ఏ విధంగా తొలగించటం లేదో అదే విధంగా ప్రాథమిక స్థాయిలోనే ఈ చెడు సంస్కృతిని నిర్మూలించకపోతే, దుర్లక్షణ భరితమైన ప్రస్తుత వ్యవస్థలో ఆ లక్షణాలు పెరిగి రకరకాల రూపాలలో అన్ని రంగాలకు, అందరు వ్యక్తులకు చేటు చేయవచ్చు.

"ఐతే... నాకేంటి? నేను నా పిల్లలకు తరగని ఆస్తిపాస్తులను వారసత్వంగా ఇస్తున్నాను. కనుక వారికి భవిష్యత్‌లో ఏ బాదరబంది ఉండదు కదా" అని అనుకుంటూ ఉంటే.... అది అమాయకత్వమే!

మన ప్రక్క ఇంట్లో ఆకలికి అలమటిస్తున్న వ్యక్తి ఉంటే అది మనకు ప్రమాదం! ఏ విధంగా అంటే ఆకలికి తట్టుకోలేని వ్యక్తి మన ఇంటి పైకే దోపిడికి పాల్పడవచ్చు. మన ఊరిలోని కలరాను మనం నిర్మూలించడానికి ప్రయత్నించక పోతే అది మన ఇంటికి కూడా వ్యాపించవచ్చు. ఈ రోజున భారత వాణిజ్య రాజధాని ఐన 'ముంబాయి'లో పెచ్చు పెరిగిన మాఫియా సంస్కృతికి అవసరమైన రిక్రూట్‌మెంట్ అక్కడి మురికివాడల నుండి జరుగుతుందనేది ఎవరూ కాదనలేని వాస్తవం.

దీనికి కారణం తీవ్రమైన ఆర్థిక అసమానతలు, నిర్దేశిత ప్రభుత్వ నిధులు, పథకాలు అర్హులైన లక్షిత వర్గాలకు చేరకపోవడమే. కాని దీని వలన పెరిగిన నేర సంస్కృతిలో భాగంగా జరుగుచున్న అపహరణలు, బెదిరింపులు, భూకబ్జాలు, హత్యలు, మొదలైన నేరాలు ఎక్కువగా సంపన్న, మధ్యతరగతి వారిపైనే జరుగుచున్నాయి. దీనిని బట్టి ఒక ప్రాంతం వ్యవస్థలోని దుర్లక్షణాలను ప్రాథమిక స్థాయిలో అదుపు చేయకపోవడం లేక పూర్తిస్థాయిలో అరికట్టలేకపోవటం వలన, ఆ ప్రాంతం అభివృద్ధి నేర సంస్కృతిలో చీకటి కోణంగా పెరుగుతుందని గుర్తించవచ్చు. సదరు ఆర్థికాభివృద్ధి లోపభూయిష్టమై, దీని ద్వారా లబ్ధిపొందిన వారు కూడా దుష్పరిణామాల బారిన పడతారని గ్రహించవచ్చు. దీనికి సంబంధించి ఒక వాస్తవ గాథను తెలుసుకుందాం.

చాలా సంవత్సరాల క్రిందట మనదేశంలో ఒక ప్రాంతంలో తలెత్తిన కరువుకాటకాల వలన ఒక ఊరిలోని యువకులు, పని చేయగల వారు వలసపోయారు. ఆ ఊరిలోని అతికొద్ది మందితో పాటు ఒక వృద్ధ జంట మాత్రం అక్కడే ఉండి పోయారు. ఐతే వారు బ్రతుకు తెరువు కోసం ఆ గ్రామంలోని మరికొందరు చేసినట్లే, ఆ ఊరి మీదుగా పోయే బాటసారులపై దాడి చేసి, దోచుకోవడం వృత్తిగా చేసుకున్నారు.

6, 7 సంవత్సరాల తర్వాత ఒక రోజున ఆ గ్రామం మీదుగా వెళుతున్న ఒక యువకుడిని చూసిన ఆ దంపతులు దాడిచేసి దోచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆ దంపతులలోని భార్య ఒక దుడ్డుకర్రతో వెనుకగా వెళ్ళి ఆ ప్రయాణికుడి తలపై బలంగా కొట్టింది. ఆ దెబ్బకు గాయపడిన ప్రయాణీకుడి నుండి విలువైన వస్తువులు, డబ్బుని వెదకడంలో నిమగ్నమైన ఆ దంపతులకు, చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆ ప్రయాణికుడు పలవరింతలు వినిపించాయి.

"నా పేరు రాధాశ్యామ్! మా తల్లిదండ్రుల పేర్లు భారతీబాయి, రాజేందర్... మాది ఈ వూరే... బ్రతుకుతెరువు కోసం వలసపోయి చాలా కాలం తర్వాత మా అమ్మనాన్నల కోసం వచ్చా.... నన్నెవరో కొట్టారు.. నేను చచ్చిపోతున్నాను... మా అమ్మనాన్నలకు చెప్పండి" అనే పలవరింతలు విన్న ఆ దంపతులు నిశ్చేష్టులై నిలిచిపోయారు.

కారణం అ అమ్మనాన్నలు వేరెవరో కాదు!.... ఆ దంపతులే!!... ఆ ప్రయాణికుడు అక్షరాలా వీరి రక్తం పంచుకుని పుట్టిన వీరి కొడుకే!... 6, 7 సంవత్సరాల క్రితం పనికోసం దూరంగా ఉన్న పట్టణానికి వలస పోయి తన తల్లితండ్రులను సుఖపెట్టడానికి ధనాన్ని సంపాదించి తెచ్చిన ఆ కొడుకు అతని తల్లితండ్రుల చేతిలోనే మరణించాడు.

పై వాస్తవ గాథ నుండి మనం గ్రహించాల్సినదేమిటి?... మనం ఒక చెడ్డ వ్యవస్థని లేదా వ్యవస్థలోని దుర్లక్షణాలను కొన సాగించడం, పాటించడం వలన కలిగే దుష్పరిణాల బారిన మనమే పడే ప్రమాదం ఉందని!....

కనుక తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి చెడుని సమర్ధించడం లేదా ఉపేక్షించడం వలన వ్యవస్థలోని చెడు సంప్రదాయాలను కొనసాగించడం వలన మనకు మన పిల్లలకు, మన భవిష్యత్ తరాల వారికి ఒక కలుషితమైన, ప్రమాదభరితమైన వ్యవస్థలో భావి భారత పౌరులు స్వేచ్ఛగా, సంతోషంగా, సౌభాగ్యంతో ఎలా జీవించగలరో??.. ఆలోచించండి!....

ఐతే మనలో చాలామంది వ్యవస్థలోని దుర్లక్షణాలను గుర్తించినా, వాటి వలన భవిష్యత్‌లో తలెత్తే దుష్పరిణామాలను గుర్తించడం, ఊహించడం లేదు. మరికొంతమంది వ్యవస్థలో చాలాకాలం నుండి నెలకొని ఉన్న సాంప్రదాయక దుర్లక్షణాలను... అసలు దుర్లక్షణాలుగానే గుర్తించలేని స్థితిలో ఉన్నారు. అంటే చాలాకాలం నుండి ఒక డిపార్ట్‌మెంట్ వ్యవస్థలో ఆచరించబడుతున్న చెడు పద్ధతులు, లంచాలు, అధికార, దురహంకార వైఖరులు ఆ డిపార్ట్‌మెంట్/వ్యవస్థ యొక్క 'సహజ లక్షణాలు' గా పొరపాటు పడటం జరుగతుంది.

ఉదాహరణకు పోలీసులు థర్డ్ డిగ్రీని యధేచ్ఛగా ప్రయోగించడం, ట్రెజరీలలో బిల్ విలువలో నిర్దిష్ట 'పర్సంటేజ్'లను ఆశించడం, ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో నకలు పత్రాల కొరకు అదనంగా కొంత మొత్తాలను చెల్లించడం, వర్క్ బిల్లులలో వివిధ స్థాయిలలో నిర్దిష్ట పర్సంటేజ్‌లు చెల్లించడం, రాజకీయ సిఫార్సుల ఆధారంగా సాంఘీక సంక్షేమ పెన్షన్‌లు, సబ్సిడీలు, ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్‌లు మొదలైన పనులను చేయడం అనేవి చెడు సంప్రదాయాలని గుర్తించలేని స్థాయిలో మనలో చాలామంది ప్రస్తుత వ్యవస్థలోని వివిధ శాఖలలో చెలామణి కావడం మనం గమనించవచ్చు.

ఐతే... దీనికి పరిష్కారం ఏమిటి?.... ఊరు మొత్తం శుభ్రంగా ఉండాలంటే, ముందు వ్యక్తి స్థాయి నుండే ఆ ప్రయత్నం మొదలు కావాలి. వ్యక్తి స్థాయి నుండి కుటుంబ స్థాయికి, కుటుంబస్థాయి నుండి గ్రామస్థాయికి ఈ ప్రయత్నం తాలూకు సత్ఫలితాలు విస్తరించి, మనం ఆశించిన గ్రామం ఆవిష్కరించబడుతుంది.

ఇదేవిధంగా వ్యవస్థలో నెలకొని ఉన్న చెడులను నిర్మూలించడం మన వృత్తి, ఉద్యోగ నిర్వహణలో భాగంగానే ప్రారంభించాలి. మన విధి నిర్వహణలో భాగంగా మన పరిధిలో జరిగే అనేక ప్రజాసంక్షేమ, పాలనా కార్యక్రమాలలో నైతిక విలువలను పాటించడం ద్వారా, మనం భావి తరాలకు అందించాలనుకుంటున్న మంచి వ్యవస్థను రూపొందించవచ్చు. ఐతే వ్యవస్థను మార్చడం లేదా మంచిగా తీర్చి దిద్దడం నా ఒక్కడి వల్లే ఎలా సాధ్యం అవుతుంది?!... అనేది మనలోని చాలా మందికి వచ్చే సత్వర సందేహం!!. దీనికి ఒకటే సమాధానం.. ప్రతి సుదీర్ఘ ప్రయాణం ఒక అడుగుతోనే మొదలవుతుంది. ప్రతి పెద్ద నిర్మాణం ఒంటరి ఇటుకతోనే ప్రారంభిస్తాం.

ఓ కవి చెప్పినట్లు ''ఎవరో ఒకరు, ఎపుడో అపుడు, నడవరా ముందుకు'' అన్నట్లుగా మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే మరి!. వెనుక వచ్చు వారికీ బాటే అదీ!! అనే వాస్తవాన్ని గుర్తించి, ప్రతి ఒక్కరూ తమ విధి నిర్వహణలో నైతిక విలువలను పాటించి, భవిష్యత్ భారతాన్ని నిర్మించుదాం!!

## ప్రభుత్వ ఉద్యోగులు - నైతిక విలువలు

ప్రజల నమ్మకానికి పునాది ప్రజాసేవే! ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తలుగా ఉంటూ, ప్రభుత్వ చట్టాలకు బద్ధులై, స్వంత లాభాన్ని ఆశించక జాతీయ లక్ష్యాల సాధనకై కృషి చేయాలి. ప్రభుత్వం నుండి ప్రజలు ఆశించే నిజాయితీ, నిష్పాక్షికత మరియు నిబద్ధతలు ప్రభుత్వ ప్రతినిధులైన ప్రభుత్వ ఉద్యోగులలో ప్రతిఫలించాలి. ఉద్యోగులు తమ నైపుణ్యాలను, జ్ఞానాన్ని, అనుభవాన్ని మెరుగుపరచుకుంటూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చ వలసి ఉంటుంది.

ఈ క్రమంలో ప్రజల నమ్మకాన్ని పొందడానికి, జాతీయ సమైక్యత, సమగ్రతలను కాపాడేందుకు మరియు దేశ సమగ్రాభివృద్ధిని సాధించేందుకు- ప్రభుత్వోద్యోగులు కొన్ని వ్యక్తిగత నియమాలను, వ్యవహారశైలిని పాటించాలి.

## నైతిక నియమావళి - కీలక అంశాలు

**1. వ్యక్తిగత జవాబుదారీతనం :**

☆ విధి నిర్వహణలో నిజాయితీ, ఆసక్తి, సావధానత, నిపుణత, నిష్పాక్షికత మరియు సమైక్యత భావనలను కలిగి ఉండాలి.

☆ కేవలం చట్టపరమైన లేక విధానపరమైన ఆవశ్యకతలను సంతృప్తి పరచడం కాక ప్రజావిశ్వాసాన్ని, నమ్మకాన్ని పొందే విధంగా సేవ చేయాలి.

☆ విధి నిర్వహణకు భంగం కలిగించే ద్రవ్యపరమైన వ్యవహారాలను నిర్వహించరాదు.

☆ చట్టవ్యతిరేకంగా వివాహ, వివాహేతర సంబంధాలను సాగించరాదు.

☆ ప్రభుత్వ లేక ప్రభుత్వేతర సంస్థల సమాచారంతో స్వంత ప్రయోజనాలను ఆశించి, ఏ విధమైన ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనరాదు.

☆ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ విధమైన బహుమతులను గాని, ఆర్థిక లేదా ఆర్థికేతర ప్రయోజనాలను స్వీకరించరాదు.

☆ విధి నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల చట్టాలు, విధి విధానాల పై అవగాహనను నిరంతరం పెంచుకుంటూ విజయవంతమైన ఉద్యోగ జీవితాన్ని నిర్మించుకోవాలి.

☆ ప్రజలతో సహ ఉద్యోగులతో గౌరవంగా వ్యవహరించాలి.

☆ ప్రభుత్వేతర సంస్థ పట్ల కానీ, వ్యక్తి పట్ల కానీ పక్షపాత వైఖరితో వ్యవహరించరాదు.

☆ ప్రజల వనరులను వృథా చేయుట లేదా దుర్వినియోగపరచటం చేయరాదు.

☆ తెలిసి, తెలిసీ చట్టవిరుద్ధమైన హామీలను, నిర్ణయాలను చేయరాదు.

☆ ప్రభుత్వ లేదా ప్రజా ఆస్తులను స్వార్థ ప్రయోజనాల కొరకు వాడరాదు.

☆ ప్రభుత్వ ఆస్తులను అనుమతిలేని కార్యకలాపాలకు వినియోగించకుండా సంరక్షించాలి.

☆ మీ పరిసరాలలో జరుగుచున్న మోసం, అవినీతి, అసభ్యతలు, వృథా గురించి సబంధిత అధికారులకు తెలియ పరచాలి / ఫిర్యాదు చేయయాలి.

☆ విధి నిర్వహణలో భాగంగా చట్టాలనేకాక ప్రజా సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి.

☆ ఆశావాద దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలలో, సాటి ఉద్యోగులలో ధైర్యాన్ని నింపాలి.

☆ పరిమితికి మించి చేసే వ్యక్తిగత కొనుగోళ్ల వివరాలను ప్రభుత్వానికి తెలియపరుస్తూ, తగిన అనుమతులను పొందాలి.

**2. చట్టంపట్ల విధేయత**

☆ సివిల్, క్రిమినల్ చట్టాలను గౌరవిస్తూ విధులను నిర్వహించాలి.

☆ ఉద్యోగులు మరియు డిపార్ట్‌మెంట్‌పై వచ్చే ఫిర్యాదులపై సకాలంలో, నిష్పక్షపాత వైఖరితో విచారణ జరిగేలా సహకరించాలి. తద్వారా ప్రజలలో విశ్వాసాన్ని నెలకొల్పాలి.

**3. ప్రజా సంబంధాల నిర్వహణ**

☆ స్థానిక ప్రజల అనుభవాల నుండి వచ్చే సూచనలు, సలహాలు, పరిష్కారాలను స్వీకరించడం ద్వారా మరింత మెరుగైన నిర్ణయాల ను చేయగలం.

☆ ప్రభుత్వం పట్ల, చట్టం పట్ల, ప్రజలలో గౌరవాన్ని పెంచేలా, సమైక్యతను కాపాడేలా ప్రజల నిజాయతీని, నిబద్ధతను, జవాబుదారీతనాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలి.

☆ జాతి, మతం, కులం, లింగం, ప్రాంతం, భాష, సంస్కృతి,

నిస్సహాయత, విద్య, వయస్సు, సంపద వైకల్యం ఆధారంగా ఏ విధమైన పక్షపాతాన్ని (చట్టం ఆమోదించని) చూపరాదు.

☆ ప్రభుత్వోద్యోగులు ప్రజల సంక్షేమం కోసం నియమించబడిన వారు కనుక అధికార దర్పంతో కాకుండా సేవా దృక్పథంతో వ్యవహరించాలి.

**4. బహుమతులు, రివార్డులు, ఆతిధ్యాలు మరియు రాయితీలు పొందడం పై పరిమితులు**

☆ విధి నిర్వహణలో భాగంగా అనేక మందిని కలిసి వ్యవహరించే సందర్భాలలో 'బహుమతులు, ఆతిధ్యాలు' ఏ రూపంలో ఉన్నప్పటికీ స్వీకరించరాదు.

☆ విధి నిర్వహణలో భాగంగా చేసే వస్తువుల కొనుగోళ్ళు, నగదు చెల్లింపులలో పూర్తి పారదర్శకతను పాటించాలి.

☆ ప్రభుత్వం ప్రకటించే రివార్డులు, బహుమతుల స్వీకరణపై ఎట్టి నిర్బంధం లేదు.

☆ ప్రభుత్వేతర సంస్థలు ప్రకటించే సామూహిక బహుమతులు, రాయితీల స్వీకరణపై ఎట్టి నిర్బంధం లేదు.

☆ ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు కల్పించే ఉచిత వసతి, ప్రయాణ రాయితీ సౌకర్యాలను విధి నిర్వహణలో స్వీకరించరాదు.

**5. వివిధ వర్గాల ప్రయోజనాల మధ్య తలెత్తే సంఘర్షణను నివారించుట**

☆ విధి నిర్వహణలో భాగంగా చేపట్టే చర్యలతో వర్గపరమైన ప్రయోజనాల కొరకు సంఘర్షణలు తలెత్తవచ్చు కనుక ఉద్యోగులు ఈ తరహా సంఘటనలను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి. తగిన పరిష్కారాలను ముందస్తుగా ఆలోచించాలి. ప్రభుత్వ పథకాల ద్వారా పరిమిత సంఖ్యలోనే లబ్ధిదారుల ఎంపిక చేయునపుడు 'పూరెస్ట్ ఆఫ్ ది పూర్' కి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మన నిర్ణయాలను సమర్థించుకోవచ్చు.

☆ ఒక పథకం అమలులో ఆ పథకం తాలూకు భాగస్వాముల (స్టేక్ హోల్డర్) పరిధులను స్పష్టంగా గుర్తించి, తదనుగుణంగా వ్యవహరించేలా చూడాలి. లేనిచో పథకం అమలులో క్రొత్త సమస్యలు తలెత్తవచ్చు.

☆ ఉద్యోగులు ప్రభుత్వం నుండి ఏ విధమైన పని కాంట్రాక్టులను స్వీకరించుట, భాగస్వాములుగా చేరుట, బినామీలుగా వ్యవహరించటం చేయరాదు.

☆ ఇతర ఉపాధి, వ్యాపారాలలో ఉద్యోగులు నిమగ్నమవరాదు. తమ కుటుంబ సభ్యులు కూడా చట్టవ్యతిరేక వృత్తి వ్యాపారాలలో పాల్గొనకుండా నియంత్రించాలి. లేనిచో సదరు కార్యకలాపాల వలన తలెత్తే దుష్పరిణామాలలో బాధ్యుడిగా ఆరోపించబడే ప్రమాదం ఉంది.

☆ పదవీ విరమణ తర్వాత స్వీకరించే వృత్తి వ్యాపారాలు, ఉపాధులకు విధి నిర్వహణలో పొందిన అధికార రహస్యాలను వినియోగించరాదు.

**6. రాజకీయ కార్యకలపాలపై పరిమితులు**

☆ ఉద్యోగులు రాజకీయ పార్టీల స్థాపన, ఎన్నికలలో పాల్గొనడం, ప్రభుత్వ వ్యతిరేక ప్రసంగాలు చేయడం నిషేధించడమైనది.

☆ ఏదేని రాజకీయ పార్టీకి లేదా స్వతంత్ర్య అభ్యర్థికి మద్ధతుగా ప్రచారం చేయరాదు.

☆ పని ప్రదేశాలలో రాజకీయ, విప్లవ, చట్టవ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక ప్రసంగాలు చేయరాదు.

☆ ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో, లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ఒత్తిళ్ళకు అతీతంగా అర్హత కలిగిన వారికే ఆయా పథకాలను అందేలా చూడాలి.

**7. ఆర్థిక వ్యవహారాలలో వ్యవహారశైలి**

☆ ఉద్యోగులు ప్రైవేట్ వ్యక్తుల నుండి అప్పులు తీసుకొనుట, ప్రైవేట్ వ్యక్తులకు అప్పులు ఇచ్చుట చేయరాదు.

☆ తాకట్టు, వడ్డీ వ్యాపారాలు, చిట్‌ల నిర్వహణ చేయరాదు.

☆ ఏదేని చట్టబద్ధ ప్రైవేట్ ఆర్థిక సంస్థలలో కస్టమర్‌గా చేరి పొదుపు, చిట్‌లలో పాల్గొనుట వ్యక్తిగత నిర్ణయంగా భావించి పాల్గొనవలెను.

☆ కార్యాలయ డబ్బుని స్వంత ప్రయోజనాలకు వాడరాదు. ఇతరులకు అప్పుగా లేదా బదులుగా ఇవ్వరాదు.

☆ ప్రతి ప్రభుత్వ సంబంధిత ఆర్థిక లావాదేవీని లిఖిత పూర్వకంగా నమోదు చేసి భద్రపరచాలి.

☆ పంచాయతీ/ప్రభుత్వ ధన వినియోగంలో పూర్తిగా నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి. అర్హతలేని ఏజెన్సీల వద్ద కొనుగోళ్ళు చేయరాదు. చట్టం అనుమతించిన విధానంలోనే అనుమతి గల వస్తుసేవలను కొనుగోలు చేయాలి.

☆ ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు అనుచితమైన మేలు చేసి ప్రతిఫలంగా డబ్బు లేదా ఇతర ఆర్థిక అంశాలు లేదా ఆర్థికేతర ప్రయోజనాలను పొందడానికి ప్రయత్నించడం శిక్షార్హం.

**8. ప్రభుత్వ రహస్యాల నిర్వహణ మరియు సమాచార హక్కు చట్టం**

☆ నిర్ణయీకరణ దశలో సమాచారాన్ని బయల్పరచడం వలన, కొందరు దురుద్దేశంతో నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించవచ్చు. కావున ఈ తరహా సమాచారాన్ని తగిన చట్టం అనుమతి లేనిదే బయల్పరచరాదు.

☆ ఇదే సమయంలో సమాచారహక్కు చట్టం స్ఫూర్తిని గౌరవిస్తూ, ప్రజలకు వారు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి.

☆ సమాచారహక్కు చట్టం గూర్చి పూర్తి స్థాయి అవగాహనను పొంది, ప్రజలకు ప్రభుత్వ నిర్ణయాలను పారదర్శకంగా ఉంచాలి.

**9. ప్రభుత్వ/అధికారిక ఆస్తులు, సేవలు వినియోగం**

☆ అధికారిక హోదాలో కల్పించబడిన వాహన సౌకర్యం, వసతి, ఇతర సామాగ్రి మరియు సౌకర్యాలను భిన్నమైన ప్రయోజనాలకు వినియోగించరాదు.

☆ ప్రభుత్వ కార్యాలయాలను అనధికారిక కార్యక్రమాలకు, స్వంత ప్రయోజనాలకు వినియోగించరాదు.

☆ అధికారిక గుర్తింపుకార్డులను, హోదాలను స్వార్థ ప్రయోజనాలకు వినియోగించరాదు.

☆ ఎలక్ట్రానిక్ నెట్‌వర్క్, కంప్యూటర్ మొదలైన సదుపాయాల వినియోగంలో స్వార్థ ప్రయోజనాలకు తావివ్వరాదు.

**10. ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలలో పాల్గొనుట, కొనుగోలు చేయు హక్కుకు పరిమితి**

☆ ప్రభుత్వ ఆస్తుల బహిరంగ వేలం, అమ్మకాలలో పాల్గొని కొనుగోలు

చేయు వెసులుబాటు ఉద్యోగులకు కలదు. ఐతే ఈ ఆస్తులను తిరిగి అమ్మకం చేయటానికి లేదా ఉపాధి వ్యాపారాలకు విని యోగించటానికి కొనుగోలు చేయరాదు.

☆ స్వంత కార్యాలయ ఆస్తుల అమ్మకాలలో, కొనుగోళ్ళలో ఏ విధమైన ప్రాధాన్యత కొరకు ప్రయత్నించరాదు.

☆ పంచాయతీ ఆస్తులైన చేపల చెరువులు, తోటలు, భూముల లీజు నిర్వహణలను ఐ.ఒ. (పి.ఆర్.ఆర్.డి)లు పర్యవేక్షించాలి.

**11. సౌకర్యవంతమైన కార్యాలయ వాతావరణాన్ని నెలకొల్పుట**

☆ కార్యాలయ ఉద్యోగులకు, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలి. తద్వారా పని వేగంలో మెరుగుదల, సందర్శకులకు సంతృప్తి కలుగుతాయి.

☆ కార్యాలయ సహ ఉద్యోగులతో గౌరవంగా వ్యవహరిస్తూ, మత, కుల, భాష, లింగ, వైకల్య పరమైన వివక్షతను చూపకుండా వ్యవహరించాలి.

☆ కార్యాలయంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించి, ఉద్యోగులకు, ఆరోగ్య పరిరక్షణను, నిష్పక్షపాతంగా పనిచేసేందుకు తగిన భద్రతను కల్పించాలి.

☆ కార్యాలయ పరిసరాల్లో డ్రగ్స్, ఆల్కహాల్‌లను వినియోగించరాదు. ఈ తరహా పదార్థాలను సేవించి విధులకు హాజరవటం నేరం. నిషేధిత ప్రదేశాలలో పొగత్రాగరాదు.

☆ యూనిఫామ్‌ను ధరించవలసిన ఉద్యోగులు తప్పక ధరించి విధులకు హాజరవ్వాలి.

☆ యూనిఫామ్‌ని ధరించి, విధులలో లేని సమయంలోనైనా/ విధులలో ఉన్నప్పుడైననూ ఆల్కహాల్, డ్రగ్స్ వంటి పదార్థాలను కొనుగోలు, వినియోగం చేయరాదు.

☆ ప్రభుత్వానికి, కార్యాలయానికి ప్రతినిధులుగా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులు ఆదర్శనీయమైన, నిరాడంబరమైన ఆహార్యాన్ని కలిగి ఉండాలి. తద్వారా ప్రజలలో గౌరవాన్ని పొందవచ్చు.

☆ కార్యాలయంలో పనిచేసే మహిళలపట్ల, అవసరార్థం కార్యాల యాలకు వచ్చే మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలి.

☆ నిస్సహాయులైన, వైకల్యం గల వ్యక్తులను ఆదరించి, వారికి అందవలసిన సహాయాన్ని త్వరతగతిన అందించాలి.

పైన సూచించిన అంశాలలో ప్రభుత్వోద్యోగులు నైతికపరమైన నిబద్ధతను పాటించడం ద్వారా కార్యాలయంలోనే కాక వ్యక్తిగత జీవనంలోనూ గౌరవ మర్యాదలను పొందవచ్చు. అదేవిధంగా ప్రజలలో కూడా మంచి అధికారిగా మన్ననలు పొందవచ్చు.

మనలో కొందరు ఏ నిర్ణయం తీసుకుంటే ఏ ఇబ్బంది వస్తుందో అని ఏ విధమైన నిర్ణయాన్ని తీసుకోకుండా దాటివేత ధోరణిని అవలంబిస్తుంటారు.

ఉదాహరణకు - ఏరువాక కాలంలో ఖాళీగా వున్న ఒక రైతుని "వరి నాటు వేసావా" అని ఒక వ్యక్తి ప్రశ్నించగా -

ఆ రైతు "లేదు వర్షాలు సకాలంలో పడవేమో అన్న భయంతో నాటలేదు"

"బెడదకు భయపడి మొక్కజొన్న నాటావా" అని ప్రశ్నించాడు. దానికా రైతు-

"పొడ పురుగుల బెడదకు భయపడి మొక్కజొన్న నాటలేదు" అన్నాడు.

అందుకా వ్యక్తి "మరి ఏం నాటావు?" అని ప్రశ్నించగా రైతు.

"ఏమి నాటలేదు, నా పొలం మాత్రం క్షేమంగా ఉంది" అని బదులిచ్చాడు.

పై కథ నుండి ఏ నిర్ణయాన్ని తీసుకుంటే ఏమవుతుందో అన్న భయంతో, అసలు ఏ పంటను నాటలేదు. మరి ఇలా అయితే అతని కుటుంబం ఎలా గడుస్తుంది? !!

ఇదే తరహాలో మనలో కొందరు నిర్ణయాలు తీసుకోవడానికి భయపడుతుంటారు. కాని వారికి తెలియదు అలాంటి స్వభావం వలన వారి విధి నిర్వహణను వారు విస్మరిస్తున్నారని!!

*మరో ఉదాహరణ :* తన తల్లిపై కోపము వచ్చి ఓ బాలుడు అలిగి ఇంటి నుండి వెళ్లిపోయి దగ్గరలోని ఒక కొండ ప్రాంతానికి చేరి 'ఐ హేట్ యు' 'ఐ హేట్ యు' అని తల్లిని తలచుకొని గట్టిగా అరిచాడు. ఐతే కొద్ది క్షణాల తర్వాత అవే మాటలు కొండల మధ్య ప్రతిధ్వనిస్తూ వినవచ్చాయి. దీనికి ఆశ్చర్యపోయిన ఆ బాలుడు వెంటనే తన తల్లి వద్దకు వెళ్ళి ఎందుకలా జరిగిందని ప్రశ్నించాడు.

దానికి ఆమె "మనం ప్రపంచానికి ఏమి పంచితే మనకు ప్రపంచం అదే తిరిగి ఇస్తుందని, నువ్వు కోపాన్ని చూపితే మనకు అదే ప్రతిగా వస్తుందని, కనుక నువ్వు ప్రేమగా ప్రపంచాన్ని చూస్తే ప్రపంచం కూడా నీ పట్ల ప్రేమ చూపుతుంది" అని హితవు చెబుతుంది.

తల్లి హితవు మేరకు ఆ బాలుడు మరలా ఆ కొండ ప్రాంతానికి వెళ్ళి "ఐ లవ్ యు", "ఐ లవ్ యు" అని గట్టిగా పలుకగా, కొద్ది క్షణాలకు అవే మాటలు అతనికి వినవచ్చాయి.

మనం మన సహచరుల పట్ల ఆదరణ, గౌరవాన్ని కనపరచినపుడు మనకు కూడా అదే ఆదరణ, గౌరవం దక్కుతుందని అర్థం చేసుకోవచ్చు.

*ఇంకొక ఉదాహరణ :* ఒక విజయవంతమైన వ్యాపారవేత్తను "భిన్నమైన వ్యక్తిత్వాలు, వ్యవహార శైలి గల చాలా మంది ప్రజలు మరియు ఉద్యోగులతో మీరు ఎలా నెగ్గుకు వచ్చి వ్యాపారంలో విజయం సాధించారు" అని ప్రశ్నించగా దానికి సమాధానంగా ఆ వ్యాపారవేత్త -

"మనుషుల్లో మంచితనాన్ని వెదకడం బంగారు గని నుండి బంగారాన్ని వేరు చేయడం వంటిదే, కొన్ని టన్నుల దుమ్ము-ధూళిని తొలగించినపుడే మనం ఒక ఔన్స్ బంగారం పొందగలం. నేను ఈ దుమ్ము ధూళి (చెడు) గురించి ఎక్కువగా ఆలోచించను, నా ఆలోచనంతా గని (మనిషి) లో దొరికే ఆ ఔన్స్ బంగారం (మంచితనం) మీదే ఉంటుంది, వ్యక్తులతో వ్యవహరించడం గని నుండి బంగారం తీయడం వంటిదే, మనం ఓర్పు, సహనంతో వేచి ఉండి పనిచేస్తే మనం తప్పక వారిలోని సమర్థత, మంచితనాన్ని తట్టిలేపగలం" అని బదులిచ్చారు.

మన విధి నిర్వహణలో భాగంగా అనేక మంది వ్యక్తులను కలుస్తుంటాం. ఈ క్రమంలో వారిలో కొందరు కొంత స్వార్థ ప్రయోజనాలను ఆశించి మనపై ఆరోపణలు చేస్తుండవచ్చు. ఐనప్పటికి మనం నిబద్ధత, నిష్పాక్షికత, అంకిత భావాలతో పని చేస్తుంటే, అతి కొద్ది కాలంలోనే వారు తమ అభిప్రాయాలను మార్చుకొని మనను గౌరవించడం జరుగుతుంది. ఎదుటివారిలోని ఈ మంచితనాన్ని నిద్రలేపడానికి మనం జీసస్, గాంధీజీ, మదర్‌థెరీసాలు చూపిన సహనం, క్షమా భావాలను అలవర్చుకోవాలి. ◆

# భారతదేశంలో స్థానిక ప్రభుత్వ అధికారాల బదలాయింపు పరిస్థితి

**భారత రాజ్యాంగంలోని అధికరణం 40 ప్రకారం దేశంలోని రాష్ట్ర ప్రభుత్వ చట్ట సభలు తమ పరిధిలోని స్థానిక ప్రభుత్వాలకు, అవి స్వయంగా, స్వతంత్రగా పరిపాలన సాగించటానికి కావలసిన అధికారులను కల్పించాలి. కాని భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చి దశాబ్దాలు గడిచిపోయినప్పటికి కూడా దేశంలోని వివిధ రాష్ట్రాలు వాటి పరిధిలో గల స్థానిక ప్రభుత్వాలకు, అవి స్వతంత్రగా, సమర్థవంతంగా పనిచేయటానికి కావలసిన పరిస్థితులు కల్పించలేక పోయాయి.**

ఒక వేళ కల్పించినా వివిధ రాష్ట్రాలలో వివిధ రకాలుగా వాటి ఇష్టానుసారం ఒకో రాష్ట్రంలో ఒకో తీరుగా స్థానిక పరిస్థితులను బట్టి అధికారాలను కల్పించాయి. దీనితో ఒకే దేశంలో వివిధ రాష్ట్రాలలో స్థానిక పాలన వివిధ రకాలుగా ఉండటం వలన, స్థానిక ప్రభుత్వాల ను పటిష్ట పరిచి, వాటికి తగిన అధికారాలను, నిధులను మరియు అధికారులను స్థానిక ప్రభుత్వాలకు బదలాయించాలనే సదుద్దేశంతో, స్థానిక ప్రభుత్వాలు స్వతంత్రంగా, స్వయంగా, సమర్థవంతంగా పరిపాలన చేయటానికి కావలసిన అధికారాలు, ప్రాధికారం, నిధులు, తగిన అధికారులను, దేశంలోని రాష్ట్రాల చట్ట సభలు తగిన చట్టాలు చేయుట ద్వారా స్థానిక ప్రభుత్వాలకు బదలాయించవచ్చు అని రాజ్యాంగంలోని అధికరణం 243 కు సవరణ చేయటం ద్వారా అధికరణం 243 ఎ నుండి 243 జడ్.డి వరకు క్రొత్త అధికరణాలు చేర్చటం జరిగింది.

దేశంలోని పంచాయతీలు, స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీలకు అధికారాలను బదలాయించటంలో రాజ్యాంగంలోని అధికరణం 246(3) ప్రకారం రాష్ట్రాలలోని చట్ట సభలకు పూర్తి అధికారం కల్పించబడింది. రాజ్యాంగంలోని అధికరణం 243జి ప్రకారం స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, 243 హెచ్ ప్రకారం పంచాయతీలు నిధుల సమీకరణ కొరకు పన్నులు విధించి వసూలు చేసే అధికారం మరియు రాష్ట్ర సంచిత నిధి నుంచి పంచాయతీలకు కొంత వాటాగా నిధుల కేటాయింపు మొదలైనవి, బదలాయింపు అధికారం సంబంధిత రాష్ట్రాల చట్ట సభలకు కలదు.

అందువలన రాజ్యాంగం అమలులోనికి వచ్చినప్పటి నుండి 73వ రాజ్యాంగ సవరణ జరిగే నాటికి కూడా పలు రాష్ట్రాలు స్థానిక ప్రభుత్వాల పట్ల చిన్న చూపు చూశాయి. అందుకే రాజ్యాంగ సవరణ అవసరమైంది. అనివార్యమైంది. ఆ తర్వాత 73 వ రాజ్యాంగ సవరణ జరిగి మళ్ళీ దశాబ్దాలు గడిచినను, దేశంలోని పలు రాష్ట్రాల చట్ట సభలు రాజ్యాంగ స్ఫూర్తితో, స్థానిక ప్రభుత్వాలకు తగిన అధికారాలను, అధికారులను మరియు నిధులను, వాటిని వినియోగించే స్వేచ్ఛను స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీరాజ్ సంస్థలకు, ఇప్పటికీ బదలాయించలేక పోయాయి.

అప్పటి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి తేది 08-03-2013 న లోక్‌సభలో, పార్లమెంటు సభ్యులు అడిగిన ప్రశ్నకు, ఇచ్చిన సమాధానం ప్రకారం భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించిన అధికారాలు, అధికారులు, నిధులు, రాష్ట్రాల వారీగా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

### ఆంధ్రప్రదేశ్

గ్రామ పంచాయతీలకు మాత్రము పన్నులు విధించి వసూలు చేసే అధికారం కలదు. 10 శాఖలకు సంబంధించిన అంశాలు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1997-2000 సంవత్సరాల మధ్య 22 జి.వోలు జారీ అయ్యాయి. అధికారులు సంబంధిత శాఖల ఆధీనంలోనే ఉన్నారు. కానీ వారు పంచాయతీరాజ్ సంస్థలకు పాక్షికంగా జవాబుదారులుగా ఉన్నారు. ఇటీవల 791 ప్రకారం 29 అంశాలు బదలాయించుతూ ఉత్తర్వులు (7-11-2013) జారీచేశారు.

### అరుణాచల్‌ప్రదేశ్

పంచాయతీరాజ్ సంస్థలు పన్నులు వసూలు చేయవు. నిధుల బదలాయింపు జరగలేదు. 29 అంశాల విధులు బదలాయించబడినవి. 20 శాఖలకు సంబంధించి జి.వోలు జారి అయ్యాయి. కాని అమలు జరగటం లేదు. అధికారాలు పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించబడలేదు.

### అస్సామ్

పంచాయతీరాజ్ సంస్థలకు పన్నులు వేసే అధికారం కలదు. కాని బల ప్రయోగం చేయలేవు. మార్కెట్లు, రేవుల అద్దెలు ప్రధాన ఆదాయవనరులు. 23 అంశాలు బదలాయించటానికి విధాన నిర్ణయం జరిగింది. కాని 7 అంశాలకు సంబంధించి 6 శాఖల జి.వోలు జారీ అయ్యాయి. కనీస స్థాయి అధికారాలను పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించారు. అధికారులు వారి శాఖలకు జవాబు దారులుగా ఉన్నారు. ఉద్యోగులు వారి మాతృ శాఖలకు రిపోర్టు చేయటం కొనసాగుచున్నది.

### బీహార్

పంచాయతీరాజ్ సంస్థలు పన్నులు వేయవు. కాని ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో కలవు. అధికారాల బదలాయించటానికి కార్యాచరణ మొదలయినవి. 2 జి.వోలు జారీ అయ్యాయి. అధికారులు తమ శాఖలకు జవాబుదారీగా ఉన్నారు. అంగన్‌వాడీ, ఆరోగ్యకార్యకర్తల

ను మరియు ఉపాధ్యాయులను పంచాయతీరాజ్ సంస్థలు నియమించుతున్నాయి.

### ఛత్తీస్‌గఢ్

పంచాయతీరాజ్ సంస్థలు వివిధ రకాల పన్నులు వసూలు చేయటానికి అధికారమివ్వబడింది. 12 శాఖల నుండి నిధుల బదలాయింపు జరిగింది. 27 అంశాలను బదలాయించటానికి కార్యాచరణ చేయబడింది. జి.వోలు జారీ కాలేదు. 9 శాఖల అధికారులను స్థానిక ప్రభుత్వాలు అయిన పంచాయతీరాజ్ సంస్థలు నియమించటానికి అధికారం కలదు.

### గోవా

పంచాయతీరాజ్ సంస్థలు 11 రకాల పన్నులు విధించి వసూలు చేసే అధికారం కలదు. అన్‌టైడ్ నిధులు పంచాయతీలకు ఇవ్వబడుచున్నవి. 18 అంశాలు గ్రామపంచాయతీలకు, 6 అంశాలు జిల్లా పరిషత్‌లకు బదలాయించబడినవి. పంచాయతీరాజ్ సంస్థల పనులు చేయటానికి సొంత సిబ్బంది కలరు.

### గుజరాత్

పంచాయతీరాజ్ సంస్థలు 8 ప్రధానమైన పన్నులు చేయుచున్నవి. 2008-09 సంవత్సరంలో 13 శాఖల నిధులు బదలాయింపు జరిగింది. 14 అంశాలు పూర్తిగా 5 అంశాలు పాక్షికంగా బదలాయింపబడినవి. 14 శాఖల అధికారులను, విధులను పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించబడినవి.

### హర్యానా

పంచాయతీరాజ్ సంస్థలు వాటి భూములను అద్దెకు ఇవ్వడం, మద్యంపై సెస్సు విధించడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొనుచున్నవి. పంచాయతీరాజ్ చట్టం ద్వారా 29 అంశాలు పూర్తిగా బదలాయించబడినవి. 10 జి.వో లు జారీ అయినవి. అధికారులను పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించినట్లు పేర్కొనబడలేదు.

### హిమాచల్‌ప్రదేశ్

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థలకు అధికారులకు బదలాయింపు కార్యాచరణ చేపట్టటానికి ఉత్తర్వులు జారీచేసింది. నిధుల బదలాయింపు కొంత మేర జరిగింది. పంచాయతీరాజ్ సంస్థలకు సహకరించటానికి బదలాయించవలసిన అధికారులను గుర్తించడం జరిగింది. కాని వారిని బదలాయించలేదు.

### జార్ఖండు

73వ రాజ్యాంగ సవరణ జరిగినప్పటినుండి 2010 నవంబరు, డిసెంబరు మాసాలలో ప్రప్రథంగా పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు జరిగినవి. అధికారాలు, నిధుల బదలాయింపు కార్యచరణ ఏది చేయబడలేదు.

### కర్నాటక

7 ప్రధానమైన పన్నులను పంచాయతీరాజ్ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పంచాయతీరాజ్ చట్టంలో అన్‌టైడ్ నిధులను బదలాయింపును తప్పనిసరి చేశారు. పంచాయతీరాజ్ సంస్థల విధులను ప్రకటించటం ద్వారా 29 అంశాలు పంచాయతీరాజ్ సంస్థలకు విధులు బదలాయించబడినవి. పంచాయతీరాజ్ ఉద్యోగులు పంచాయతీరాజ్ మరియు సంబంధిత శాఖల నియంత్రణలో పనిచేస్తారు.

### కేరళ

పంచాయతీరాజ్ సంస్థలు 7 ప్రధానమైన పన్నులు వసూలు చేస్తున్నవి. అన్‌టైడ్ నిధులను మరియు ప్రత్యేక పథకాల నిధులను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీచేయుచున్నవి. 29 అంశాల విధులను కేటాయించి బదలాయించబడినవి. బదిలీ చేయబడిన అధికారులపై పూర్తి అజమాయిషి పార్శిక క్రమశిక్షణ చర్యలు తీసుకొనే అధికారాలు పంచాయతీ సంస్థలకు కలవు.

### మధ్యప్రదేశ్

పంచాయతీరాజ్ సంస్థలకు పన్నులు చేసే అధికారం కల్పించబడినది. 19 విషయాలకు సంబంధించి 13 రకాల నిధులను విడుదల చేయడం జరుగుచున్నది. 22 శాఖలకు సంబంధించి 25 అంశాల విధుల కార్యాచరణ గురించి జి.వోలు జారీ చేయబడినవి. పంచాయతీ సర్వీసును ఏర్పాటు చేశారు.

### మహారాష్ట్ర

జిల్లా పరిషత్ మరియు గ్రామపంచాయతీలు పన్నులు వసూలు చేస్తున్నాయి. 11 శాఖల నిధులను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయబడినవి. 11 అంశాలు పూర్తిగా బదిలీ చేయబడినవి. 18 అంశాల పథకాలు పంచాయతీరాజ్ సంస్థలు అమలు చేస్తున్నాయి. అన్ని స్థాయిలో 3వ మరియు 4వ తరగతి ఉద్యోగులందరూ జిల్లాపరిషత్ వారే.

### మణిపూర్

22 శాఖల విధులను బదిలీ చేయటానికి జి.వోలు జారీ చేయబడినవి. 5 శాఖల ఉద్యోగులను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేస్తు జి.వోలు జారీ చేయబడినవి.

### ఒరిస్సా

పంచాయతీరాజ్ సంస్థలు 6 రకాల పన్నుల వసూలు చేస్తున్నాయి. అన్‌టైడ్ నిధుల గురించి స్పష్టమైన ఆదేశాలు లేవు. 11 శాఖలు 21 అంశాలను బదిలీ చేశాయి. 11 శాఖల అధికారులు పంచాయతీరాజ్ సంస్థలకు జవాబుదారులుగా ఉంటారు.

### పంజాబ్

పంచాయతీరాజ్ సంస్థలు తమ భూములను వేలం వేయటం ద్వారా ప్రధాన ఆదాయాన్ని సమకూర్చుకొనుచున్నవి. నిధుల బదిలీ జరుగలేదు. ప్రధానమైన 7 శాఖల 13 అంశాల బదిలీ గురించి ఆమోదం జరిగింది. అధికారులను పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించబడలేదు.

### రాజస్తాన్

5 శాఖల నిధులను జిల్లాస్థాయి వరకు మరియు 10% అన్‌టైడ్ నిధులను బదిలీ చేయటానికి జి.వోలు జారీ చేయబడినవి. 5 శాఖల

నిధులను జిల్లా స్థాయి వరకు బదిలీ చేయబడినవి. క్రొత్తగా 5 శాఖల కార్యచరణ జరిగింది. 5 శాఖల అధికారులను జిల్లా స్థాయి వరకు బదిలీ చేయబడినారు.

### సిక్కిం

పంచాయతీరాజ్ సంస్థలు పన్నులు వసూలు చేయవు. 17 శాఖల నిధులు 10% పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయబడుచున్నవి. అన్‌టైడ్ నిధులు పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ జరుగుచున్నవి. 29 అంశాలలు బదలాయించబడినవి. 16 శాఖల 20 అంశాలకు సంబంధించి కార్యాచరణ జరిగింది. ఉద్యోగులు పంచాయతీరాజ్ సంస్థల నియంత్రణలో ఉన్నారు. కాని పంచాయతీరాజ్ సంస్థలు పరిమిత స్థాయిలో నియంత్రణ చేపడతాయి.

### తమిళనాడు

గ్రామపంచాయతీలకు మాత్రమే పన్ను విధించి వసూలు చేసే అధికారం కలదు. రాష్ట్ర స్వంత వనరుల నుండి 9% నిధులను స్థానిక సంస్థలకు కేటాయించారు. దానిలో గ్రామీణ స్థానిక సంస్థలు 58% వాటా పొందుతాయి. 29 అంశాలు బదలాయించబడినవి. 10 శాఖలకు సంబంధించి 20 జి.వోలు జారీ అయినవి. కాని అమలు జరుగుట లేదు. అధికారులను పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించబడలేదు.

### త్రిపుర

ప్రజాపనుల శాఖ, ప్రాథమిక విద్య, సాంఘిక విద్య, సంక్షేమ శాఖల నిధులు పాక్షికంగా మరియు పెన్షను నిధులను, అన్‌టైడ్ నిధులను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయబడినవి. సాగునీటి పథకాల, ప్రాథమిక విద్య, అనియత విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖల నిధుల ను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయబడినవి. పంచాయతీరాజ్ సంస్థలకు బదలాయించిన 5 అంశాల ఉద్యోగులు పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయబడ్డారు.

### ఉత్తరప్రదేశ్

మూడంచెలలోని పంచాయతీరాజ్ సంస్థలకు పన్ను వసూలు చేసే అధికారం ఉంది. 12 శాఖల యొక్క 16 అంశాలను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయబడినవి. పంచాయతీరాజ్ సంస్థలకు అధికారుల పై నియంత్రణ లేదు.

### ఉత్తరాఖండ్

జిల్లా పరిషత్తులు మాత్రమే పన్నులు వసూలు చేయుచున్నవి. 3 అంశాల విధులకు సంబంధించిన నిధులు మాత్రమే పంచాయతీరాజ్ సంస్థలకు అందుబాటులో ఉన్నాయి. 14 అంశాలకు సంబంధించి పరిపాలన మరియు ఆర్థికపరమైన అధికారాలను బదలాయిస్తు మాస్టరు జి.వో 2003 సంవత్సరంలో జారీచేయబడినది. 14 అంశాలకు సంబంధించిన ఉద్యోగులపై పర్యవేక్షణాధికారం పంచాయతీరాజ్ సంస్థలకు కలదు.

### పశ్చిమ బెంగాల్

గ్రామపంచాయతీలు పన్నులు విధించి వసూలు చేయగలవు. అన్‌టైడ్ నిధులు యస్.ఎఫ్.సి మరియు టి.ఎఫ్.సి నిధులను కేటాయించారు. 5 శాఖలు తమ బడ్జెట్‌లో పంచాయతీ విభాగం ఏర్పాటు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం 28 అంశాల బదిలీకి అంగీకరించింది. 14 శాఖలు 27 అంశాలకు సరిపోయే జి.వోలను జారీ చేశాయి. పంచాయతీ ఉద్యోగులు వివిధ రకాల జిల్లా స్థాయిలకు మార్చబడ్డారు. పంచాయతీ ఉద్యోగులు మినహా మిగతా 7 శాఖల వారిని పంచాయతీలకు బదిలీ చేశారు.

73వ రాజ్యాంగ సవరణ జరిగి రెండు దశాబ్దాలు గడిచినను పలు రాష్ట్రాలలోనే గాక అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోను పూర్తి స్థాయి అధికార వికేంద్రీకరణ జరగలేదు. స్వపరిపాలన కొరకు రెండుగా విడిపోయిన రాష్ట్రాలకు ఎన్నిక కాబడిన పాలకులు, ఎలాగైతే తమ పరిపాలన తాము కోరుకున్నారో, అలాగే స్థానిక ప్రభుత్వాల పాలకులు మరియు ప్రజలు, తమ పాలన తాము చేసుకుంటామనటంలో తప్పు లేదు.

అలాగే కేంద్ర సంచిత నిధి నుండి వాటాలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీలకు కూడా రాష్ట్ర సంచిత నిధుల నుండి లేక రాష్ట్ర స్వంత ఆదాయంలో నుండి కొంత శాతం నిధులను కేటాయిస్తు శాసనాలు చేసి చట్టాలు తీసుకొని వస్తేనే తప్ప 73 రాజ్యాంగ సవరణ లక్ష్యం పూర్తిగా నెరవేరదు.

*- యస్. శంకరయ్య*
*విశ్రాంత డివిజనల్ పంచాయతీ అధికారి*

## హరిత హారం

కొరాదు చెట్లు నాటటం ఒక 'నాటకం'
చేయొద్దు కార్యక్రమం ఫొటోలకే 'పరిమితం'
నేడు నాటిన మొక్క రేపటి 'మహావృక్షం'
మొక్క నాటి పెంచటంలో వున్న 'ఆనందం'
దాని నీడలో సేదతీరితే కలిగే 'ఆరోగ్యం'
అనుభవిస్తే గాని చెప్పలేని 'వాస్తవం'
కావాలి ఇందులో ప్రజలందరి 'భాగస్వామ్యం'
చేయిచేయి కలుపుదాం 'మన మందరం'
తరిమికొడదాం గ్లోబల్ 'వార్మింగ్'
చేద్దాం భూతలవేడిని 'డీవార్మింగ్'
వేద్దాం తెలంగాణా తల్లి మెడలో 'హరితహారం'
కాపాడుకుందాం వాతావరణ 'సమతుల్యం'
సకాలంలో వర్షాలను 'ఆకర్షిద్దాం'
పాడిపంటలతో కలిసి మెలిసి 'జీవిద్దాం'.

**- జి. జయపాలరెడ్డి**, సలహాదారుడు,
సి.ఎన్.ఆర్.ఎమ్., అపార్డ్

# ప్రగతి సోపాన ప్రణాళికలతో – బంగారు తెలంగాణకు బాటలు వేద్దాం

- **మన ఊరు - మన ప్రణాళిక ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు**
- **ప్రజల భాగస్వామ్యంతోనే సమస్యలు గుర్తించి పరిష్కరిస్తు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి.**
- **అందరి ఆలోచనలు ప్రభుత్వం చెంతకు**

**మన ఊరు - మన ప్రణాళిక జిల్లా స్థాయి అవగాహన సదస్సులో యం. గిరిజాశంకర్, జిల్లా కలెక్టర్ ఐ.ఎ.యస్. మహబూబ్‌నగర్.**

తెలంగాణ అభివృద్ధి విషయంలో కేవలం శక్తి, సామర్థ్యాలు మాత్రమే సరిపోవు. చాలా యుక్తితో పనిచేయాల్సిన సందర్భమిది. మనకున్న సానుకుల, ప్రతికుల అంశాలను బేరీజు వేసుకొన్న తర్వాతే, చేసే పని పెట్టే ప్రతీ పైసా తెలంగాణ ప్రజలకు ఉపయోగపడుతుందని నిర్ధారణ చేసుకున్న తర్వాతే పని ప్రారంభించాలనేది మనముఖ్యమంత్రి కె.సి.ఆర్. గారి ఆలోచన.

తెలంగాణ ప్రజలు ఎంతో నమ్మకంతో తనపై పెట్టిన బాధ్యతను యుక్తితో నెరవేర్చాలనే సంకల్పం కూడా ముఖ్యమంత్రి గారికున్నది. గత అరవై ఐదు ఏండ్లతో పాలనంతా గుడ్డెదు చేన్లో పడ్డట్టే నడించింది. దోచుకున్నడికి దోచుకున్నంత అన్నట్లు ప్రభుత్వ పతకాలు మరాయి. చాలా పథకాలు / కార్యక్రమాలు అమలు జరిగిన ఎక్కడ తెలంగాణ ప్రజల ప్రయోజనాలు కనిపించవు. కావున ప్రస్తుతం తెలంగాణ నవ నిర్మాణ ప్రణాళిక సిద్ధం చేసుకోవడానికి నిర్ణయించిన ఒకబృహత్తర కార్యక్రమం మంచి ఫలితాలనిస్తున్నదని చెప్పటంలో సందేహంలేదు. ప్రజలు తమకేం కావాలో తామే నిర్ణయించుకునే అవకాశం మనముందుకు వచ్చిందని చాలా సంతోసిస్తున్నారు.

ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి గౌ॥ ముఖ్యమంత్రి కే.సి.ఆర్.గారు తెలంగాణ జిల్లాల నుండి జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా అధికారులకు తేది 07-07-2014 నాడు మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం జూబ్లీహిల్స్ నందు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పై దిశానిర్దేశం చేశారు. అనంతరం తేది. 09-07-2014న అపార్డునందు మన ఊరు మన ప్రణాళికపై ఒక్క రోజు ఓరియంటేషన్ శిక్షణను మాస్టర్ ట్రైనర్స్‌కు నిర్వహించి మన ఊరు మన ప్రణాళిక తయారు చేయుటకు రేమండ్ పీటర్, ఐ.ఎ.యస్., జి.డి., ప్రియదర్శిని, ఐఎఎస్ ఎ. మురళి, ఐ.ఎ.యస్., మొదలగువారు తగు సలహాలు సూచనలు ఇచ్చారు.

**తేది: 10-07-2014నాడు మహబూబ్‌నగర్ జిల్లా నందు జిల్లా కలెక్టర్ శ్రీ యం. గిరిజాశంకర్, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. శ్రీ పి. రవీందర్‌ల ఆధ్వర్యంలో మన ఊరు మన ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించడమైనది.**

- ఆ రోజు ఉదయం 11 గంటలకు రెవెన్యూ సమావేశం హాల్ నందు గౌ॥ శాసనసభ్యులకు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌కు, మున్సిపాలిటీ ఛైర్ పర్సన్స్‌కు మరియు కమీషనర్స్, కలెక్టర్ సమావేశం జరిగింది.
- జిల్లా పరిషత్ సమావేశం హాలు నందు జిల్లా అధికారులకు మరియు మండల స్పెషల్ ఆఫీసర్స్‌కు జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. పి. రవీందర్ అవగాహన కల్పించారు.
- మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు శ్రీ వెంకటసాయి ఆసుపత్రి ఆడిటోరియం నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, మరియు వివిధ శాఖల మండల స్థాయి అధికారులకు, జిల్లా అధికారులకు, ప్రత్యేక అధికారులకు గౌ॥ జిల్లా కలెక్టర్ శ్రీ గిరిజాశంకర్ మరియు రవీందర్ సి.ఇ.ఓ. జిల్లా పరిషత్ సంపూర్ణ అవగాహన కల్పించారు.

శ్రీ పి. రవీందర్ సి.ఇ.ఓ. జిల్లా పరిషత్ గ్రామస్థాయి ప్రణాళిక తయారు విధి విధానంపై అన్ని విషయాలను మరియు సేకరించవలసిన సమాచారాన్ని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

**ఈ అవగాహన సదస్సులో శ్రీ గౌ॥ జిల్లా కలెక్టర్ శ్రీయం. గిరిజాశంకర్ ఐ.ఎ.యస్. మాట్లాడుతూ.**

పాలనపై ప్రభుత్వం దృష్టిసాగించింది, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం గ్రామాల్లోని అర్హులకు చేరాలని నిర్ణయించింది. అదే సమయంలో అనర్హులకు అందిన సంక్షేమ పథకాల లెక్కకుడా తీయాలని భావిస్తుంది. ఇందులో భాగంగానే "మనఊరు – మన ప్రణాళిక" కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. వచ్చే 5 సం॥లకు సంబంధించిన ప్రణాళిక ప్రజల భాగస్వామ్యంలో తయారు చేయాలని అన్నారు. ప్రజల అభిప్రాయాలు, అవసరాలు ప్రతిబింబించేలా మన ఊరు – మన ప్రవణాళిక ఉండాలని, ప్రనజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల

భాగస్వామ్యంతోనే పాలమూరు ప్రగతి – సమగ్రాభివృద్ధి – మౌళిక సదుపాయాల కల్పన సాధ్యమని కలెక్టర్ అన్నారు.

ప్రతి గ్రామానికి ఒక అధికారిని విలేజ్ రీసోర్స్ పర్సన్‌గా నియమిస్తున్నాం. ప్రతి అధికారి ఇందులో భాగస్వామ్యంకావాలి. దీనిని ఆషా మాషిగా తీసుకోవద్దు ఈ నెల 12వ తేది నుండి 18న తేదీ వరకు ప్రణాళికలు రూపొందించాలని ఆయా గ్రామ రీసోర్స్ పర్సన్స్ రాత్రికి గ్రామల్లోనే బస చేయాలని సూచించారు.

గ్రామంపై పట్టున్న కొందరిని గుర్తించి సర్పంచు, ఎంపీటీసి మెంబర్ వార్డు సభ్యులు, వీఆర్ఓ, సెక్రెటరీ 29 శాఖల గ్రామస్థాయి అధికారులతో పాటు మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులను, వివిధ కుల సంఘాల సభ్యులకు కలుపుకొని ముందుగా గ్రామంలో అన్నివీధులు తిరగాలని, తర్వాత సామాజిక పటం, వనరుల పటం గ్రామస్థులతో వేయించి ప్రస్తుతం ఉన్న వనరులేంటి? చేయాల్సిన పనులేంటి గుర్తించలన్నారు. బడిబయటి పిల్లలెందరో గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అక్షరాస్యతలో రాష్ట్రంలో జిల్లా 9వ స్థాయిలో ఉండగా, ఆరోగ్యంలో 10వ స్థానములో ఉందని విచారణ వ్యక్తం చేశారు. ఇతర జిల్లాలతో పోలిస్తే, జిల్లాలో శిశుమరణాల సంఖ్య ప్రతి లక్షలో 1200 మంది అధికంగా చనిపోతున్నారని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్లే ఇదంతా జరుగుతుందని సర్వేలు చేబుతున్నాయని చెప్పారు బాల్యవివాహాలపై అవగాహన కల్పించి గర్భిణులకు పౌష్టిక ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయం పై కూడా ఎక్కువ చర్చ జరగాలని అన్నారు. నూటికి 90 శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నందున గ్రామంల్లో కుంటలు, చెరువులు ఏమున్నాయో గుర్తించాలన్నారు.

రైతులు ఎలాంటి విత్తనాలు, ఎరువులు వాడుతున్నారో తెలుసుకొని మెరుగైన వ్యవసాయ పద్ధతుల గురించి చెప్పాలన్నారు.

గ్రామంల్లో రేషన్‌కార్డులు లేనివారు, ఇండ్లులేని పేదలు, పెన్షన్స్ అందని నిజమైన పేదలను / లబ్ధిదారులను గుర్తించాలని అన్నారు.

- వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే శ్మశానవాటికల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని, ప్రభుత్వ స్థలం లేనిచోట దాతల ముందుకొస్తే భూమి సేకరించాలని, చెత్త వేయడానికి ఊరిబయట డంపింగ్ యార్డుకు సైతం స్థలసేకరణ చేయాలని సూచించారు. హరిత హరం కొరకు ప్రభుత్వ భూముల్ని, ఖాళీ స్థలాలను గుర్తించి పెద్ద ఎత్తున ప్రతిగ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టుటకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

గ్రామాల్లో ఉండే నిరుద్యోగ యువతీ, యువకులను గుర్తించి వారికి ఆసక్తి కలిగిన రంగాలను గుర్తించి వారికి నైపుణ్యాన్ని పెంచీ శిక్షణలను నిర్వహించి తద్వారా జీవనోపాధులు కల్పించాలని అన్నారు. సిమెంట్‌రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి చివరి ప్రాధాన్యం కల్పించాలని కలెక్టర్ వివరించారు. ప్రణాళికలు తయారు చేసే వరకు అధికారులు ఎవరు సెలవులు పెట్టవద్దని చెప్పారు. ఈ విధంగా జిల్లా కలెక్టర్ అధికారులందరికి, ప్రణాళికల తయారు కొరకు... సంపూర్ణమైన సమాచారాన్ని ఏలాంటి అనుమానాలు లేకుండా అందించారు. పాలమూరు పల్లెల ప్రగతికి మనమంతా నిబద్ధతతో, నీతి నిజాయితీతో సోమరి తనాన్ని వీడి, చలాకీగా ఉంటూ, జవాబుదారి తనంతో పనిచేసినపుడే పేదల సమస్యలు పరిష్కారం అవుతాయి. తద్వారా పాలమూరు ప్రగతికి సంపూర్ణమైన సమగ్రాభివృద్ధికి తోడ్పడిన వారము అవుతామని ఒక చక్కటి స్ఫూర్తిదాయకమైన దిశానిర్దేశం చేశారు.

## ప్రజాప్రతినిధులు ఎవరెవరు ఏమన్నారు

- జిల్లా పరిషత్ ఛైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ గ్రామాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రణాళిక తయారు కావాలని, ఇందులో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామాల్లో ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేలా ప్రణాళిక ఉండాలని సూచించారు.
- మాజీ మంత్రి గద్వాల ఎమ్మెల్యే డీ.కె అరుణ మాట్లాడుతూ అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తిచేయాలని కోరారు. ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ అసపత్రులుగా మార్చేందుకు ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, వసతి గృహం, ఐటీఐ, పాలిటెక్నిక్, బాలికల వసతి గృహాలు ఉండేలా చూడాలన్నారు. మున్సిపాలిటీల్లో ఇంకుడు గుంతలకుచోటు కల్పించాలన్నారు.
- మాజీమంత్రి కొల్లాపూర్ ఎమేల్యే జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రణాళిక తయారీ పై పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని, గ్రామాల్లో టాంటాం వేయించాలని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వేతర సంస్థలను భాగస్వాములను చేయాలన్నారు. తాగునీరు, నీటిపారుదల ప్రాజెక్టులకు, మైదానాలు, ధాన్యం మార్పిడి కల్లాలు, పాడి పరిశ్రమ పునరుద్ధరణ, మత్స్య, వెదురు బొంగుల ప్రాసెసింగ్, స్వయం సహాయక బృందాల ద్వారా మినీస్టోర్‌ల నిర్వహణ, హెల్త్‌క్లబ్, యోగా కేంద్రాలు, మండల స్థాయిలో గోదాంల ఏర్పాటుకు స్థానం కల్పించాలన్నారు.
- నారాయణ పేట ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలకు సముచిత స్థానం కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో, ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు.
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో సర్పంచులు, వార్డు సభ్యులు, మండల గ్రామస్థాయి అధికారులకు ప్రణాళికపై అవగాహన కల్పించాలని, ప్రణాళిక రూపకల్పనపై నిర్ధిష్ఠ అంశాలను తెలియజేయాలన్నారు.
- జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రణాళిక రూపొందాలని అందరూ కలిసికట్టుగా చేస్తే విజయం

సాధిస్తామని చెప్పారు.

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు, గ్రామ వనరులు, రక్షిత మంచినీరు, ఈత, తాటి చెట్ల పెంపకం వంటి వాటిని ప్రణాళికలో చేర్చాలని కోరారు. మోడల్ పాఠశాలలు నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలన్నారు.

## పాఠకుల అభిప్రాయాలు

సంపాదకులకు నమస్కారం

స్థానిక పాలన మాసపత్రికలో అందరికీ కావలసిన సమాచారంను అందించుతున్నారు. చాలా సరళమైన భాషలో అర్థమయ్యేలాగున వైద్యం, ఆరోగ్యం విద్యలను గూర్చి సమాచారం అందించుతున్నందుకు కృతజ్ఞతలు పంచాయతీ అధికారాల మీద విడుదల చేస్తున్న జి.ఓ.లను కూడ తరుచు ప్రచురించ వలయునని మనవి.

**శ్రీమతి కదం ప్రవీణ్ బాయ్**
**మాటీగారి క్రె, గ్రామ సర్పంచ్, ఆదిలాబాద్ జిల్లా,**
**9440735720**

---

సంపాదకులకు

స్థానిక పాలన పత్రికలో అందించుతున్న అంశాలు మహిళా సర్పంచులైన మాకు అవగాహనకు వస్తున్నాయి. మహిళ సర్పంచులకు ప్రత్యేక అంశాలు ఏమైన ఉన్నవో ప్రచురించితే మరింత ఉపయోగంగా ఉంటాయి. వార్డు మెంబర్లు విధులు, పనులు గూర్చి వివరిస్తే మంచిదని భావించుతున్నాను.

**శ్రీమతి లక్ష్మమ్మ**
**సర్పంచ్, మాడుగుల, విశాఖ జిల్లా**

---

ఎడిటర్ గార్కి

స్థానిక పాలనలో విషయాలు మాకు ఏమి చేయాలని వివరిస్తున్నారు. జెడ్.పి.టి.సి. లకు సౌకర్యాలను కూడ వ్రాస్తే బాగుంటదని అనుకుంటున్నాం.

**శ్రీమతి రమాదేవి**
**జెడ్‌పిటిసి, కడప జిల్లా**

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రణాళిక రూపకల్పనకు వారం సమయం సరిపోదని, సమయాన్ని పొడిగించాలని తెలిపారు.
- కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ ప్రణాళికలో మౌలికవసతుల కల్పన గ్రామ, మండలాలను అనుసంధానించేలా రహదారుల నిర్మాణానికి చోటు కల్పించాలన్నారు.
- అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ ఎలాంటి అపోహలకు అనుమానాలకు తావులేకుండా ప్రణాళిక తయారు చేయాలన్నారు.
- అలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యా, రవాణా, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

### గ్రామ ప్రణాళిక సిద్ధం చేయాలి : పి. రవీందర్ - సీఈవో జిల్లా పరిషత్

మన ఊరు - మన ప్రణాళిక తయరుతో భాగంగా ఈ నెల 12 నుండి 18 వరకు అధికారులు గ్రామ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ రవీందర్ సూచించారు. మన ఊరు - మన ప్రణాళికపై తేది 10-07-2014 నాడు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రామ ప్రణాళిక తయారు చేసి విధానాన్ని మండల అధికారులకు వివరించారు. అభివృద్ధి అనేది గ్రామస్థాయి నుంచే చేపట్టాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం మన ఊరు మన ప్రణాళిక చేపట్టిందన్నారు. ఈ ప్రణాళిక ద్వారనే బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని అన్నారు. గ్రామాలకు దాదాపు 20 నుంచి 36 మంది అధికారులు వివిధ విభాగాలూ పనిచేస్తున్నారని వారందరు ఒక త్రాటిపైకి తెచ్చి గ్రామ ప్రణాళిక రూపొందిస్తే ఫలితాలు మెరుగుగా ఉంటాయిని ప్రభుత్వ సంకల్పమన్నారు.

స్వల్పకాలంలో ప్రణాళిక రూపొందించడం కష్టమైనా అధికారులు సంఘటితంగా ఈ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈ గ్రామ ప్రణాళిక రూపొందించేందుకు విలేజ్ రీసోర్స్ పర్సన్‌ను నియమించడం జరుగుతుందన్నారు. విలేజ్ రీసోర్స్ పర్సన్ గ్రామ ఆదాయ వ్యయాలను పరిశీలించి, గ్రామ పంచాయతీకి ఆదాయ మార్గాలను పెంచాలని అన్నారు. ప్రణాళిక రూపొందించేటప్పుడు మొదటి మూడు సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామంలో సమస్యలు అధికంగా ఉండే అవసరం ఉన్న వాటినీ తీసుకోవాలని అన్నారు. ఈ ప్రకారం ప్రణాళిక ఎలా రూపొందించాలో వివరించి, ప్రణాళిక రూపొందించడంలో ఉన్న అనుమానాలను నివృత్తి చేశారు.

**- వెంకటయ్య,**
**డి.టి.ఎం, మహబూబ్‌నగర్.**

# గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి దాకా ప్రత్యేక ప్రణాళికలు

**తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం ఖచ్చితమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని వచ్చే ఐదేళ్లలో పాలన సాగించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు నిర్ణయించారు. రాజధానిలో కూర్చొని అధికారులు ప్రభుత్వ విధానాలు తయారు చేసే పద్ధతి ముగింపు పలకాలని నిర్ణయించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎక్కడికక్కడ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని దాని ప్రకారమే కార్యచరణ సిద్ధం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు.**

జూలై 2వ తేదీన ఆయన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై మేధోమథనం చేశారు.

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్యకార్యదర్శి నర్సింగరావు, ఇన్‌స్టిట్యూట్ డిజి లక్ష్మీ పార్థసారథి, ఎంపీలు బి. వినోద్‌కుమార్, కడియం శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎ.కె. గోయెల్, విద్యాసాగర్‌రావు, రమణాచారి, పాపారావు, రామలక్ష్మణ్, రాజిరెడ్డి సీనియర్ అధికారులు అజయ్ మిశ్రా, రేమాండ్ పీటర్, పార్థసారథి, నాగిరెడ్డి, స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సమగ్ర ప్రణాళిక రూపకల్పనపై విస్తృతంగా చర్చించారు. ప్రణాళిక రూపకల్పనపై అధికారులు, సలహాదారుల నుంచి కెసిఆర్ ప్రతిపాదనలు కోరారు.

సర్పంచ్‌ల నుంచి ఐఎఎస్ హోదా ఉండే ఉద్యోగులందరికీ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలోనే శిక్షణ ఇస్తామని తెలంగాణ సి.ఎం. కెసిఆర్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ కార్యక్రమాలపై అధికారులతో చర్చించిన ఆయన కార్పొరేట్ సంస్థలు తమ సిబ్బంది శిక్షణకు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

కాగా, జూలై 7 వ తేదీన ఉదయం 10-30 గంటలకు ఈ ఇన్‌స్టిట్యూట్‌లోనే మంత్రులు, ఆయా జిల్లాల ఉన్నతాధికారులతో సిఎం కెసిఆర్ సమావేశం కానున్నారు. ఈ సమావేశంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాలు, అధికారులకు విడమరిచి చెప్పాలని భావిస్తున్నారు.

సమావేశం తర్వాత తెలంగాణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సిఎం నిర్ణయించారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రణాళికలు ఉండాలని అధికారులు ఈ దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.



*సమగ్ర అభివృద్ధి మేధోమథనంలో సిఎం కెసిఆర్*

మొత్తంగా ఒకే విధానం, ఒకే పద్ధతి పెట్టుకోకుండా, ఏ జిల్లాకు ఆ జిల్లా అక్కడి స్థానిక వనరుల పరిస్థితులను బట్టి ప్రణాళికలు రాష్ట్రంలో క్రొత్త జీవితం, సరికొత్త పాలన, సరికొత్త పంథాలు అవలంభించాలని, కింది స్థాయి నుంచి సమగ్ర అధ్యయనం జరిపే విధాన రూప కల్పన చేయాలని సూచించారు.

విధాన రూపకల్పన చేసే సందర్భంగా రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారి వరకు సిఎం నుంచి గ్రామ సర్పంచ్, సిఎం కౌన్సిలర్ వరకు భాగస్వాములు కావాలని సిఎం ఆకాంక్షించారు.

'ఇది నా గ్రామం, నా మండలం, నా జిల్లా, నా రాష్ట్రం, దీనిని నేను బాగు చేసుకోవాలి' అనే భావన అందరిలో రావాలని అందుకే అందరి భాగస్వామ్యంతో ప్రణాళిక తయారు కావాలని సిఎం అభిప్రాయపడ్డారు.

ఇప్పుడు అమలవుతున్న పథకాలు, చట్టాలు, విధానాలను, పద్ధతుల ను అవసరమైన మేరకు మార్చాలని, అనవసరం అనుకున్న చట్టాలను తొలగించాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు.

భూ పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు 5 మంది అధికారులతో ప్రత్యేక బ్రిగేడ్ ఏర్పాటు చేయాలని సిఎం చెప్పారు. సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీల వరకు అందరూ కొత్తవారేనని, అందరికీ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలనే తపన సహజంగానే ఉంటుదంటున్నారు. వారికి సరైన మార్గ నిర్దేశాలు అందాల్సిన అవసరం ఉందని, అందుకోసం ప్రజా ప్రతినిధులకు కూడా శిక్షణా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని భావిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి జీరోస్థాయికి తీసుకు రావాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీలేదని, ప్రజలకు ఇబ్బంది అనిపించినా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ వాస్తవాల ఆధారంగానే పాలన సాగాలని, ప్రజలను మభ్యపెట్టే పద్ధతులను పాటించుకోవడం లేదని పేర్కొన్నారు.

లక్ష కిలోమీటర్ల ప్రయాణమైనా సరే మొదటి అడుగుతోనే ప్రారంభమవుతుందని, అందుకనే ఈ ఐదు ఏళ్ల పాలన ఎలా ఉండాలనే విషయాలపై తొలి అడుగు కోసం సమగ్ర ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని చెప్పారు.

ఈ మేధోమధనంలో కొత్త జిల్లా ఏర్పాటు అంశం కూడా చర్చకు వచ్చింది. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లను అభివృద్ధి పరచాలని ఇందుకోసం జాయింట్ కలెక్టర్ల సంఖ్యను పెంచే విషయాన్ని చర్చించారు. విద్యా, వైద్యం, సంక్షేమం తదితర అంశాల విషయంలో జిల్లాల్లో జెసి స్థాయి ప్రత్యేధికారులను నియమించే విషయంపై మాట్లాడారు. ◆

# ఐదు సంవత్సరాల డిగ్రీ కోర్సును టిస్ ప్రారంభించిన ఎ.ఎం.ఆర్ - అపార్డు డైరెక్టరు జి.డి. ప్రియదర్శిని ఐఎఎస్






**ఎ.ఎం.ఆర్ - అపార్డు క్యాంపస్‌లో నున్న టిస్ -టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సును అపార్డు డైరెక్టర్ జి.డి. ప్రియదర్శిని ఐఎఎస్ 14.7.2014 న టిస్‌లో ప్రారంభించారు.**

ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ జీవితాల సమస్యల అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేయుడానికి నిశ్చయించుకొన్న యువతను అభినందించారు.

గ్రామీణ జీవితాన్ని మరింత ప్రోత్సహకరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆమె చెప్పారు.

ఈ టిస్ కార్యక్రమంలో డైరెక్టర్ పరమేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు. ◆



# ప్రజా ఆరోగ్యం-గ్రామపంచాయతీ పాత్ర




**గ్రామ పంచాయతీ ప్రజారోగ్యం పరిరక్షణలో తను నిర్వర్తించాల్సిన విధులను నిర్వర్తించలేకపోయినా లేదా ప్రజలచే ప్రజారోగ్య విషయాలు పాటింపచేయలేకపోయినా గ్రామంలో ప్రజారోగ్యం దెబ్బతింటుంది. ప్రజారోగ్యాన్ని కాపాడటానికి గ్రామ పంచాయితీకి కొన్ని చట్టబద్ధమైన అధికారాలను ఇవ్వడం జరిగింది.**

గ్రామ పంచాయతీ తన విధులను నిర్వర్తించి, అధికారాలను వినియోగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

### ఆరోగ్య పరిరక్షణలో గ్రామ పంచాయతీ పాత్ర

- ప్రజలలో ఆరోగ్యం, పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్యం పట్ల అవగాహన పెంచి తగు చర్యలు చేపట్టే విధంగా చేయాలి.
- వీధుల వారిగా పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటుచేసి గృహపారిశుద్ధ్యం, వ్యక్తిగత శుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణం, వాటిని వినియోగించడం, క్లోరిన్ కలిపిన నీళ్ళు త్రాగడం లేదా కాచి వడబోసిన నీరు త్రాగడం, రసాయనాలు కలిసిన నీటిని త్రాగడం, నిలిపివేయడం మొదలైనవి ప్రచారం చేసి ప్రజలు పాటించే విధంగా చేయాలి.
- అధికారాలను వినియోగించి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించడం
- ఆరోగ్య సిబ్బంది ద్వారా అవగాహన సదస్సులు తరుచుగా నిర్వహించడం.
- మురికినీరును రోడ్లపైన వదులటంపై నిషేధం విధిస్తూ (సెక్షన్ -93 మరియు జి.ఓ. 68 తేదీ.29-2-2000)
- మురికినీటి కాల్వలు, జలదారులపై కట్టడాలను నిషేధించడం (సెక్షన్ -100)
- ప్రజారోగ్యానికి హానికలిగించే యంత్రాలతో నడిచే కర్మాగారాలపై నియంత్రణ, అవసరమైతే నిషేధించడం (సెక్షన్ -199,200) (జి.ఓ. తేదీ. 10-1-1996)
- కబేళాల నిర్వహణకు లైసెన్సులు ఇవ్వటం, నియంత్రించటం (సెక్షన్ - 46, జి.ఓ. 65, తేదీ. 5-2-96)
- మెదడు వాపువ్యాధికి గురికాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం. దోమలను నిర్మూలించడానికి క్రిమిసంహారక మందులు పిచికారి చేయడం, దోమల వ్యాప్తికి కారకాలయిన పందులను నియంత్రించటం, విచ్చలవిడిగా తిరిగే కుక్కలను నాశనం చేయడం. (సెక్షన్ -92(1) మరియు జి.ఓ. 345 తేదీ. 14-8-96)
- దహన వాటికలు ఏర్పాటు చేయటం, ప్రైవేటు దహన వాటికలకు రిజిస్ట్రేషను లైసెన్సులు ఇవ్వటం, అధికార అనుమతి లేని స్థలాలలో భవనాన్ని నిషేధించటం (సెక్షన్ -84 నుండి 91 వరకు)
- ప్రజారోగ్యం, భద్రత రీత్యా వివిధ హోటళ్ళు, షాపులను సంబంధిత ఇతర వాణిజ్య సముదాయాలను తనిఖీ చేసి తగుచర్యలు తీసుకొనడం. (సెక్షన్ - 132, 133 మరియు ఇండియన్ పీనల్ కోడ్ 1860 సెక్షన్ 268 నుంచి 294 మరియు జి.ఓ.నెం. 305 తేదీ. 17-7-98)
- ప్రైవేటు మార్కెట్లు తనిఖీ చేసి ప్రజల భద్రత, సౌకర్యాల మెరుగుకోసం సూచనలు, ఆదేశాలు ఇవ్వాలి. (సెక్షన్ -105 మరియు జి.ఓ.58 తేదీ. 18-2-2000)
- ఎ.ఎన్.యం, అంగన్‌వాడీ కార్యకర్త తరుచూ గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, ఇతర స్త్రీలకు వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య తనిఖీలు చేయించడంలో ఆరోగ్య కార్యకర్తలతో కలిసి పనిచేయడం.




# గ్రామ పంచాయతీ పనుల నిర్వహణ

**సామాజిక ఆస్తులను నిర్మించడం లేదా అభివృద్ధి పరచడానికి వివిధ స్థాయిలలో ప్రజాప్రతినిధులు నిర్ణయాలు తీసుకొంటారు. ఈ నిర్ణయాలకు అనుగుణంగా పనులు చేసేటప్పుడు నాణ్యతా ప్రమాణాలను పాటించడానికి, దుబారాను అరికట్టి తక్కువ ధరలలో పని పూర్తి కావడానికి పారదర్శకమైన అనేక నియమ నిబంధనలను ప్రభుత్వం రూపొందించింది. కాబట్టి సంబంధిత నియమాలను (కోడ్) అనుసరించి పనులు చేపట్టాలి.**

* ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే నిధులతో చేసే పనులు
* ఆయా సంస్థలలో ఉన్న సాధారణ నిధుల ద్వారా చేసేపనులు

*ప్రభుత్వ పథకాల ద్వారా:* ఈ పథకాల ద్వారా వచ్చే పనులను, ఆయా పథకాల మార్గదర్శక సూత్రాలను అనుసరించి చేయాలి.

ఉదాహరణకు: ఆర్థిక సంఘం నిధులు, బి.ఆర్.జి.ఎఫ్ నిధులు, ఉపాధి హామీ పథకం మొదలైనవి అయితే నాణ్యతా ప్రమాణాలు, ప్రజాపనులకు సంబంధించిన ఇతర సాధారణ నియమాలు ఈ పథకాలకు కూడా వర్తిస్తాయి.

*సాధారణ నిధుల ద్వారా:* ఆయా సంస్థల సాధారణ నిధులతో చేసే పనులు జీ.వో. యం.యస్.589(పి.ఆర్. శాఖ) తేది:29.9.1989 మరియు యు జి.వో. యం.యస్195(పి.ఆర్ శాఖ) తేది:10.5.1999 అనుసరించి నిర్వహించాలి. ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొనని సందర్భాలలో ప్రజాపనుల కోడ్ వంటి వాటిలో నిర్దేశించిన సాధారణ నియమాలను పాటించాలి.

### (ఎ) పనులను గుర్తించుట మరియు మంజూరు చేయుట

గ్రామ పంచాయితీ సమావేశంలో ప్రజాప్రతినిధులు గుర్తించి, ప్రాధాన్యీకరించిన పనులకు ఇంజనీరింగ్ అధికారుల సహాయంతో ఖర్చును అంచనా వేసి, ఆమోదించడం జరుగుతుంది.

### (బి) అంచనాలు తయారు చేయుట

గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ఇంజనీరింగ్ అధికారులు ఈ క్రిందివాటి ఆధారంగా అంచనాలు తయారు చేస్తారు.

ఎ) స్థిరీకరించిన నాణ్యతా ప్రమాణాల కోడ్ (A.P Standard Specification)

బి) స్థిరీకరించిన డేటా(Standard Data)

సి) ఆమోదించిన మెటీరియల్, లేబరు రేట్లు (Standard Schedule of Rates)

డి) పరిపాలనా ఆమోదంతో ఇచ్చిన ఇతర షరతులు

**(సి)** ఇంజనీరింగ్ అధికారులు తయారుచేసిన అంచనాలకు గ్రామ పంచాయతీ మరుసటి సమావేశంలో పరిపాలనామోదం పొందాలి. పని విలువను బట్టి ఆయా సంస్థలు ఈ క్రింది విధంగా పరిపాలన ఆమోదం ఇచ్చే అధికారం కలిగి ఉన్నాయి. (జి.వో. యం.యస్.నెం.91 పి.ఆర్. ఆర్.డి. శాఖ తేది:4.3.1999)

| | | |
|---|---|---|
| 1. | నాన్ నోటిఫైడ్ గ్రామపంచాయతీ | 1 లక్ష రూపాయల వరకు |
| 2. | నోటిఫైడ్ గ్రామపంచాయతీ | 2 లక్షల రూపాయల వరకు |

3. డివిజనల్ పంచాయతీ అధికారి — 2 నుండి 3 లక్షల వరకు

4. జిల్లా కలెక్టరు (పం.వి) — 3 లక్షలు ఆపైన

### (డి) సాంకేతిక ఆమోదం

గ్రామపంచాయతీ పరిపాలన ఆమోదం ఇచ్చిన తరువాత నియమాల ప్రకారం రూపొందించిన 'అంచనాలను' సంబంధిత ఇంజనీరింగ్ అధికారికి సాంకేతిక ఆమోదం గురించి పంపాలి. అంచనాలతోపాటు అవసరాన్నిబట్టి ప్రతిపాదిత పనికి సంబంధించి పరిశోధన నివేదిక, ఫౌండేషన్ లెవల్, ల్యాండ్ ఎక్విజేషన్ వివరాలు, అటవీ శాఖ ఆమోదం మొదలైన వివరాలతో చెక్‌లిస్టు తయారు చేసి పంపాలి. 'రివైజ్ చేసిన అంచనాలను' పంపుతున్నట్లయితే అది మంజూరు చేసిన మొత్తం కంటే 10% ఎక్కువ ఉన్నట్లయితే సాంకేతిక ఆమోదానికి పంపే ముందే మళ్ళీ పరిపాలన ఆమోదం పొందాలి.

| పని విలువ | సాంకేతిక మంజూరు ఇచ్చే అధికారం |
|---|---|
| రూ॥ 25,000 వరకు | అసిస్టెంట్ ఇంజనీర్/అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీం |
| రూ॥ 2 లక్షల వరకు | డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ |
| 2 లక్షల నుండి 10 లక్షల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ |
| 10 లక్షల నుండి 50 లక్షలు | సూపరింటెండెంట్ ఇంజనీర్ |
| 50 లక్షల పైన | ఛీఫ్ ఇంజనీరు |

### (ఇ) పనుల అప్పగింత

సాంకేతిక అమోదం పొందిన పనిని, ఒక ఏజెన్సీని ఎంపిక చేసి దానికి ఆ బాధ్యత అప్పగించాలి. ప్రైవేటు ఏజెన్సీ కాకుండా గ్రామంలోని యస్.హెచ్.జి లేక ఇతర స్వచ్ఛంద సంస్థలకు బాధ్యత అప్పగించటం మంచిది.

*1. గ్రామపంచాయతీ :*

అత్యవసర పరిస్థితులలో లేదా ప్రత్యేక ఆదేశాలు ఉన్నపుడు గ్రామ పంచాయతీ తరుపున సర్పంచ్ లేదా కార్యనిర్వహణాధికారి పనిని చేపట్ట వచ్చును. అంతేకాని గ్రామ పంచాయతీ ఏ వ్యక్తిని సదరు పనిని పూర్తి చేయడానికి నామినేట్ చేయరాదు.



*2. లబ్ధిదారుల కమిటీ:*

ప్రభుత్వ పథకాల ద్వారా చేసే పనులను లబ్ధిదారుల కమిటీల ద్వారా చేయాలని నిర్దేశించి ఉంటే ఆ విధంగా చేయాలి. మైనరు ఇరిగేషన్ పనులైతే ఆయకట్టుదారుల సంఘాలకు అప్పగించవచ్చు. ఒక వేళ ప్రజా అంచనాల ద్వారా పనులు చేపడితే ఆ పని విలువ రూ. 30,000 లోపు ఉంటే, అటువంటి వాటిని కూడా లబ్ధిదారుల కమిటీలకు అప్పగించవచ్చు.

చిన్నతరహా నీటిపారుదల పనులను 'మైనర్ ఇరిగేషన్ వర్క్స్' అయకట్టుదారు కమిటీలకు అప్పగించాలి. (జి.ఒ.ఆర్.టి.నెం. 1863 పి.ఆర్ & ఆర్.డి (ప్రొసీడింగ్-1)) డిపార్ట్‌మెంట్, తేది 23-11-1998.)

*3. శాఖా పరంగా:*

అత్యవసర పరిస్థితులు మరియు ప్రత్యేక స్వభావం కల్గిన పనుల విషయంలో టెండర్లను పిలిచే అధికారం గల వ్యక్తి, పై అధికారి అనుమతితో శాఖాపరంగా పనులను చేపట్టి నిర్వహించవచ్చును.

*4. టెండర్లు పిలవడం ద్వారా :*

పైన వివరించిన పద్ధతులలో పని చేయడానికి వీలు కానపుడు రూ. 5000 పైబడిన పనులకు టెండర్లు పిలిచి పని అప్పగించాలి.

### ఎఫ్) పనిచేసే ఏజెన్సీతో అగ్రిమెంటు

పైన వివరించిన పద్ధతులలో ఏదో ఒక పద్ధతిని పాటించి పనిచేయడానికి ఏజెన్సీని ఎంపికచేసి దానితో అగ్రిమెంటు కుదుర్చుకోవాలి. అగ్రిమెంటులోని అంశాలకు రెండు పార్టీలు బద్దులై ఉండాలి. అగ్రిమెంటును ఉల్లంఘించినట్లైతే భారత కాంట్రాక్టు చట్టం ప్రకారం పరిహారం చెల్లించవలసి ఉంటుంది. కాబట్టి అగ్రిమెంటులోని విషయాలు క్షుణ్ణంగా పరిశీలించాలి.

### జి) జరుగుతున్న పనిని పర్యవేక్షించడం:

అగ్రిమెంటులో కుదుర్చుకున్న అంచనాలు మరియు డిజైన్ల ప్రకారం పని జరుగుతున్నదీ, లేనిదీ పర్యవేక్షించాలి. ముఖ్యంగా ఒప్పందంలో నిర్ధారించుకొన్న సమయం ప్రకారం పనిలో పురోగతి, మెటీరియల్ నాణ్యత, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలి. అంతేకాక టైం షెడ్యూల్డు ప్రకారం పని నిర్వహణ జరుగుచున్నదీ, లేనిదీ నిశితముగా పరిశీలించాలి.

### (హెచ్) చేసిన పనిని నమోదు చేయడం

కాంట్రాక్టరు లేదా ఇతర ఏజెన్సీ చేసిన పనిని మెజరుమెంట్ పుస్తకం (ఎమ్ బుక్) లో నమోదు చేయాలి. నమోదు చేసిన వివరాలు ఈ పుస్తకం మొదటి పేజీలో విషయ సూచికలో వ్రాయాలి. నిబంధనల ప్రకారం చెక్ మెజరుమెంటు కూడా చేయించి చెల్లింపులు చేయాలి. ఈ పుస్తకం ఏదైనా, వివాదం తలెత్తినపుడు కోర్టులో సాక్ష్యంగా కూడా ఉపయోగపడుతుంది. ఇంజనీరింగ్ అధికారులకు జారీ చేసిన మెజర్‌మెంట్ పుస్తకాల వివరాలను మెజర్‌మెంట్ పుస్తకాల రిజిష్టరులో నమోదు చేయాలి.

# భూమి పరిపాలన చట్టాలు - నూతన భూమి పొందే చట్టాలు -2013 పై రెవెన్యూ అధికారులకు అపార్డులో శిక్షణ



**జూన్ 26-28, 2014న ఎ.ఎం.ఆర్-అపార్డులో రెవెన్యూ అధికారులకు భూమి పాలన, భూమి పొందుట -2013 చట్టాలను గూర్చి మూడు రోజుల శిక్షణను భూపాలన సెల్ వారు నిర్వహించారు.**

ఈ శిక్షణలో నూతనంగా వచ్చిన భూ చట్టాలలోనున్న మార్పుల ను చేర్పులను గూర్చి శిక్షణలో వివరించారు. నేడు భూమిపై వత్తిడి దురాక్రమణలకు గురి అవుతున్న దృష్ట్యా భూమి చట్టాలకు అధిక ప్రాధాన్యత పెరిగింది. తద్వార వచ్చిన వత్తుడులను ఏ విధంగా అధిగమించాలనే అంశాలపై శిక్షణ, న్యాయపరమైన కేసులను ఏ విధంగా డీల్ చేయాలనే అంశాలపై శిక్షణను ఇవ్వడం జరిగింది.

28వ తేదీన ఎ.ఎం.ఆర్-అపార్డ్ డైరెక్టరు జి.డి. ప్రియదర్శిని,ఐ.ఏ.ఎస్ శిక్షణలో పాల్గొన్న అధికారుకు సర్టిఫికెట్‌లను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ ల్యాండ్, హెడ్ బి. వెంకటేశ్వరరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# వర్క్‌షాప్ ఆన్ జండర్ బడ్జెటింగ్



ఎ.ఎం.ఆర్-అపార్డులోని మహిళా, శిశు అభివృద్ధి కేంద్రం జండర్ బడ్జెటింగ్ పై జిల్లాస్థాయి అధికారులతో ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు.

ఈ సందర్బంగా జరిగిన సమావేశంలో మహిళలు బడ్జెట్ ప్రాసెసింగ్‌లో ఏ విధంగా ప్రాధాన్యతను సంతరించుకొన్నారు అనే అంశాలను చర్చించారు. ఇదే అంశంపై సెంటర్ హెడ్ హెచ్. కూర్మారావు ప్రసంగించారు.

ఎ.ఎం.ఆర్ - అపార్డు డైరెక్టర్ జి.డి. ప్రియదర్శిని, ఐ.ఎ.ఎస్., తదితర అధికారులు పాల్గొని ప్రసంగించారు.

# గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకు కృషి చేయాలి





**గ్రామ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు గ్రామాలు ఎదుర్కొంటున్న మంచినీటి కొరతను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ శాఖ, త్రాగునీరు, ఎం.జి. ఎన్.ఆర్ జి.ఆర్ జి.ఎస్ శాఖల మంత్రి శ్రీ సిహెచ్. అయ్యన్న పాత్రుడు అధికారులను ఆదేశించారు.**

జూలై 9వ తేదీన ఎ.ఎం.ఆర్- అపార్డులో జరిగిన వివిధ అభివృద్ధి పథకాల సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ సి.ఇ.ఓ లు, డి.పి.ఓ లు, సూపరెండెంట్ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యు ఎస్‌లు పాల్గొన్నారు. ఫీల్డు అధికారులు సమస్యాత్మక గ్రామాలను సందర్శించి ఆ గ్రామాలు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను, రోడ్ల నిర్మాణం, విద్యా విషయాలు, మరుగుదొడ్ల ఉపయోగం తదితర విషయాలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కొత్త ప్రాజెక్టులు మొదలు పెట్టే ముందు పాత ప్రాజెక్టులో మిగిలిన పనులను చేసి నూతన వాటిని చేపట్టాలని మంత్రి సిహెచ్ అయ్యన్న పాత్రుడు సూచించారు.

అదే విధంగా నిధులు కొరత లేదని ఉన్నా కేంద్ర నుండి వచ్చే వాటిని త్వరగా రాబట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు. అందుకు ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు తగిన కృషి చేస్తున్నట్లు, తన వంతుగా గ్రామపంచాయతీలలో ఉన్న సమస్యలను సత్వరం తీర్చి ప్రజల మన్నలను పొందాలని శ్రీ అయ్యన్న పాత్రుడు వివరించారు.

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపుల్ కార్యదర్శి శ్రీ జవహర్ రెడ్డి, ఐఎఎస్, పంచాయతీ రాజ్ శాఖ కమీషనర్ డి. ప్రసాదరావు ఐ.ఎ..ఎస్, ఇతర ఉన్నతాధికారులు, 13 జిల్లాల నుండి వచ్చిన పంచాయతీ శాఖాధికారులు పాల్గొని శాఖా పరమైన విషయాల ను కూలంకషంగా చర్చించారు. సాధించిన లక్ష్యాల మీద దృశ్యాంశాల ను చూచి చర్చించారు.

*- సిఎంపి*

విజయనగరం జిల్లాలో...



స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమంలో బిఎన్‌విలు


ఆరోగ్య సేవలందిస్తున్న వారికి సహాయపడుతున్న బిఎన్‌విలు


పిల్లలకు టీషర్టులను అందిస్తున్న బిఎన్‌విలు

# భారత్ నిర్మాణ్ వాలంటీర్ల

విజయనగరం జిల్లాలో...


స్వయం ఉపాధి శిక్షణ పొందిన బిఎన్‌విలు సర్టిఫికెట్లు అందుకుంటున్న దృశ్యం


స్వయం ఉపాధి పథక లక్ష్యాలను వివరిస్తున్న డిటిఎం


స్వయం ఉపాధి శిక్షణలో పాల్గొన్న మహిళలు

## శ్రీకాకుళం జిల్లాలో...



పశువులకు మందులు వేయడంలో సహాయం చేస్తున్న బిఎన్‌విలు



పిల్లలకు చుక్కల మందులు వేస్తున్న బిఎన్‌విలు



మురుగు కాలువల నిర్మాణంకు సహాయపడుతున్న బిఎన్‌విలు

# అపూర్వ విజయాలు



విశాఖపట్నం జిల్లాలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న బిఎన్‌విలు



శ్రీకాకుళం జిల్లాలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న బిఎన్‌విలు



కర్నూలు సిఇఓ, జెడ్‌పి సూర్యప్రకాశ్ బదిలీ సందర్భంగా వీడ్కోలు పలుకుతున్న బిఎన్‌విలు

# ఎ.ఎం.ఆర్-అపార్డు జిల్లా శిక్షణా మేనేజర్లు సమీక్షా సమావేశం

**ఎ.ఎంఆర్ -అపార్డులోని సిడిపిఏ కేంద్రం నియమించిన జిల్లా శిక్షణా మేనేజర్ల (డి.టి.ఎం)ల సమీక్ష సమావేశం జూన్ 30న రాజేందర్‌నగర్‌లో అపార్డు డైరెక్టరు జి.డి. ప్రియదర్శిని ఐ.ఎ.ఎస్ అధ్యక్షతన జరిగింది.**

ఈ సమావేశంలో డి.టి.ఎంల పనితీరును, శిక్షణ మొబిలైజేషన్, శిక్షణ తరగతుల నిర్వహణ, జాతీయ-రాష్ట్రీయ ఫ్లాగ్ షిప్ కార్యక్రమాల ను అమలు చేస్తున్న తీరులను ఏ విధంగా మానిటర్ చేస్తున్నది అనే అంశాలను డైరెక్టర్ పరిశీలించారు.

అపార్డు డైరెక్టర్ జిడి ప్రియదర్శిని డిటిఎంలు వచ్చే 15 రోజులలో పంచాయతీ సర్పంచుల డేటా, వార్డు మెంబర్ల వివరాలు, శిక్షణ నిర్వహించిన తీరు తదితర అంశాలను సేకరించి అపార్డ్‌కు కావలసిన డేటాని నిర్మించడానికి ఆదేశాలను జారీ చేశారు.

శిక్షణా నిర్వహణలో డిటిఎంలు చేస్తున్న కార్యక్రమాలను ఒక పద్ధతి ప్రకారం చేయాలని నెలకు ఒక గ్రామాన్ని ఎన్నుకొని అక్కడ జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మానిటర్ చేసి నివేదికను పంపించ వలసినదిగా డైరెక్టర్ ఆదేశించారు.

అదేవిధంగా భారత్‌నిర్మాణ్ వాలంటీర్ల సంఖ్యను గ్రామాలలో పెంచెందుకు కృషి చేయాలని ఆమె అన్నారు ఇప్పటికే మన రాష్ట్రంలో బిఎన్‌విలు 29,740 మంది నమోదు కాబడి స్వచ్ఛందంగా సేవలను అందించడం జరుగుతుందని, దేశ వ్యాప్తంగా బిఎన్‌వి ల సంఖ్య 60 వేలకు పైగా నమోదయిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ హెచ్. కూర్మారావు మాట్లాడుతూ బిఎన్‌విలు చాలా వరకు వాటర్‌షెడ్ మేనేజ్‌మెంటు, కీ- క్యాప్ కార్యక్రమాలలో పాల్గొని 'మన గ్రామాభివృద్ధి మన చేతుల్లోనే' అనే అంశాలపై వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

సి.డి.పి.ఏ సెంటర్ హెడ్ ఆర్. సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, డి.టి.ఎం.లను పంచాయతీరాజ్ శాఖలో సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు శిక్షణనిచ్చి వారి రోజు వారి కార్యక్రమాలలో వచ్చే వివిధ అంశాలను డిటిఎంల ద్వారాను, జిల్లా అధికారుల సమన్వయంతో పరిష్కారాలను చూపేందుకు వీరిని ఏర్పాటు చేయడం జరిగిందని, బిఎన్‌విల భావననే దేశవ్యాప్తంగా ప్రేరణలో కల్పించే విధంగా వీరిని జిల్లాల్లో అపార్డుకు / ఎస్ఐఆర్‌డి లకు సహాయపడేందుకు ఉపయోగించడం జరుగుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో 23 జిల్లాల నుండి తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి వచ్చిన వారు పాల్గొని వారి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఎ ప్యాకల్టీ సభ్యులు, సెంటర్ హెడ్ పాల్గొన్నారు.

## ఆరు బయటకెళ్ళకురా అయ్యా!

అర్జంటు పని ఉంది అయ్యా!
నే నారుబయటకెళ్తాను అయ్యా!

అర్జెంటు పని అయితే కొడుకా!
ఆరుబయటకాదురా కొడుకా!
నువ్వు మరుగుదొడ్డే వాడరా కొడుకా!

స్నేహితులతో వెళ్తాను అయ్యా!
సరదాగా కబుర్లాడుకుంటాను అయ్యా!

నువ్వు సరదాగా స్నేహితులతో కొడుకా!
గుడికెళ్ళు, బడికెళ్లు, ఆటపాటలకెళ్ళు కొడుకా!
నువ్వు మరుగుదొడ్డే వాడరా కొడుకా!

చెరువు గట్టుకెళ్తాను అయ్యా!
నే పోలాలెంట పోతాను అయ్యా!

నేలమ్మను, నింగమ్మను, గంగమ్మను కొడుకా!
చెడపకురా చెడేవు కొడుకా!
నువ్వు మరుగుదొడ్డే వాడరా కొడుకా!

అరు బయటకెళ్ళనులే అయ్యా!
నే మరుగుదొడ్డే వాడతాను అయ్యా!

# భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

**వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా ఉద్దేశించబడిన సేవలు నిర్దేశిత వ్యక్తులకు చేర్చటానికి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో అవగాహన పెంపొందించాలని భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ యోచిస్తోంది.**

మన దేశంలో నేడు వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటే ప్రస్తుతం అమలు అవుతున్న పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాలలో వివిధ సేవలు అందచేస్తున్న ప్రభుత్వ శాఖల సామర్థ్యాలు పెంచాలి.



"భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రభుత్వాన్ని ప్రజలకు కలిపే సజీవ వారధులు."

ప్రజలలో చైతన్యం కల్గించాలి. అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని సాధించటానికి ప్రజలతో మమేకం కావాలంటే, ప్రస్తుతం మన వద్దనున్న ప్రభుత్వ యంత్రాంగం సరిపోదు. ఇందుకుగాను అంకితభావంతో ఉన్న ఒక స్వచ్ఛంద కార్యకర్తల బృందం ప్రతీ గ్రామంలోనూ ఏర్పడాలి. సచ్ఛంద కార్యకర్తల బృందం గ్రామీణ కుటుంబాలతో సన్నిహితంగా మెలగటమేకాక, స్థానిక ప్రభుత్వాలకు /ప్రభుత్వ శాఖలకు సహాయకారిగా ఉంటూ వివిధ పథకాల సక్రమ అమలుకు సహకరించాలి.

ఇలా చేయటం వల్ల పరిపాలనలో సమర్థల పెరగటమేకాక, తక్కువ ఖర్చుతో మేలైన ఫలితాలు సాధించటానికి అవకాశం ఉంటుంది. అందుకనే భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతి గ్రామ పంచాయతీలో దశల వారీగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లను ఏర్పాటు చేయటానికి రంగం సిద్ధం చేస్తోంది.

### భారత నిర్మాణ్ వాలంటీర్ల చేయాల్సిన కార్యక్రమాలు

- ☆ వివిధ ప్రభుత్వ పథకాలలో భాగస్వాములైన గ్రామీణ కుటుంబాలతో సంబంధ బాంధవ్యాలు ఏర్పర్చుకోవటం.
- ☆ వివిధ ప్రభుత్వ పథకాలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చునన్న విషయంపై గ్రామీణ ప్రజలలో అవగాహనను కల్గించటం.
- ☆ వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు, వ్యవసాయ అభివృద్ధి పథకాలు, వాటర్‌షెడ్ అభివృద్ధి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, విద్య, మహిళ, శిశు సంక్షేమ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన (రహదారులు, విద్యుదీకరణ, నీటిపారుదల, త్రాగునీరు, పారిశుద్ధ్యం, బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ, టెలిఫోన్లు, బ్యాంకింగు, పోస్ట్ ఆఫీసులు), పర్యావరణ పరిరక్షణ, తత్సంబంధిత రంగాలలో ప్రజలకు న్యాయ విజ్ఞానం కలుగచేసి ఆయా చట్టాల క్రింద ప్రజలకు గల హక్కులు, బాధ్యతలు తెలియ చేయటం.
- ☆ ప్రభుత్వ యంత్రాంగం, పంచాయతీ రాజ్ సంస్థలలో సిటిజన్ ఛార్టర్ అమలు చేయటంలోను. ఇతర అధికారిక కార్యక్రమాలు నిర్వహించటంలో స్వచ్ఛందంగా సహకరించటం.
- ☆ ప్రభుత్వ కార్యక్రమాలపై సోషల్ ఆడిట్ నిర్వహించటంలో సహకరించటం.
- ☆ ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించబడేలా చూడటం, హెల్ప్‌లైన్‌లు పనిచేయటంలో సహకరించటం.
- ☆ ప్రభుత్వ కార్యక్రమాల అమలు నాణ్యత పెరిగేలా వివిధ కార్యక్రమాల అమలు తీరుతెన్నులపై బాధ్యతగల అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందచేసి కార్యక్రమాలు సజావుగా జరిగేలా చూడటం.
- ☆ జాతి నిర్మాణంలో ఔత్సాహికులైన ప్రజలు పాల్గొనేలా అవకాశాలు కల్పించటం.
- ☆ ప్రజలలో నాయకత్వ పటిమను/ లక్షణాలను పెంపొందించటం.
- ☆ సుశిక్షితులైన స్వచ్ఛంద కార్యకర్తలను గుర్తించి, వారిని అభివృద్ధి పరచటం. అభివృద్ధి కోసం, మార్పుకోసం అవసరమైన గ్రామీణ ప్రాంతాలలో శాంతి సామర్థ్యాలు పెంపొందేలా అనువైన వాతావరణాన్ని ఏర్పర్చటం.

◆

**ఒక కుటుంబానికి ఆహారము, దుస్తులు, వసతి, విద్య, ఆరోగ్యము మొదలగునవి ముఖ్య అవసరాలు. ఇవి పొందడానికి కుటుంబంలోని ప్రతీ సభ్యుడు ఏదో ఒక పని చేస్తూ డబ్బులు గానీ ఇతర ఆస్తులు గానీ సంపాదించవలసిన అవసరమున్నది. అలా చేయడం వలన లభించేదే "జీవనోపాధి".**



# గ్రామీణ జీవనోపాధి అవకాశాలు

### గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి

గ్రామీణ ప్రాంత ప్రజలు ఆహార సముపార్జనకై అనేక రకాలుగా కష్టపడుతుంటారు. కొందరు భూమిని సేద్యం చేసి పంటలు పండించి జీవనోపాధి సమకూర్చుకుంటే, కొందరు పొలాల్లో కూలీలుగా పనిచేసి ఉపాధి పొందుతున్నారు. మరికొందరు తమకు తెలిసిన వృత్తి పనులు చేసుకుంటూ డబ్బు సంపాదిస్తూ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఏదేమైనా పని చేయడం, డబ్బు సంపాదించడమనేది ప్రతీ కుటుంబ అవసరం.

అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వనరులు గిరిజన ప్రాంతాల్లో ఉండవు. అక్కడ సేద్యం చేయడానికి భూమి లేకపోవచ్చును. పొలాల్లో పనిచేసే కూలీలకు అవకాశముండక పోవచ్చును. వృత్తి పనులకు సంబంధించిన అవగాహనే ప్రజలకు ఉండకపోవచ్చును. అయినా గిరిజనులకు కూడా జీవనోపాధి లభించాలి. వారూ జీవించాలి. అవసర సదుపాయాలు పొందాలి. అందుకనుగుణంగా పర్యావరణానికి తగినట్లు, వారి ఆచార వ్యవహారాలకనుగుణంగా వ్యవహరిస్తూ, జీవనోపాధి సమకూర్చుకుంటారు. అడవిలో లభించే ఆహార పదార్థాలను సేకరించి, అమ్ముకొని, డబ్బు సంపాదిస్తారు కొందరు. కలపను కొట్టుకొని, పరిసర గ్రామాల్లో అమ్ముకొని జీవిస్తారు కొందరు. జంతువులను పోషించి, అమ్ముకుని పొట్ట పోసుకునేవారు కొందరైతే, అడవిలో లభించే ఇతర వస్తువులను సేకరించి అమ్ముకుని అవసరాలు తీర్చుకునేవారు మరికొందరు.



గ్రామమైనా, గిరిజన ప్రాంతమైనా శ్రమించడం, జీవనోపాధి పొందడం, కుటుంబాన్ని పోషిస్తూ ఇతర అవసరాలు తీర్చుకోవడమనేది అనివార్యం. అన్ని సదుపాయాలుండి అవసరాలు తీర్చుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే అవకాశాలుంటే ఇబ్బంది లేదు. కాని సదుపాయాలు లేక, ఒకవేళ ఉన్నా సరిపడా లేకుండా ఉన్నప్పుడు ప్రణాళికలు రూపొందించుకుని అవసరాలకనుగుణంగా సదుపాయాలు సమకూర్చుకోవడానికి ప్రయత్నించాలి. దీనికొరకు గ్రామపంచాయతీలు ఆ దిశగా ఆలోచించి ప్రణాళికలు రూపొందించి, అమలు పరచి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచి ప్రజలకు సహకరించాలి. ఇందులో సర్పంచుల పాత్ర ప్రముఖమైనది.

# కనీస మద్దతు ధరలను సాధించిన మహిళల ఐక్యత

గ్రామీణ తెలంగాణలో రైతులు తగిన ధరలు లేక తమ పండించిన ధాన్యాన్ని ఎంతకొంతకు తెగనమ్ముకోవడం వల్ల నష్టాలకు గురవుతున్నారు. వర్షాభావం వల్ల చెరువులు, బావులు పైనే ఆధారపడి పంటలు పండించే జిల్లా మహబూబ్ నగర్. ఇక్కడ 2718 నోటిఫైడ్ చెరువులున్నాయి. వీటి కింద దాదాపు 2 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు.

విద్యుత్ కోతలు, సకాలంలో వానలు లేకపోవడం వంటి సమస్యల మధ్యనే ఇక్కడి రైతులు వరి, మొక్కజొన్న, కంది, పెసర, వేరుశనగ, పత్తి, ఆముదం పంటలు పండిస్తున్నారు.

ఎంతో కష్టపడి పండించిన పంటలను నిల్వ చేసుకునే అవకాశాలు లేక వచ్చిన ధరకు అమ్ముకొని నష్టాలు పాలవుతున్నారు. ఇలాంటి సమస్యలు దౌలతాబాద్ రైతులకూ ఎదురయ్యాయి.

వీరు పండించిన పంటలు నిలువ చేయాలంటే ... నలభై కిలోమీటర్ల దూరంలోని తాండూరు వెళ్లి అక్కడి గోదాముల్లో దాచుకోవాల్సి వచ్చేది. దీని వల్ల రవాణా ఖర్చులు, సమయమూ వృధా అయ్యేవి.






కానీ, దౌలతాబాద్ మహిళల పట్టుదల, దూరదృష్టి, ఐక్యత వల్ల ఇపుడా పరిస్థితి మారింది.

సెర్ప్ ఇచ్చిన ఆర్థిక మద్దతుతో స్వయం సహాయక బృందాల మహిళలంతా కలిసి ఒక గోదాము నిర్మించి దానిని నిర్వహిస్తున్నారు.

రైతుల పంటలకు నిల్వ సదుపాయాలు కల్పించడం ద్వారా ఎస్ హెచ్ జి సభ్యులు వాటి ఫెడరేషన్‌లు చిన్న, సన్నకారు రైతులకు గిట్టుబాటు ధరలు, అధిక లాభాలు వచ్చేలా చేశాయి. కనీస మద్దతు ధర పథకం కింద మొక్కజొన్న, కంది, వరి ధాన్యం సేకరించడమే కాక, వాటిని గోదాములో జాగ్రత్తగా నిలువ చేసే పనిని ఈ మహిళలు చేస్తున్నారు.

దౌలతాబాద్ గోదాం నిలువ సామర్థ్యం 1500 మెట్రిక్ టన్నులు. దీనిని సెర్ప్ ఇచ్చిన రూ. 7,20,000 రుణ సౌకర్యంతో మండల మహిళా సమాఖ్యకు చెందిన భూమిలో 2003లో నిర్మించారు.

చుట్టుపక్కల గ్రామాలు బాలంపేట, అంతారం, గుండేపల్లి, నీతూరు, గోగపలసాబాద్ గ్రామాల సంఘాలతో కలిసి మార్కెట్ కమిటీ రైతుల వద్ద నుండి కందులు సేకరిస్తున్నారు. మొదటి ఏడాది 288.7 క్వింటాళ్ల కందులను సేకరించారు.

2007-08 నాటికి ఈ సేకరణ 1255 క్వింటాళ్ళకు చేరుకుంది. ఇలా సేకరించిన కందులను గోదాములో 5 నెలలు నిల్వ ఉంచి



బహిరంగ మార్కెట్‌లో మంచి ధరకు అమ్మడంతో రైతులు సాగు చేయడంలో పడిన కష్టాలన్నీ మరిచి ఆనందంగా ఉన్నారు. ఫలితంగా 15 శాతం నుండి 20 శాతం లాభాలు వచ్చాయి. ఆ డబ్బుతో మూడేళ్లలో గోదాం నిర్మాణం కోసం తీసుకున్న రుణం తీర్చారు. గ్రామసంఘాలు, మండల మహిళా సమాఖ్యలు ఈ లాభాల్లో సమాన వాటాలు పంచుకున్నాయి.

ఇపుడు ఇక్కడ రైతులు గిట్టుబాటు ధర రాదేమోననే బెంగ లేకుండా సంతోషంగా పొలాల్లో పంటలు పండిస్తు వ్యవసాయాన్ని మరింత సుసంపన్నం చేస్తున్నారు. ఎందుకంటే ఈ కర్షకుల వెనుక మహిళా శక్తి ఉంది.

### విజయానికి కారణాలు

- కందులకు సరసమైన ధర చెల్లించడం, ధాన్యానికి కనీస మద్దతు ధర పొందటం జరిగింది.
- గ్రామ సంఘాలకు, మండల మహిళాసంఘాలకు ఆదాయ వనరు ఏర్పడటం.
- రాష్ట్రంలో మంచి శిక్షణ, పర్యవేక్షణ కలిగిన ఎస్ హెచ్‌జిలు వాటి ఫెడరేషన్లకు బలమైన వ్యవస్థ నెలకొని ఉండటం.
- ధాన్యసేకరణ, గోదాము నిర్వహణలో సిబ్బందికి మార్కెట్ కమిటీ సభ్యులకు సరైన శిక్షణ నివ్వడం.
- యాజమాన్య నిర్వహణ సమాచార వ్యవస్థ ద్వారా ఈ సెర్ప్ సిబ్బంది అతి చేరువ నుండి పర్యవేక్షించడం

### భాగ స్వామ్యాన్ని విజయవంతం చేసిన అంశాలు

- అవసరమైన తూనికలు నాణ్యతా ప్రమాణాలు, తనిఖీ పరికరాల ను అందుబాటులో ఉంచి గోదాముల నిర్వహణ, తనిఖీ రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో భాగస్వాములందరికీ శిక్షణ ఇవ్వడంలో సెర్ప్ అందించిన తోడ్పాటు.
- సెర్ప్, మార్కెట్ కమిటీలు నిర్వహిస్తున్న గట్టి పర్యవేక్షణ.
- ధాన్యం విలువలో 2.5 శాతం సర్వీసు ఛార్జీలను చెల్లించి తగిన రవాణా సౌకర్యాలు కల్పించి కనీస మద్దతు ధర ఇవ్వడం ద్వారా పౌర సరఫరాల సంస్థ ఇస్తున్న తోడ్పాటు.

### విజయానికి కారణాలు పాఠాలు

- విత్తనాలు, ఉత్పత్తులు వృధాకాకుండా, పాడవకుండా ఉండటానికి సురక్షితమైన స్థలంలో నిల్వ ఉంచడం.
- సభ్యులు దిక్కుతోచక తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నుండి బయట పడ్డారు.
- ఎప్పటికపుడు మార్కెట్‌లోని ధరలు ఎలా ఉన్నాయో తెలియ చేసి సలహాలు ఇవ్వడం ద్వారా మంచి ధరకు అమ్ముకునే అవకాశం కల్పించడం.
- ఈ మొత్తం కార్యక్రమంలో ప్రభుత్వం నుండి అంకిత భావంతో కూడిన మద్దతు లభిస్తుంది.
- చిన్న సన్నకారురైతులు తమ సమీపంలోనే గోదాములు ఉండటం వల్ల తమ పంటలను నిల్వ ఉంచి మంచి ధర వచ్చిన వెంటనే అమ్ముకుంటున్నారు.

దౌలాతాబాద్ మహిళలు సాధించిన ఈ చిన్న విజయం వల్ల నేడు ఆ ప్రాంతంలో వందలాది రైతులు తమ ఉత్పత్తులను తగిన ధరకు అమ్ముకో గలుగుతున్నారు.

దీంతో వారి గ్రామీణ ఆదాయం పెరిగి రైతుల ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం పట్ల మక్కువ పెంచుకొని మరింత దిగుబడి సాధించే దిశగా ప్రయాణిస్తున్నారు.

*- శ్యాంమోహన్, 9440595858*
*రూరల్ మీడియా, హైదరాబాద్*



# మన గ్రామం - మన మండల పరిషత్తు

**73 వ రాజ్యాంగ సవరణ ద్వారా మన రాజ్యాంగంలో మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ పొందు పరచబడింది. భారత రాజ్యాంగంలోని 243 బి అధికరణ పంచాయితీల ఏర్పాటు గురించి పేర్కొంటుంది. దీని ప్రకారం ప్రతి రాష్ట్రంలోనూ పంచాయితీలను గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేయాలని చెప్పబడింది.**

**గ్రామస్థాయికి - జిల్లా స్థాయికి మధ్యంతర వ్యవస్థగా మండల పరిషత్‌ల ఏర్పాటు, వాటికి గల అధికారాలు, వాటి నిర్వాహణకు సంబంధించిన అంశాలను ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994 లోని 3వ భాగంలో (పార్టు III) పేర్కొన్నారు.**

**అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ఎన్నికైన సభ్యుడు లేదా కోఆప్టెడ్ సభ్యుడు తన పదవికి నిర్దేశించిన పద్ధతిలో రాజీనామా చేయవచ్చునని ఈ చట్టంలోని 157వ సెక్షనులో పేర్కొన్నారు.**

కలెక్టరు, మండల పరిషత్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచులు, ఈ చట్టంలోని 177వ సెక్షను 3వ సబ్ సెక్షను క్లాజ్ (i) ప్రకారం అట్టి మండలం నుండి ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యుడు, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మండల పరిషత్ సమావేశాలకు శాశ్వత ఆహ్వానితులు. వారు అట్టి సమావేశాల్లో మాట్లాడటం, ఇతరత్రా పాల్గొనటం చేయవచ్చు గానీ ఈ సెక్షనును అనుసరించి ఓటు వేయరాదు.

మండల పరిషత్ అధ్యక్షుడు, సంప్రదింపులు కొరకు మండల పరిషత్తు పరిశీలనలో ఉన్న ఏదేని అంశం గురించి అనుభవం, ప్రత్యేక అవగాహన ఉండి ఏ రాజకీయ పార్టీ ఆఫీస్ బేరర్ కానటువంటి వ్యక్తిని మండల పరిషత్ సమావేశానికి ఆహ్వానించవచ్చునని ఈ చట్టంలోని 159వ సెక్షనులో పేర్కొన్నారు. అట్టి వ్యక్తి మాట్లాడే హక్కు కలిగి ఉండి, సమావేశంలో ఇతరత్రా పాలు పంచుకోవచ్చు. కానీ ఈ సెక్షనును అనుసరించి అట్టి మీటింగులో ఓటు వేయటానికి వీలు లేదు.

ఆ విధంగా హాజరైన వ్యక్తి నిర్దేశించిన విధంగా అలవెన్సులు తీసుకొనటానికి అర్హుడు.

ప్రతి మండల పరిషత్తు తన సమావేశాలను రూపొందించిన రూల్సు ప్రకారం జరపాలని ఈ చట్టంలోని 160 సెక్షనులో పేర్కొన్నారు.

మండల పరిషత్ అధికారాలను, విధులను ఈ చట్టంలోని 161వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టంలోని అంశాలకు లోబడి మండల పరిపాలనను మండల పరిషత్తు నిర్వహిస్తుంది. ప్రతి మండల పరిషత్తు తన పరిధిలోని ప్రజల్లో స్వయం సేవా (Self help) స్ఫూర్తిని, చొరవను, జీవన ప్రమాణాలు మెరుగు పర్చుకోవడంలో వారికి గల ఉత్సాహాన్ని ప్రేరేపించటానికి కృషి చేసి ఈ చట్టం ప్రకారం తనకు గల అన్ని అధికారాలను వినియోగించి, విధులను నిర్వహించి, ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఇతర బాధ్యతలను నిర్వహించాలి. కానీ ఈ చట్టం ప్రకారం లేదా ఏదేని ఇతర చట్టం ప్రకారం అధ్యక్షునికి లేదా మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి లేదా జిల్లా పరిషత్ లేదా ఏదేని ఇతర అథారిటీకి దాఖలు పరచబడిన అధికారాలను, విధులను నిర్వహించరాదు. మండల స్థాయిలో విధుల నిర్వహణను సమీక్షిస్తూ విస్తరణకు శక్తివంతంగా కృషి చేయాలి.

ప్రభుత్వ ముందస్తు ఆమోదంతో, నిర్దేశించిన షరతులకు లోబడి, ఈ చట్ట ప్రయోజనాలకు అవసరమైన డబ్బును అప్పు తీసుకొనవచ్చును.

ఈ చట్టం ప్రకారం తనకు బదలాయించబడిన జిల్లా బోర్డు విధులను, పన్నులు లేదా ఫీజు విధించటం వంటి వాటితో సహా నిర్వహించ వచ్చును.

ప్రతి మండల పరిషత్తు షెడ్యూలు - I లో పేర్కొనబడిన అంశాలకు సంబంధించి నిబంధనల ప్రకారం అప్పగించబడ్డ అధికారాలను, విధుల ను నిర్వహించాలి. షెడ్యూలు-IIలో పేర్కొనబడ్డ అధికారాలను, విధులను మండల పరిషత్తు నిర్వహించాలి.

రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్లో పేర్కొన్న ఈ అంశాలను వివరించి వాటినే పంచాయితీ రాజ్ చట్టం 1994 షెడ్యూలు-I పునర్లిఖించిన విషయాన్ని **స్థానిక పాలన** సెప్టెంబరు 2009 సంచికలోని 'మన గ్రామం- మన రాజ్యం' వ్యాసంలో పేర్కొనటం జరిగింది.

*షెడ్యూలు-II లో ఈ క్రింది అంశాలున్నాయి :*

***సముదాయక అభివృద్ధి:*** పంచాయితీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు ప్రజలతో కలసి సముదాయ అభివృద్ధికి కార్యక్రమాలను నిర్వహించటం.

*వ్యవసాయం :* వ్యవసాయ ఉత్పత్తిని అభివృద్ధి చేయటానికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టటం, నిర్ధిష్టంగా

(i) మేలు రకం విత్తనాల అభివృద్ధి (Multiplication) పంపిణీ;

(ii) ఎరువుల పంపిణీ;

(iii) మెరుగైన సాంకేతిక నైపుణ్యం, పద్దతులు, ఆచరణ (Practice), మేలు రకం పరికరాల గురించి ప్రచారం;

(iv) సేంద్రీయ ఎరువులు (green menure), compositing of formy-yard స్వయం సమృద్ధిని సాధించటం;

(v) మేలు రకం విత్తనాల అభివృద్ధి, పండ్లు, కూరగాయల వ్యవసాయాన్ని ప్రోత్సహించటం;

(vi) భూవినియోగం, భూమి సారము;

(vii) వ్యవసాయ అవసరాలకు అప్పులను ఏర్పాటు చేయటం;

(viii) సస్యరక్షణ (Plant protection) పద్దతుల్లో సహకరించటం, ప్రచారం చేయటం;

(ix) భూవినియోగం, భూమి సారం;

(x) మరింత ఎక్కువ ఎకరాలను నీటి సౌకర్యం క్రిందకు తేవటానికి పునరుద్ధరణ, బావుల త్రవ్వకం, ప్రైవేటు చెరువులను త్రవ్వటం, బాగు చేయటం, ప్రభుత్వ చిన్న నీటి పారుదల వనరుల ద్వారా కాలువల ద్వారా సరఫరాలను నిర్వహించుట;

(xi) వ్యవసాయ అవసరాలకు మరింత విద్యుత్తును వినియోగించటం;

(xii) బావుల త్రవ్వకం, filter points, గొట్టపు బావుల ద్వారా భూగర్భ జలాలను వినియోగించటం;

(xiii) చెట్లు నాటటం;

(xiv) గ్రామీణ అడవులను పెంచటం;

*పశు సంవర్ధక, మత్స్యసంపద*

(i) మేలు రకం సంతతి ఆంబోతులను ప్రవేశపెట్టడం, Scrub bullsను శక్తివంతం (Castrating) చేయడం ద్వారా పశుసంపదను అభివృద్ధి చేయడం;



(ii) మేలు రకం సంతతి పశువులను, గొర్రెలను, పందులను, కోళ్ళను ప్రవేశ పెట్టటం;

(iii) ప్రణాళికాబద్దమైన రక్షణ ద్వారా అంటు వ్యాధులను అరికట్టటం;

(iv) మెరుగైన పశువుల మేతను, ఆహారాన్ని ప్రవేశపెట్టటం;

(v) కృత్రిమ గర్భధారణ కేంద్రాలను, ప్రథమ చికిత్సా కేంద్రాలను, చిన్న తరహా పశువైద్యశాలలను ఏర్పాటు చేయటం;

(vi) పాలు, draught కొరకు మెరుగైన పశువుల అవశ్యకత గురించి ప్రజలను విజ్ఞాన వంతులను చేయటం;

*ఆరోగ్యం గ్రామీణ పారిశుధ్యం*

(i) ఉన్న వైద్య, ఆరోగ్య సేవలను విస్తరింపజేయటం, వాటిని ప్రజలకు చేరువచేయటం;

(ii) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, ప్రశూతి కేంద్రాలను ఏర్పాటు చేయటం, నిర్వహించటం;

(iii) రక్షిత మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేయటం;

(iv) ప్రణాళికా బద్ధమైన రోగనిరోధక చర్యలు ధృవపరచటం;

(v) అంటు వ్యాధుల నివారణ;

(vi) గ్రామ, గృహ డ్రైనేజీకి డ్రైన్‌లను, ఇంకుడు గుంటలను Soakage pits ఏర్పాటు చేయటం;

(vii) శానిటరీ పద్ధతిలో మరుగుదొడ్ల ఏర్పాటును, మానవ వ్యర్థాల వినియోగాన్ని ప్రోత్సహించటం;

(viii) పొగరాని పొయ్యిలను ప్రచారం చేయటం;

(ix) ప్రభుత్వ ఆసుపత్రులలో పనిని పర్యవేక్షించటం;

(x) అట్టి ఆసుపత్రుల అభివృద్ధి కొరకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటం;

(xi) వైపరీత్యాల సమయంలో ప్రజలు, గ్రామ పంచాయితీల సహకారాన్ని తీసుకోవటం;

(xii) పర్యావరణ పారిశుధ్యం, (ఎ) న్యూట్రిషన్ (బి) ప్రశూతి, శిశు ఆరోగ్యం (సి) అంటు వ్యాధులు (డి) కుటుంబ నియంత్రణ గురించి ప్రచార కార్యక్రమం నిర్వహించటం;

(xiii) సంబంధిత జిల్లా అధికారుల సాంకేతిక అజమాయిషీ (Control) కు లోబడి ఆరోగ్య కార్యక్రమాలను అమలు జరుపటం.

*విద్య :* ప్రాథమిక, మౌలిక (basic) పాఠశాలల నిర్వహణ, విస్తరణ నిర్ధిష్టంగా

(i) ప్రభుత్వ, taken over ఎయిడెడ్ ఎలిమెంటరీ, హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలల నిర్వహణ;

(ii) వయోజన విద్యా కేంద్రాలను, వయోజన అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటు చేయటం;

(iii) ప్రజల పాత్రతో పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరచటం;

(iv) ప్రస్తుత ప్రాథమిక పాఠశాలలను basic schools గా మార్చటం;

(v) 14 సంవత్సరాలలోపు పిల్లలందరికీ విద్య నేర్పేందుకు అవసరమైన చర్యలను చేపట్టటం;

*సామాజిక విద్య :* ప్రజలలో నూతన దృక్పథాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, కష్టపడి పనిచేయటాన్ని, సముదాయ కార్యక్రమాలకు ప్రతిస్పందించటాన్ని పెంపొందించటం, నిర్దిష్టంగా;

(i) సమాచార, సముదాయ, ఆహ్లాదకర కేంద్రాలను ఏర్పరుచుట;

(ii) యువజన సంఘాలను, మహిళా మండళ్ళను, రైతు క్లబ్బులను మొదలైన వాటిని ఏర్పాటు చేయటం;

(iii) గ్రంథాలయాలను ఏర్పాటు చేయటం, ప్రచారం చేయటం;

(iv) కాపలా నిర్వాహణ (Organization of watch and ward)

(v) శారీరక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించటం;

(vi) స్వచ్ఛంద పారిశుధ్య స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయటం;

(vii) గ్రామ సహాయకులకు శిక్షణ ఇవ్వటం, వారి సేవలను వినియోగించుకోవటం;

*కమ్యూనికేషన్లు :*

(i) గ్రామాల మధ్య రోడ్లను వేయించటం, వాటిని నిర్వహించటం;

(ii) గ్రామాల్లో ఫీడర్ రోడ్లు వేయటానికి వాటిని నిర్వహించటానికి అవసరమైన సహాయాన్ని అందించటం.

*సహకారం:* వివిధ రకాల పద్ధతుల్లో సహకార వ్యవస్థను వర్తింపచేయటం ద్వారా ప్రజాతంత్రయుతంగా ఆర్థికాభివృద్ధిని సాధించటం, నిర్దిష్టంగా –

(i) సాధ్యమైనంత ఎక్కువ కుటుంబాలకు సహకరించటానికి కోఆపరేటివ్ క్రెడిట్, పారిశ్రామిక, నీటి, వ్యవసాయ, బహుళ ప్రయోజన (Multipurpose) సొసైటీలను ఏర్పరచటం;

(ii) చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించటం;

*కుటీర పరిశ్రమలు :* మెరుగైన ఉద్యోగ అవకాశాలను, తద్వారా జీవన ప్రమాణాలను పెంపొందించడానికి కుటీర, గ్రామ, చిన్న తరహా పరిశ్రమల ను అభివృద్ధి చేయటం నిర్దిష్టంగా:

(i) ఉత్పాదక, శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, నిర్వహించటం;

(ii) చేతి వృత్తులు, ఇతర వృత్తిదారుల నైపుణ్యాన్ని పెంచటం;

(iii) మెరుగైన పరికరాలను ప్రచారం చేయటం;

(iv) ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమీషన్, అన్ని ఇతర భారతీయ బోర్డుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేయబడిన కుటీర, గ్రామ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి పథకాలను అమలు జరుపటం;

*స్త్రీ సంక్షేమం:* మహిళా శిశు సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకాలను అమలు జరుపటం, నిర్దిష్టంగా మహిళా శిశు సంక్షేమ కేంద్రాల ను, అక్షరాస్యతా కేంద్రాలను, హస్తకళలు, దుస్తుల తయారీ కేంద్రాలు, తదితర వాటిని ఏర్పచటం.

*సాంఘిక సంక్షేమం:*

(i) షెడ్యూలు తెగలు, షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతుల ప్రయోజనం కోసం ప్రభుత్వ సబ్సీడీతో ఉన్న వసతి గృహాలను (హాస్టల్స్) ను నిర్వహించటం;

(ii) గ్రామీణ గృహ పథకాలను అమలు జరపటం;

(iii) వ్యాధిగ్రస్థులైన భిక్షకులను (beggers) పోషించటం, స్థిరనివాసం గానీ పని గానీ లేని వారిని(vagrancy) నియంత్రించటం;

(iv) స్వచ్ఛంద సాంఘిక సంక్షేమ సంస్థలను శక్తివంతం చేయటం, వాటి కార్యకలాపాలకు సమన్వయం చేయటం;

(v) సహనాన్ని, మద్య నిషేధాన్ని (prohibition) ప్రచారం చేయటం;

(vi) అంటరాన్ని తనాన్ని నిర్మూలించటం;

*అత్యవసర సహాయం :* అగ్ని ప్రమాదాలు, వరదలు, అంటు వ్యాధులు, ఇతర విస్తృత ప్రభావంగల వైపరీత్యాలకు స్వచ్ఛంధ కృషి ద్వారా అత్యవసర సహాయాన్ని ఏర్పాటు చేయటం.

*గణాంకాల సేకరణ :* ప్రభుత్వం లేదా జిల్లా పరిషత్ లేదా మండల పరిషత్ అవసరమని భావించిన గణాంకాలను సేకరించి సమకూర్చటం;

*స్వయం సహాయక కార్యక్రమం:* ప్రజలకు సౌకర్యాలను కల్పించటానికి, పారిశుధ్యాన్ని మెరుగు పరచటానికి జీవన ప్రమాణాలను, ఆదాయాన్ని పెంచటానికి, ఉత్పాదకతను పెంచటానికి అనుగుణమైన కార్యక్రమాలను రూపొందించటం, అమలు జరుపటం;

*ట్రస్టులు :* మండల పరిషత్ నిధులు వర్తించే లక్ష్యాలను ముందుకు తీసుకు వెళ్ళేందుకు ట్రస్టులను నిర్వహించటం;

జిల్లా పరిషత్తు ముందస్తు ఆమోదంతో మండల పరిషత్తు మండలంలోని గ్రామపంచాయితీ నిధి నుండి కంట్రిబ్యూషన్స్‌ను విధించవచ్చును.

ప్రతి మండల పరిషత్తు ముందుగా ప్రభుత్వ ఆమోదం పొంది తన పరిధిలోని గ్రామ పంచాయితీ విధించిన పన్ను లేదా భూమి సెస్సు లేదా లోకల్ సెస్సుపై సర్‌ఛార్జిని విధించవచ్చును.

రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రామపంచాయితీలు బట్టలు ఉతకటం, స్నానం వంటి అవసరాలకు నీళ్ళను, త్రాగటానికి అవసరమైన రక్షిత మంచి నీరును సరఫరా చేయటానికి అవసరమైన వాటర్ వర్క్సును నిర్మించి నిర్వహించటానికి,

మండల పరిషత్ ఆమోదంతో అంగీకరించబడిన షరతులకు ఏదేని సంస్థ నిర్వహణను లేదా ఏదేని పనిని నిర్వహించటాన్ని మండల పరిషత్తుకు అప్పగించవచ్చునని ఈ చట్టంలోని 162వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టం ప్రకారం రూపొందించబడిన నిబంధనలను అనుసరించి రెండు లేదా అంతకంటే ఎక్కువ మండల పరిషత్తులు ఉమ్మడి ఆసుపత్రుల ను, శిశు సంక్షేమ కేంద్రాలను, అట్టి ఇతర రకాల సంస్థలను నిర్దేశించిన విధంగా ఏర్పాటు చేసి నిర్వహించవచ్చును.

మండల పరిషత్తు అభివృద్ధి అధికారి స్వాధీనంలో ఉన్న ఏదేని డాక్యుమెంటును సమర్పించమని మండల పరిషత్తు ఆదేశించవచ్చునని, అట్టి అధికారి, ప్రతి ఆదేశాన్ని అమలు జరపాలని ఈ చట్టంలోని 163వ సెక్షనులో పేర్కొన్నారు.

మండల పరిషత్తు తన పరిధిలోగల గ్రామ కార్యనిర్వాహణాధికారిని, అట్టి గ్రామానికి లేదా ఆస్థికి లేదా వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని సమర్పించమని ఈ చట్ట ప్రయోజనాల కొరకు అవసరమైనప్పుడు కోరవచ్చునని ఈ చట్టంలోని 164వ సెక్షనులో పేర్కొన్నారు.

◆

ప్రతి గ్రామ పంచాయితీకి ఒక సర్పంచ్ ఉంటారు. గ్రామ ఎన్నికల జాబితాలో పేర్లు గల ప్రజలందరూ సాధారణ ఎన్నికల్లో సర్పంచ్‌ని ప్రత్యేకంగా, మిగిలిన గ్రామ పంచాయతీ సభ్యులతో పాటు ఎన్నుకుంటారు. సాధారణ ఎన్నికల్లో ఎన్నికైన సర్పంచ్ సాధారణ ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీ మొదటి సమావేశానికి ఎన్నికల సంఘం నిర్ణయించిన తేదీ నుంచి అయిదు సంవత్సరాల పాటు పదవిలో ఉంటారు.**



# సర్పంచ్‌ల అధికారాలు, బాధ్యతలు

గ్రామ సర్పంచ్ పదవికి అకస్మాత్తుగా కల్గిన ఖాళీలో ఖాళీ ఏర్పడిన తేదీ నుంచి 120 రోజుల్లో సర్పంచ్‌ని ఎన్నుకోవాలి. ఆ విధంగా మధ్యంతర ఎన్నికలో సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి గ్రామ పంచాయితీకి మిగిలిన కాలానికి మాత్రమే సర్పంచ్‌గా పదవిలో ఉంటారు. సర్పంచ్ పదవి రీత్యా గ్రామ పంచాయతీ సభ్యులుగా ఉంటారు. గ్రామ సభ మీటింగులకు, గ్రామ పంచాయతీ మీటింగులకు సర్పంచ్ అధ్యక్షత వహిస్తారు. అంతేకాక, ఉపసర్పంచ్ పదవికి ఎన్నికలను నిర్వహిస్తారు. సర్పంచ్, ఉపసర్పంచ్ నిర్దిష్టమైన రూపంలో తమ పదవులకు రాజీనామా చేయవచ్చు.

గ్రామ సర్పంచ్ కార్యనిర్వాహక వర్గానికి అధిపతిగా ఉంటారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్యనిర్వహణాధికారి, (ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు) గ్రామాభివృద్ధి అధికారి (డెవలప్‌మెంట్ ఆఫీసరు) మొదలైన వారు సర్పంచ్ పాలనాధికారానికి లోబడి ఉంటారు. సర్పంచ్ సలహాపై గ్రామ కార్యనిర్వహణాధికారి గ్రామ పంచాయతీ సమావేశాలను, గ్రామ సభ సమావేశాలను ఏర్పాటు చేయిస్తారు. సర్పంచ్ గ్రామ పంచాయతీ కాగితాలు, పత్రాలు, లెక్కలు, రికార్డులన్నింటినీ తెప్పించుకొని వాటిని పరిశీలించవచ్చు.

పంచాయతీ రాజ్ చట్ట నిర్దేశాలను అమలు జరిపే సందర్భంలో ఆ గ్రామంలోని వ్యక్తి లేక వ్యక్తుల ఆస్తిపాస్తుల వివరాలను, ఇంకా ఇతర రకాల అవసరమైన సమాచారాన్ని అందించమని సర్పంచ్ అధికారిని కోరవచ్చు. గ్రామ పంచాయతీ సభ్యులలో ఏ సభ్యులైన అనర్హతకు గురైనప్పుడు సర్పంచ్ ఆ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేయాలి. గ్రామ పంచాయతీ తీర్మానాలను ఆమోదించిన రూపంలోనే సర్పంచ్ వాటిని అమలు జరిగేటట్టు చూడాలి. ఆయన ఆ తీర్మానాల పరిధిలోనే వ్యవహరించాలి.

గ్రామ సర్పంచ్ పదవికి ఖాళీ ఏర్పడినప్పుడు కొత్త సర్పంచ్ ఎన్నిక అయ్యేవరకు ఆ అధికారాలను ఉప సర్పంచ్ నిర్వహిస్తారు. సర్పంచ్ వరుసగా పదిహేను రోజులకు మించి గ్రామంలో లేనప్పుడు గాని, న్యాయ స్థానపు ఉత్తర్వుల కారణంగా కార్యక్రమాలను, విధులను నిర్వహించలేనప్పుడు గాని, విధుల నిర్వహణలో అశక్తులైనప్పుడు గాని సర్పంచ్ విధులు, బాధ్యతలు, అధికారాలను ఉపసర్పంచ్ నిర్వహిస్తారు. ఉపసర్పంచ్ కూడా పైన పేర్కొన్న కారణాల వల్ల విధులను నిర్వహింపజాలని పరిస్థితి ఏర్పడిన యెడల, సర్పంచ్ విధులను, బాధ్యతలను, అధికారాలను నిర్వహించటానికి కమీషనరు పంచాయతీ సభ్యులలో ఒకరిని తాత్కాలిక సర్పంచ్‌గా నియమిస్తారు.

సర్పంచ్ తన అధికారాలను గాని, విధులనుగాని, బాధ్యతలను గాని లిఖితపూర్వకంగా ఉపసర్పంచ్, లేదా ఉపసర్పంచ్ లేనప్పుడు పంచాయతీ సభ్యులలో ఏ సభ్యులైన నిర్వహించే విధంగా ఏర్పాటు చేయవచ్చు. అయితే, సర్పంచ్ ఆ విధంగా డెలిగేట్ చేసిన అధికారాలను ఉపసర్పంచ్ సర్పంచ్ నియంత్రణకు లోబడి వినియోగించాలి. సర్పంచ్ వాటిని ఎప్పుడైనా సవరించవచ్చు. తాత్కాలిక సర్పంచ్‌ని నిర్దేశాలలో పేర్కొన్న విధంగా కమీషనర్ పదవి నుంచి తొలగించవచ్చు. ప్రభుత్వం నిర్ణయించిన పారితోషికాన్ని సర్పంచ్ పొందవచ్చు.

**విధులు - బాధ్యతలు**

**గ్రామ పంచాయితీలు అనివార్యమైన బాధ్యతలు (45 వ సెక్షను) :**

గ్రామ పంచాయితీలకు రెండు రకాల అధికారాలు ఉంటాయి. వాటిలో ఒకటి అనివార్యమైన బాధ్యతలు కాగా, మరొకటి ఐచ్ఛిక సంబంధమైన విధులు.

గ్రామ అవసరాలను తీర్చటానికి, ప్రజలకు కనీసావసరాలను సమకూర్చి వారి సంక్షేమానికి తోడ్పటానికి తనకు గ్రామ పంచాయితీ గల నిధుల మేరకు తగిన విధంగా కేటాయింపు చేయాలి.

- గ్రామ పంచాయితీ అధికారమందున్న అన్ని భవనాలు, రోడ్లు, వంతెనలు, కల్వర్టులు, రోడ్డు కట్టలు, దారుల నిర్మాణం,

మరమ్మత్తు, నిర్వహణలను చేయటం గ్రామ పంచాయితీ ప్రధాన కర్తవ్యం.

- అదే విధంగా పంచాయితీ గ్రామంలో ఉన్న పబ్లిక్ రోడ్లు, బజార్లు, బహిరంగ స్థలాలలో దీపాలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, మురుగునీరు పోవటానికి కాలువలను త్రవ్వించి వాటిని నిర్వహించాలి.
- గ్రామ పంచాయితీలో ఉన్న బజార్లలోను, వీధులలోను చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు, పొదలు మొదలైన వాటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచటం, వాడుకలో లేని బావులను, అపరిశుభ్రంగా ఉన్న కుంటలను, మడుగులను, పూడ్చించి పారిశుధ్యాన్ని కల్పించటం, ప్రైవేటు, పబ్లిక్ మరుగుదొడ్లను శుభ్రపర్చడానికి ఏర్పాట్లు చేయటం, శ్మశానాలు, ఖనన వాటికలను ఏర్పాటు చేసి వాటిని నిర్వహించటం.
- ఎవరూ పట్టించుకోని మానవ, జంతు కళేబరాలను సంస్కరింపచేయటం, అంటు వ్యాధులు, మలేరియా వంటి వ్యాధులు రాకుండా చూడటం, వచ్చిన వాటికి చికిత్స చేయించటం వంటి కర్తవ్యాలలో గ్రామ పంచాయితీ చర్యలు తీసుకోవాలి.
- ఎరువుల వనరుల సంరక్షణ, కంపోస్టు తయారీ, ఎరువుల విక్రయం వంటి పనులు జరిపించటంలో శ్రద్ధ చూపాలి.
- జనన, మరణ రిజిస్టరు నిర్వహించటం, బందెల దొడ్లను ఏర్పర్చి నిర్వహించటం వంటి కర్తవ్యాలను గ్రామ పంచాయితీలు నిర్వహించాలి.
- బావుల త్రవ్వకం, వాటి మరమ్మతు, చెరువుల త్రవ్వకం, వాటి మరమ్మతు, బట్టలు ఉతకటానికి, స్నానాలు చేయటానికి నీటిని అందేటట్లు చూడటం, త్రాగటానికి రక్షిత నీటిని కల్పించటం.
- వాటి నిర్మాణం, నిర్వహణా బాధ్యతలను గ్రామ పంచాయితీ వహించాలి. గ్రామ స్థాయిలో వనరుల ప్రణాళికను రూపొందించాలి.
- పంచాయితీ రాజ్యచట్టంలోని ఒకటవ అనునూచికలో పొందుపర్చిన 29 అంశాలలో ప్రభుత్వం పంచాయితీలకు అప్పగించిన అంశాలకు సంబంధించిన విధులను కూడా నిర్వహించాలి.

### ఐచ్ఛికమైన బాధ్యతలు (46వ సెక్షను)


గ్రామ పంచాయితీ గ్రామ అవసరాలను తీర్చటానికై తాను ఉచితమని భావించినట్టి కేటాయింపులను ఈ క్రింది విషయాలలో చేయవచ్చును.

- ప్రయాణీకులకు ధర్మశాలలు, సరాయిలు, విశ్రాంతి గృహాల నిర్మాణం, నిర్వహణ.
- రోడ్ల ప్రక్కన, బహిరంగ స్థలాల్లోను చెట్లను, తోపులను నాటి వాటిని పరిరక్షించటం.
- ప్రాథమిక దిగువ స్థాయిలో విద్య, ఎలిమెంటరీ విద్య, సాంఘిక, ఆరోగ్య విద్య, కుటీర పరిశ్రమలు, వాణిజ్యాలను పెంపొందించటం, అభివృద్ధి చేయటం.
- వైద్యశాలలను స్థాపించటం, గ్రామీణ వైద్యులకు సబ్సిడీలను చెల్లించటం.
- వైర్‌లెస్ రిసీవింగు సెట్లు, ఆట స్థలాలు, వ్యాయామ శాలలు, క్లబ్బులు, వినోదం, శారీరక పుష్టి కోసం కేంద్రాలను స్థాపించటం, వాటిని నిర్వహించటం.
- గ్రంథాలయాలను, పఠన మందిరాలను స్థాపించి వాటిని నిర్వహించటం.
- వికలాంగులకు, దిక్కులేని వారికి, అస్వస్థులకు సహాయం కల్పించటం.
- నారుమళ్ళను ఏర్పాటు చేసి వాటిని నిర్వహిచటం, మేలిరకపు విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల స్టోరులను స్థాపించి వాటిని నిర్వహించటం, మేలురకపు విత్తనాలు, క్రిమిసంహారకాలు, తెగుళ్ళ మందులను ఉత్పత్తి చేసి, వాటిని పంపిణీ చేయటం, పశు ప్రదర్శనలను, వ్యవసాయ ప్రదర్శనలను నిర్వహించటం.
- ఉత్పత్తిని పెంచే నిమిత్తం ప్రదర్శనా ప్లాట్లను ఏర్పాటు చేయటం, మేలిరకపు వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయటం.
- భూముల సహకార నిర్వహణను ప్రోత్సహించి ఉమ్మడి సహకార వ్యవసాయాన్ని నిర్వహించటం. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామీణ గృహ నిర్మాణ ప్రాజెక్టు పథకంలో పేర్కొన్నట్లు ఇటుకలు, పెంకులు, మడత బందులు, తలుపులు, కిటికీలు, వాసాలు, ఇతర కట్టడపు వస్తువులను తయారు చేయటానికై సహకార సంఘాలను పెంపొందించటం.
- గిడ్డంగులను, ధాన్యపు కొట్లను నిర్మించి, వాటిని నిర్వహించటం.
- పశువుల కొట్టాలను ఏర్పర్చి, వాటిని నిర్వహించటం.
- గ్రామ నివేశన స్థలాలను విస్తరింపజేయటం.
- ఆబోతులను కొనటం, పశుపోషణ, పశు సంవృద్ధి పర్చటం, పశు వైద్య సహాయాన్ని కల్పించటం.
- సంతలు, జాతరులు, ఉత్సవాలను నియంత్రణ చేయటం.
- గ్రామాలలో సామాజికాభివృద్ధి పనుల నిమిత్తం స్వచ్ఛంద సేవలను ఏర్పాటు చేయటం.

- ప్రసూతి శిశు సంక్షేమ కేంద్రాలను ఏర్పర్చి వాటిని నిర్వహించటం.
- కాపలా, రక్షణ, ఏర్పాట్లు చేయటం.
- కరువు, విపత్తుల సమయంలో సహాయం చేయటానికై ఏర్పాట్లు చేయటం.
- విచ్చలవిడిగా తిరిగే ఊరకుక్కలను నాశనం చేయటం.
- నిరుద్యోగులకు సంబంధించిన గణాంకాలను తయారు చేయించటం.
- పబ్లిక్ మార్కెట్లను తెరిపించి వాటిని నిర్వహించటం
- పబ్లిక్ పశువధాగృహాల (కబేళాల)ను ప్రారంభించి వాటిని నిర్వహించటం.
- కమతాల ఏకీకరణ, భూసార పరిరక్షణలతో పాటు భూసంస్కరణ చర్యలను అమలు జరిపించటం.
- ప్రజల్లో సామరస్య భావాన్ని, సంఘీంభావాన్ని నెలకొల్పి ప్రోత్సహించటానికై అస్పృశ్యతా నిర్మూలన, అనుసూచిత వర్గాల వారికి ఇండ్ల స్థలాలను కల్పించటం, అవినీతిని నిర్మూలించటం, మత్తు పానీయాలను, మత్తు పదార్థాల వాడుకను నిషేధించటం, జూదం, వ్యాజ్యాలను నిరుత్సాహ పర్చటం.
- గ్రామంలోని ప్రజల భద్రత, ఆరోగ్యం, నైతిక, భౌతిక సంక్షేమానికై చర్యలు తీసుకోవటం.

రెండు లేక అంతకుమించిన గ్రామ పంచాయితీలు నిబంధనల ప్రకారం ఉమ్మడి వైద్యశాలలను, శిశు సంక్షేమ కేంద్రాలను, ఇతర సంస్థలను నెలకొల్పుకొని వాటిని నిర్వహించవచ్చును.

గ్రామ పంచాయితీలు తమకు అందుబాటులో ఉన్న నిధులను బట్టి ఈ కార్యక్రమాలను చేపట్టి, వాటిని నిర్వహించవచ్చు. ఇవి ఐచ్ఛిక విధులే అయినప్పటికీ, వీటిని పూర్తిగా విస్మరించటానికి గాని, అలక్ష్యం చేయటానికి గాని వీలులేదు. సమాజంలోని ప్రజల సాంఘిక, ఆర్థిక, అభివృద్ధి దృష్ట్యా, వీటి అమలు అవసరం చాలా ఉంది.




## గ్రామ పంచాయితీల హక్కులు, అధికారాలు

గ్రామ పంచాయతీ తన విధులను వినియోగింపదగు ఏదేని ప్రయోజనం నిమిత్తం విరాళాలను గాని, ట్రస్టులను గాని స్వీకరించవచ్చు. బందెలదొడ్డి విషయంలో పశువుల అక్రమ ప్రవేశానికి సంబంధించి విధించిన జరిమానాలను, ఎవరికీ సంబంధం లేని పశువులను అమ్మకం చేయటం ద్వారా వచ్చిన సొమ్మును పంచాయితీకి జమకట్టాలి. గ్రామ పంచాయితీ పోగు చేసిన చెత్తా చెదారం, ఇతర పదార్థాలు దానికే చెందుతాయి. చిన్న తరహా నీటి పారుదల చెరువుల్లో చేపలు పట్టుకోటానికి నిబంధనల ప్రకారం పంచాయితీ వాటిని వేలం పెట్టవచ్చు. అటువంటి చెరువు గట్లపై చెట్లను పెంచి వాటిపై వచ్చే ఆదాయాన్ని అవి పొందవచ్చు.

గ్రామంలోని సాముదాయక భూములు, వాటిపై వచ్చే ఆదాయం, పోరంబోకు భూములు, పచ్చిక బయళ్ళు పంచాయతీకి సంబంధించి ఉంటాయి. పోరంబోకు భూముల వినియోగాన్ని, ఆ భూముల్లో ఉన్న చెట్లు మొదలైన వాటి వినియోగాన్ని క్రమబద్ధం చేసే అధికారం పంచాయితీకి ఉంటుంది.

గ్రామ పంచాయితీకి పంచాయతీ చట్టం అనేక విధులను నిర్ణయించింది. ఈ విధులను సమర్థవంతంగా నిర్వహించటానికి పంచాయితీలకు నిధుల అవసరం ఉంటుంది. పంచాయితీలు అనేక పన్నులను విధించటానికి చట్టం అధికారాన్ని కల్పించింది.

గ్రామ పంచాయితీలు ఇంటి పన్నును, కొలగారం పన్నును, గ్రామంలో ఉన్న ఆస్తుల క్రయ విక్రయాలపై సుంకాన్ని విధించవచ్చు. వాహనాలపై పన్ను విధించవచ్చు, నిర్దిష్టమైన ప్రయోజనం నిమిత్తం వ్యవసాయ భూములపై పన్ను విధించవచ్చు. ఆక్రమించిన భూములపై వార్షిక కౌలు విలువపై రూపాయికి రెండు పైసల వంతున భూమి సెస్సు విధించవచ్చు. ప్రకటనలపై పన్ను వేయవచ్చు.

మార్కెట్‌లలో గాని, ప్రయివేటు మార్కెట్లలో గాని రోడ్లు నిర్మించాలని గాని, మురుగు నీటి వనరులను ఏర్పాటు చేయాలని గాని, గేట్లు పెట్టాలని గాని పంచాయితీ లిఖిత పూర్వక ఆదేశాలను వాటి యజమానులకు పంపవచ్చు. బజార్లకు, వీధులకు పేర్లు పెట్టటానికి, ఇండ్లకు నెంబరు వేయటానికి పంచాయితీకి అధికారం ఉంది. గ్రామంలో ఉన్న ఫెర్రీల విషయంలో వాటి నిర్వహణకు సంబంధించిన అధికారాలు పంచాయితీకి ఉన్నాయి. పంచాయితీ తన అవసరాల నిమిత్తం ఏ ఆస్తినైనా నిబంధనల ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించి సేకరించవచ్చు. ఆ ఆస్తి గ్రామ పంచాయితీకి చెందిన ఆస్తి అవుతుంది.

**- సి.ఎం.పి.**

# దళిత మహిళా సర్పంచ్ – వివరణలు

**సైడు కాల్వకు మూడు లక్షలు సాంక్షనైందని దమ్మన్నపేట వూరంత పొక్కింది. సర్పంచి వినోదగ్గూడ సంబురంగానే వున్నది. వినోద సర్పంచిగా గెల్సిన రెండేళ్లకు ఎదురు సూడంగ ఎదరు సూడంగ గిప్పుడొచ్చినయని సంతోషపడ్డది. పనచ్చిందని ముందుగాల తెల్సింది ఉపసర్పంచి ఎల్లారెడ్డికే. ఎల్లారెడ్డి యిదువరకు సర్పంచిగ జేసిండు వినోదను ఎలక్షండ్ల దింపి పోటీ జేసేదానికి సాయం జేసింది ఎల్లారెడ్డే. చార్జి దీస్కున్నది. ఎల్లా రెడ్డి కాన్నుంచే. వూల్లెకు బోతే... సర్పంచమ్మా సైడు కాల్వకు పైసలొచ్చినయాట గదా తెచ్చుకోపోరాదు. ఓ... నీ గుడిసె మారిపోదా బిల్డింగు కడ్తన్నవా లక్షాదికారైతవ్ గారెల గంపలవడ్డవ్ లక్షల గంపలపడ్డవని కనవడ్డోల్లంత సీర్క తింటుండ్రు ఫండ్సు వూల్లె పనిచేయించెదానికి వస్తయి గాని నాయింట్లె కొస్తయా గిన్నేండ్లట్లనే వచ్చినయా గిన్నేండ్ల సంది గీ వూరికి ఏమచ్చిందో ఏంబొయిందో ఏం పనులొచ్చినయో ఏం పైసలొచ్చినయో ఏమానవురుగుకు దెల్వకపాయేది, ఎవ్వన్నోట్లెకెల్లి కూతరాక పాయ్యేది ఎట్లచ్చేటియో ఎట్ల బొయోటియో నేను సర్పంచి గున్నప్పుడే ఫండ్సచ్చిన సంగతి వూరు వులో వులో అంటంది దీని మతులావేందనేది యింకా వినోద కర్తంగాలే.**

వినోదకు గుంట సెంటు భూమిలేదు. పెనిమిటోల్ల దిక్కు వినోద కుటుంబంల ఎవ్వరు సద్వుకోలే. ఫండ్సచ్చినట్లు నాకు ముందుగాల తెలువాలె' వచ్చినట్లు నాకు లెటర్ గూడ యింక రాలే, సర్పంచంటె వూరికి పెద్ద. సర్పంచి తర్వాతనే వూల్లె ఎవ్వరైన అంటారు. నా బతుకు జూత్తె గిట్లున్నదనుకునేది. సరె ఉపసర్పంచిని తెలుసుకుందామని అయినింటికి బొయింది. 'పటేల్లేడా' రంగవ్వా అని ఉపసర్పంచి భార్యనడిగింది. 'ఆ... లేడు, ఎందుకు వినోదా' అన్నది రంగమ్మ. యిదివరకు ఏందే వినోద అనేది సర్పంచయిన కాంచి అంటలేదు. గా తేడకే తనంటె తనకే గొప్పనిపించింది వినోదకు

ఏం లేదు ఏమో ఫండ్సచ్చినయంటండ్రు తెల్సుకుందామనచ్చిన' సర్పంచిగ కాకుంట మామూలు గొంతుతోనే అంది వినోద.

పెద్ద అడుగు పోంటీ కుర్చీలున్నా మాట వరసకన్నా కూసుండు మనలేదు వినోదను. 'ఏమో రోజుబోతుడు నాకేంజెప్తడు, ఏం జెప్పడు పోతున్నంటే పో అంట. ఇద్దరు ముగ్గురు మీ వార్డు మెంబర్లొచ్చుండె వాల్ల మాటలంబట్టి ఎమ్మార్వో ఆఫీసుకు బోతున్నరనిపిచ్చింది.

'వార్డు మెంబర్లంటెవరు రంగవ్వా! వినోద ఎవరో తెల్సుకుందామని.

'ఏమో బుచ్చిరెడ్డి, గౌండ్ల రాజీరు, సాలె చంద్రయ్యనుకుంట'

వినోదకు సల్లచెమటలొచ్చినయి. వీల్లు వీల్లే పదురుకంటండ్రు సర్పంచి నైనందుకు నాకు వొక్క మాట ముచ్చట సెప్తలేరని. అనుకొని అక్కన్నించి పంచాదాఫీసుకొచ్చింది..

ఆఫీసుముందు పిల్లలు సిర్రగోనె ఆడుకుంటండ్రు 'ఎవ్వల్లేని కాడ ఆడుకోండ్రి గీ ఆఫీసు ముందటేంది. ఆ సిర్రెదగిల్తే పిడాత పానం బోతది మైసన్నా... వాల్లనెల్లగొట్టక నువ్వు గూడ సన్నిపోరని వైనవే' సుంకరి మైసయ్యతోని.

'సెక్రెటీ సాబురాలే' అని ఆఫీసుల కూసున్నది.

'రాలే వినోదక్కా, నిన్నగూడ రాలేసారు ఏమైందో'

గీన రోజురాడు గని, వచ్చినట్టు సంతుకమైతే జేత్తే

'సరె ఏంజేత్తం గనీ... ఏమన్న పోస్టు కవర్లచ్చినయా' అన్నది ఫండ్సచ్చినట్లు ఏదన్న కవరు గిట్లొస్తదనే వుద్దేశంగ.

'ఏం జేసుకుంటవు బిడ్డా సదివి సాటజెరిగినట్లు సదివినావె లెక్కడుగుతది. సదువు రాకున్నా ఏందో సదువచ్చినోల్ల కంటెక్కువ మాట్లాడ్తది.' అని మన్సుల నసుక్కొని పైకి 'రెండు దినాల కింద ఏవో లిపాపలచ్చినయి వినోదక్కా గవ్వేంటియో సారేమండ్లే' అని బైట కూసుండు సుంకరి మైసన్న ఏదో యాదొచ్చి.

'వినోదక్కాగా ఔసలి వెంకటన్న పెండ్లమచ్చింది ఏదో పంచాదికి రమ్మని' సెప్పింది. వద్దు మైసన్నాగా పంచాదులల్ల కూసునుడు తాగుడు తినుడు కరువుమంటె కప్పక్కోపం యిదువమంటె పాముక్కోపం గండ్లకు బోవుడద్దు మైసన్నా గవి జూసెదానికి గాల్ల కుల సంగాలున్నయి మనముండుడు కంటు గసొంటి పంచాదిల్ల పోకుండుంటెనే మంచిదె' 'నువద్దే' అని నవ్వుండు మైసన్న.

వినోద వారం రోజుల్నించి ఉప సర్పంచి ఎల్లారెడ్డి కోసం తిరిగినా దొరుకుతలేడు. ఎట్లన్న బట్టుకోవాలెనని రోజు తిరుగుతంది. పటేలును కలువుమని చెప్పేంత ఐశతి లేదు.

గీ సెక్రటరీ గూడొస్తలేడు సరింగ. గాయినొచ్చినప్పుడు పొలం పనులతో తీర్తలేదు.

వచ్చినప్పుడు కుల్ల కుల్ల ఏది మాట్లాడడు. గవచ్చినయి గియి బోయినయి అని తేటతెల్లమే జెయ్యదు గాడిది కొడుకు. అసలే

రిజర్వేషండ్లొచ్చిన అండ్లింక సదువు రాదు యింకేమున్నది పర్వ జేయడు.

అటు మొగడన్న సక్కటోడాంటె ఆడసొంటోడే. జెర పటేలుతోనుండు ఎయ్యి సందుజేత్తలేరు ఆడి మనిషిని అనుకుంటుండ్రో ఏందో జర తెలుసుకో అంటే పోతండు. పటేలు రొండు గుడంబ పాకీట్లు పోయించంగనే, యింత బగారన్నం తినిపియ్యంగానే సోలుక్కుంటచ్చి పండవట్టె. రేపేమైనా బద్నామయ్యేది నేనే. ఎస్సీవోల్లకు అందున ఎస్సీ ఆడిదానికి పవరిత్తె ఏంజేసింది అని నా మీద, నా జాతిమీద నిందెలేస్తరని పత్తాయించుకొన్నది.

నమ్మిముంచి నిలబెట్టినందుకు తనువు తాకట్టు వెట్టయినా గా మర్యాద కాపాడుకోవాలె అనుకుంటె 'నోరోటి మాట్లాడ్తె నొసలొటి ఎక్కిరిత్తంది.' అని విచారించుకొన్నది.

రేపు గీ సెక్రటరీ పటేలు కలువకుంటే ఎల్లుండున్న ఎమ్మార్వో ఆఫీసుకుబొయి గీ ఫండ్సు సంగతి తెలుసుకోవాలె అన్ని మన్సుల అనుకున్నది బైట్నించి దుమ్ము నిండు కుంటంది గొడ్లమంద దుమ్ము రేపుకుంట ఓదాని మీద ఓటెక్కుకుంట ఓ దాన్ని ఓటి పొడ్సుకుంట ఆడుకుంట సెంగున బిల్లని వుర్కుకుంట జోకాడుకుంట రేపొద్దుగాల్నే కలుస్త యిప్పుడు ఎవ్వరి గుంజలకు వాళ్ళమే అనుకుంట, వెన్నెల్లో దుమ్ము సిన్నపోరగాండ్లలెక్క రేపుకొని పోసుకుంటన్నయి. వినోద బైటికొచ్చి వాటికైతుకాలు సూస్కుంట కొంచెం కొంచెం ఉప్పస బోను జూసింది.

'మైసన్నా మా సూడిది వచ్చిందేమో నేంబోతన్న పంపు డ్రైవరొస్తె యింటికి తోలు'

'నీకింక గొడ్లేమున్నయి అమ్మేసినవేమో సర్పంచైనంక' అవునే మేము కాలుకు బట్టగట్టకుంట కచ్చీర్లని, మీటింగులని తిరిగితె గా నోరులేనియి వొర్రి సత్తయి వాటి గోస మాకెందుకని ఒక్క పాలిచ్చే బర్రెనుంచుకొని రొండు మేక పిల్లల్ని ఆవులాగే నమ్మినం. అమ్మి కొంతప్పుగట్టినం.' అని, 'నువ్వు యింకో గంట కూసొని తాలం బెట్టుకొని రా..' అని చెప్పి యింటి దారి బట్టింది. వినోద గొడ్ల గాయ బొయేది. పెండ్లయే దాక గొడ్ల గాసింది వినోద సేతల గోదలు బాగెదుగుతయని యింట్లంతనేది. వాటిని కడుపునిండా మేపుకొని నీల్లు దాగిచ్చి మనిషితోని మాట్లాడినట్లే మాట్లాడితే అందరు 'పిసపోసి' అని నవ్వుకునేది.

పెండ్లప్పుడు ఒగ చిన్న పెయ్యు దూడను యిస్తే దాన్ని పెంపుజేసింది. అది నాలుగీతలీనింది. పశువే పంటనుకునేది. పశువుల్ని పసికూనలోలె సాదుకున్నది.. సర్పంచిగ గెల్చినంక వాటిని ఏదలేక ఎలక్షండ్ల అప్పులు గట్టనీకి ఏడ్సుకుంట అమ్మింది వినోద.

ఏగలేసి గోడ మొకం జూడాలెనని ఒక పాలిచ్చే బర్రెనొక దాన్నుంచుకున్నది.

రాత్రంత సైడు కాల్వ కోసం ఫండ్సచ్చినయి. నోట్లె మంచీల్లు బోసుకోకుంట గా ----- జెయ్యాలె. మూడు లక్షల కోసం గుంటకాడి నక్కలోలె ఎవడివడాశ ---- ఎవ్వన్ని గంటనుకనీయొద్దు శంకమనుకనీయొద్దు. నా మొగడాశ పడ్డాగూడ వొక్క రూపాయి అగంజెయ్యొద్దు వావ్వో గద్దలెంటబడ్డట్టు పడ్తన్నయి. ఏ గద్దలాటలు సాగనియొద్దు. గీ ఉపసర్పంచి గానికి బోలెడు భూమి జాగలున్నయి లంకంత కొంపగట్టుకున్నడు. అయినా పైసంటె పానమిడుసుకుంటడు. తస్సల కాడ కుక్క నాసవెట్టినట్లు ఈడు పైసల కాడ నాస వెడ్తడు. గీని సంగతి గెల్సిన కాన్నుంచి --- గీనికి తాలమెయ్యాలె దూరముంచాలె ఎట్లన్నజేసి అనుకుంటనుకుంటానే వినోదను కన్ను మలిగింది.

తెల్లారి లేసుడు తోనే నోట్లె నీల్లు బోసుకొని మొకంగడుక్కొని పెనిమిటిందీప్కొని బైల్దేరింది. ఉపసర్పంచి యింక లేవలేదంటె అట్లనే లేసేదాక బైట అరుగుల మీద కూసున్నారు.

ఏంది సర్పంచమా గిప్పుడు దీరిందా? పంచె సదురుకుంట కొరెడ్డంగి ఉపసర్పంచి ఎల్లారెడ్డి.

'రంగవ్వ సెప్తలేదా దినామొస్తన్న పోతన్న'

'ఏం సంగతి పొద్దున బైటెందుకు లోపటికి రాండ్రి' అందరు లోపలిగి బోయిండ్రు.

'కూసోండి' అని ప్లాస్టిక్ కుర్చీలం జూయించాడు ఉపసర్పంచి ఫండ్సచ్చిన మాట నిజమేనా పటేలా మనకేమన్న కాయితమొచ్చిందా' అన్నది వినోదా డౌటుగా అగ్గో నన్నడుగుతూ సర్పంచివి నువ్వా నేనా దెల్వాలె గడ' అని ----

'కాయితం సంగతి దెలువదిగనీ సైడు కాల్వలకు మూడు లక్షలు సెలక్షన్ అయినాయి. నువ్వు కూడ ఓ సారి ఎమ్మార్వోను కల్సిరారాదు ఇన్ఫర్మేషన్ లెటర్ వొస్తదేమో యిదినీకు పంటవండింది పో పనిమొదలువెట్టు' అన్నట్టు.

అట్లా మొత్తం తన మీదేస్తే శక్తి కాడికి సేసుకునే దానికి, ----- అవకాశమంటది, కానట్ల ఎవ్వడు సెయ్యనియ్యదు. మూలకున్న ముసలోడు గూడ లేసొస్తడు ఎల్లయి ఏడు పయ్యేలు పదని లెక్కవెట్టేదానికి అని తిట్టుకుంది. అదే రోజు యిద్దరు ఆడ వార్డు మెంబర్లను తీసుకొని ఎమ్మార్వో ఆఫీసుకు బొయింది. పెనిమిటిని తీసుకొని పోతే అందరు సర్పంచివి నువ్వా మీ భర్తనా గాయినెందుకు తీస్కొస్తవ్ అని గేలి చేస్తుండ్రి. గిట్టుంటె మహిళా సాధికారత ఎట్ల సాదిస్తది గవర్నమెంటుల అని మాట్లాడుతారు. అందికే వినోద వార్డు మెంబర్లనే తీస్కపోతది, కొంచెం సదవుకొన్న నోరున్న మా వార్డు మెంబర్ తోని బోతే లేనిపోనియి అంటగట్టిండ్రు. అందికే వినోద ఆడ వార్డు మెంబర్లనే తీస్కపోతది. వాల్లకు వీలు బడనప్పుడే పెనిమిటిని తీస్కపోతది. 'ఎమ్మార్వో సారున్నడా అక్కడ కూసున్న ఒకాయినతోని 'యిప్పుడు రాడు లంచ్‌కు బొయిండు మూడు తర్వాతొస్తడు. యాని

తలపండు వలుగ తినా ఏరుగ నాకేడ తీర్తదన్నట్లే వుంటరీ కొడుకులు పన్నెండు గూడయితలేదు. అప్పుడే పగటి బువ్వ గావాల్సొచ్చిందీనికి' అని మన్నుల తిట్టుకొన్నది. వార్డు మెంబర్లు అబ్బో వినోదక్కా గప్పటి దాకుండము పోవాలె యింట్ల బియ్యాం లేవు పట్టిచ్చుక రావాలె నని ఒకామె, బాగలేని పిల్లనిడ్సి పెట్టొచ్చిన్నని యింకొకామె తొందర పెట్టిండ్రు. 'అరె నేనేంజేత్తు నా సొంత పనా మనూరికి రొండేండ్ల నుంచి పని రాదేయే ఫండ్స్ రావాయె. గిప్పుడొచ్చినయని తెల్సింది. యిత్తే ఏయితోని, ఎమ్మార్వోతోని మాట్లాడి ఎట్లజేద్దామేందని మాట్లాడ్దామనొస్తె పోతం పోతం అనవడితిరి.

'మీవోలే నేను ఆగరాదుండ్రి' అని కొంచెం గట్టిగా మాట్లాడింది వినోద.

ఆ ఆఫీసు చెట్టుకింద మూడు గంటలదాక కూసున్నరు మూడు గంట తర్వాత ఎమ్మార్వో వచ్చిండు. 'మూడు లక్షల ఫండ్సు మీ వూరికొచ్చినయి సైడ్ కాల్వలు వేయించనీకి.

'మొత్తం సర్పంచికిస్తరా' వార్డు మెంబరు

'అమ్మా అట్లటిస్తం ముందు కాల్వ పని సగం మొదలు బెట్టి పని చేయించి చేసిన పనికి దిల్స్ పడితే కొంత ఫండు సాంక్షనైతది. కాల్వ పని పూర్తయినంక మిగతా మొత్త మిస్తం అనగానే అయ్యో ఆ సగం పని మొదలు వెట్టనీకి ముందుగాల కొంత పైసె బెట్టాలే. 'అవి ఎక్కడ్నుంచి తెచ్చి పెడుదు' వినోద

'ఎక్కడి మంచి చెడ్తరు మీ సేతి నుంచి' చాలా మామూలుగ

'మూడు లక్షల సగమంటే లక్షన్నర ముందు వెట్టుకోవాల్నా'

'అ... అంతే'

'గంత పైసె మాకాడేడిది సారు ఎక్కన్నుంచి బెడుదుము సారూ, కూటంచుకు కూరలేనోల్లం ఉప్పుంటె తొక్కుండనోల్లం ఒక్క పైసా రెండు పైసలా గంతప్పు ఏడదెస్త సారూ' అన్నది వినోద తన పరిస్థితి గురించి.

'మీ ఉపసర్పంచి యిది వరకు జేసిండు గదా ఎల్లారెడ్డి సాబ్ నడుగమ్మా మహిళా సాధికారతంటరు మల్లా ఎల్లారెడ్డినడుగమనెట్లంటరు సారు' కొంచెం ధైర్యంగ

'యిది మేంజేసిన రూలు గాదు గవర్నమెంటులున్నది చెప్తన్న. సర్పంచి గారూ మల్లా?'

పొయి పులినోట్లె తల్కాయవెట్టంటడు ఏంజెయ్యాలె అనుకొని 'గీ రూలు గౌరుమెంటు మార్చుకోవాలె సారూ...'

'ఎందుకు'?

ఎందుకంటేంది!

'పైసలిచ్చి పనుల్జేపియ్యాలె గని పనులైనంక పైసలిస్తమంటే ఏకూలోలొస్తరు? దానికి సిమెటి ఉసికె కంకెర ఏంబెట్టి కొనాలె ఎవల్జేస్తరు సారూ... ముందే పెట్టుబడెవ్వరు బెడ్తరు' అన్నది వినోద అమాయకంగ

'అమ్మా మీ ఉపసర్పంచి ఎల్లారెడ్డి నడుగు అంత జూస్కుంటడు ముందే పన్జేయిస్తడు బిల్స్ బెడ్తడుపో... నీకెందుకమ్మా నెత్తి నొప్పి' అన్నడు విసుగుతోని

'ఆ.. పెడ్తడు పెడ్తడు ఈతగింజె యిచ్చి తాటిగింజె దొబ్బుతడు' గొనిగింది మెల్లగ.

'యిగో సర్పంచమ్మా నువ్వు కొత్త యిది వరకు చెయ్యలేదు గనుక చెప్తున్న లక్షన్నర బెట్టి సైడు కాల్వలు వేయిస్తేనే నీకు బిల్లు సాంక్షన్ అయితది లేకుంటే కాదు అదట్లనే మురిగిపోతది రిటన్ గొడ్తంతర్వాత మమ్మల్ని అడగొద్దు' ఎమ్మార్వో నిర్ణయంగ జెప్పిండు.

'గిట్లుంటది సాధికరామంటె' వార్డు మెంబరు.

పని మొదలుబెట్టు మూడు లక్షలు పలారమోలె తిను మల్లా బొయి పటేలా లక్షన్నర బెట్టు అని ఎల్లారెడ్డింటి సుట్టు దిరుగాలె. యిదంత చూసిన అటెండరు. 'ఓ అక్కా దొంగలు దొంగలు వూల్లుబుంచుకున్నట్లే మీ ఉపసర్పంచున్ను ఎమ్మార్వో ఎంపిడివోలు ఎవుడో ఓ పలారం బంచుకున్నట్లు బంచుకుంటారు. బికారి ఎస్సీ సర్పంచికైతే ఒక్క పైసియ్యారు. నూటిక్కోటి కొక్కడుంటడు తిననోడు, ఏ ఫండొచ్చినా వీల్లు పది పర్సెంటు, పంజేయించెటోడు వానిష్టెం' అని ఎమ్మార్వో ఆఫీసుల రోజు జూసె అనుభవంతోని అటెండర్ బాలయ్య అర్థం జేయించిండు వినోద వాల్లకు సేతల బెల్లంబెట్టుకొని ఈగెల్ని జోపలేకుంటున్నది నాకత అనుకుంది వినోద. అట్ల తిరుగుడు అసహాయంగ ఉపసర్పంచి ముందట సెయి సాపుడు తల్కాయ కొట్టేసుకున్నట్లు వినోద బాధపడింది. వూల్లె లక్షన్నర పెట్టుబడి పెట్టేటోడెవ్వడున్నడని ఎతికితే 'అబ్బో' మానుంచి గాదన్నరు. ఊదుడు బుక్కుడు 'పటేలా' పని మొదలు వెట్టు అని ఎట్ల సెప్పెదు. సెవులు గోసి సేతుల బెట్టినట్టు వూరికోసమొచ్చిన ఫండ్సన్ని అని మీద ఎట్లబోదు.

గట్లబోవుడు సాధికారమా గీ గౌరుమెంటోడు సావగానికి తెలివిలేదా! ఎస్సీవోల్లకు రిజర్వేషండ్లించ్చింది మంచిగనే వున్నది. గీ ఏడు దీపిల్లోల్లు సేతుల తూటు పైసె లేనోల్లు ముందే పెట్టుబడి వెట్టి ఏం జేయిస్తరు ఏడ సావబోతరు. గిదంత పెట్టుబడి వెట్టి జేయించాలంటే ఏడ అది సాధికరమంటారా? గిదంత పెట్టువడి వెట్టేటోనికే పైసదొబ్బ వెట్టనీకే మల్లగాల్లే బాగైతరు. గీ రూలు మారిస్తే బాగుండు దీంతోని ఎస్సీ బీసి ఎస్టీ పేదోల్లు పైసాడికెల్లి దెత్తరు. ఈ సారి మీటింగుల గీ సంగతి జెప్పి ఎస్సీ బీసి సర్పంచులనందర్ని కూడెయ్యాలె. అని వార్డు మెంబర్లతోని మాట్లాడుకుంటు వినోద ఎమ్మార్వో ఆఫీసు నుంచి బైటికొచ్చింది.

**- జూపాక సుభద్ర, డిప్యూటీ సెక్రటరీ, పంచాయతీరాజ్**

# సమాచార హక్కు చట్టం- 2005 (RTI ACT) గూర్చి తెలుసుకుందామా!

**సమాచార హక్కు అంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన విభాగాలలో ఎటువంటి రహస్యం లేకుండా చేయడమే సమాచార హక్కు చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.**

ఈ సమాచార హక్కు చట్టం మన భారతదేశంలో 2005 అక్టోబర్ 12 నుండి ఒక చట్ట రూపం దాల్చింది. సమాచార హక్కు చట్టం రూపకల్పనకు తీవ్రంగా కృషి చేసిన ఉద్యమకర్తలలో అరుణారాయ్, అన్నాహజరే లాంటి వారున్నారు.

అందుకే అరుణారాయ్ ను 'Mother of RTI ACT' అని పిలుస్తారు.

### దరఖాస్తు విధానం

మన భారతదేశంలో సమాచార హక్కు చట్టం -2005 ప్రకారం భారత రాజ్యాంగం గుర్తించిన 22 భాషలలో సమాచారం అందిస్తుంది. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం 3 భాషలలో మనం సమాచారాన్ని పొందవచ్చు. అవి- తెలుగు, హింది, ఇంగ్లీష్.

ఏ వ్యక్తి అయితే సమాచారాన్ని కోరుతున్నాడో అతను ఖచ్చితంగా తన దస్తూరితో చేయాలి.

### ఎవరిని సంప్రదించాలి

సమాచార హక్కు చట్టం -2005 ప్రకారం కేంద్రప్రభుత్వం స్థాయి నుండి మొదలుకుని గ్రామ స్థాయి వరకు ఉండే ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ఒక ప్రజాపరిపాలన అధికారి ఉంటాడు.

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచారహక్కు చట్టం -2005 బోర్డును ఉంచి దానిలో సమగ్రమైన వివరాలు పొందుపరుస్తాయి.

### సమాచారం తిరస్కరణకు గురి అయినపుడు

సమాచార హక్కు చట్టం ప్రకారం ఏ వ్యక్తి అయిన సమాచారం కోరిన 30 రోజులలోపు సమాచారం అందించకపోతే మనం అతని పై అధికారి అయిన అప్పిలెట్ అధికారి, రాష్ట్ర సమాచార కమిషన్‌ను సంప్రదించాలి. మనం సమాచారం అడిగిన కూడా ఇవ్వని నిర్లక్ష్యం చేసిన సదరు అధికారికి తగిన జరిమానా కూడా విధించే అధికారం అప్పిలెట్ అధికారికి, రాష్ట్ర సమాచార కమిషనర్‌కు ఉంటుంది.

సమాచారం పొందటానికి ప్రపథమంగా సమాచారం కోరే వ్యక్తి భారతీయ పౌరసత్వం కల్గియుండాలి. భారత ప్రభుత్వ చట్టం 4(1)(B) ప్రకారం మనకు కావల్సిన సమాచారాన్ని తెల్ల కాగితంపైన లేదా సమాచార హక్కుచట్టం నమూనా పత్రం పైన వ్రాసి మనం సమాచారాన్ని కోరవచ్చు.

మనం సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకున్న 5 నుండి 30 రోజుల వరకు ఆ అధికారి మనకు సమాచారాన్ని అందజేస్తాడు. అదే సమాచారం వ్యక్తి జీవన్మరణానికి సంబంధించినట్లయితే 24 గంటలలోపు సమాచారం పొందవచ్చు.

దరఖాస్తు చేసేటప్పుడు గ్రామ స్థాయిలో అయితే ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. మండల స్థాయిలో 5 రూపాయలు, జిల్లా స్థాయిలో 10 రూపాయలు విలువ చేసే పోస్టల్ స్టాంపును మనం సమాచారం కోరే పత్రం పైన అతికించాలి.

మనం కోరే సమాచారం 3 పేజీలు వరకూ ఉంటే ఆ సమాచారాన్ని ఉచితంగా అందిస్తారు. 3 పేజీలకు మించి ఉంటే ప్రతి పేజీకి అదనంగా 1 రూపాయను చార్జి చేస్తారు. మనం సమాచారాన్ని CD, DVD రూపంలో కూడా పొందవచ్చు. దానికి చార్జీలు అదనంగా వసూలు చేస్తారు.

### ఎటువంటి సమాచారం కోరరాదు

☆ వ్యక్తి కులం, మతం, జాతి మొదలైన విషయాలను ప్రస్తవించరాదు.

☆ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో రక్షణ దశలకు సంబంధించిన విషయాల సమాచారం అందించదు.

☆ ఏదైనా సమాచారం దేశ భద్రతకు, సమగ్రతకు భంగం కల్గించే విధంగా ఉంటే అటువంటి సమాచారం అందించదు.

### అధికారులు - హోదా

☆ కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్ - **సుష్మా సింగ్.**

☆ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ - **జన్నత్ హుస్సేన్**

☆ మన రాష్ట్రానికి చెందిన **మాడభూషి శ్రీధర్** కూడా కేంద్ర సమాచార కమిషన్ సభ్యులలో ఒకరు.

*- **దొడ్డి కుమార్,** బి.ఎస్.వి.*
*జోకల్, శంషాబాద్, రంగారెడ్డి జిల్లా*
*94412 36492*

**సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్) అనేది ప్రపంచవ్యాప్తంగా ఒక చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు కావాల్సిన అవసరాలను తీర్చడం, వారి అభివృద్ధికి కృషిచేయడంతోపాటు పారదర్శకమయిన జవాబుదారీతనంతో కూడిన పరిపాలననే సుపరిపాలన అని చెప్పవచ్చు.**

**మన సామాజిక వ్యవస్థ నుండే వచ్చిన స్థానిక ప్రభుత్వాల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు నిబద్ధతతో, నిజాయితీగా, సమర్థవంతంతగా పాలన చేయాల్సి ఉంటుంది. ప్రజలకుపనుల ను, సౌకర్యాలను కల్పించి వారి మద్దతును పొందాలి. అలాంటి పనులు చేసిన వారు ప్రజల మనస్సులకు దగ్గరవుతారు.**



ప్రజా ప్రతినిధులకు, మరియు అధికారులకు సమర్థవంతంగా బాధ్యతలు స్వీకరించే స్వభావం, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యం వుండాలి. ప్రజా సమస్యలను గుర్తించి, తగిన కార్యాచరణతో ముందుకుసాగాలి.

సమగ్రతలను, దేశ సమగ్ర అభివృద్ధిని సాధించేందుకు ఖచ్చితమయిన, నియమ నిబంధనలు పాటించవలసి వుంటుంది. కేవలం చట్టపరమయిన, విధానపరమయిన ఆవశ్యకతలను మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని.

# స్థానిక ప్రభుత్వాలు - సుపరిపాలన

అదేవిధంగా ప్రభుత్వ వనరులను, స్థానిక వనరులను సమర్థవంతంగా నిర్వహించుకోవాలి. స్వంత ప్రయోజనాలు, బంధు ప్రీతి లేకుండా అధికారాలను ఉపయోగించడం. ప్రజల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య బద్ధులుగా, చట్టబద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం వంటివి, సుపరి పాలనకు ముఖ్యమైన అంశాలు. పరిపాలనలో అవినీతి, బంధుప్రీతి, అలసత్వం, అధికార దాహం మొదలయిన అవలక్షణాలు సుపరి పాలనకు విఘాతం కల్గిస్తాయి.

స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సమర్థవంతంగా సమన్వయంతో సుపరిపాలన సాగించినట్లయితే, ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి. నిర్దేశిత ప్రభుత్వ నిధులు ప్రభుత్వ పథకాలు అర్హులయిన లక్షిత వర్గాలకు చేరేందుకు అవకాశం ఉంటుంది.

స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ చట్టాలకు బద్ధులై, స్వంత లాభాన్ని ఆశించక, సమాజ అభివృద్ధికి, జాతీయ లక్ష్యాల సాధనకు కృషి చేయాలి.

ప్రభుత్వం నుండి ప్రజలు ఆశించే, నిజాయితీ, నిష్పాక్షికత మరియు నిబద్ధతలు ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వోద్యోగులలో ప్రతిఫలించాలి. తదనుగుణంగా, వారు తమ నైపుణ్యాలను, జ్ఞానాన్ని, అనుభవాలను మెరుగుపరుచుకుంటూ ప్రజల ఆకాంక్షను నెరవేర్చ వలసివుంటుంది.

ఈ క్రమంలో ప్రజల నమ్మకాన్ని పొందడానికి, జాతీయ సమైక్యత, ప్రేమను పొందేవిధంగా సేవలు అందించాలి. ఆర్థిక పరమయిన క్రమశిక్షణను అవలంభించాలి. విధి నిర్వహణకు సంబంధించిన అన్ని చట్టాలు, విధివిధానాలు, మార్గదర్శకాలు అవగాహనను నిరంతరం పెంచుకుంటూ, లక్ష్యాలను అధిగమించే దిశగా ముందుకు సాగాలి. ప్రతి పనిలో ప్రతి నిర్ణయంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సాహిస్తూ వనరులను సద్వినియోగం అయ్యేలా చూడాలి. చట్టం పట్ల విధేయులుగా వుండాలి.

తరతరాల ప్రజల ఆలోచనలను నిజం చేసేందుకు నిరంతరం ఉత్సాహంతో, శ్రమిచండం ద్వారా పేదరికం, నిరక్ష్యరాస్యత, నిరుద్యోగం, సమస్యలు తీరడంతోపాటు సమాజ నిర్మాణం జరుగుతుంది. ఇతరులకు మార్గదర్శకంగా వుంటూ ప్రోత్సహించడం, అవకాశాల ను, సద్వినియోగం చేసుకుంటూ, ప్రజావసరాలకు అనుగుణంగా మలుచుకునే విధంగా ఉండడం. కార్యసాధకులుగా, సేవకులుగా, స్ఫూర్తిదాయకంగా ఉండడం. మానవతా విలువలు పాటించడం. ప్రభుత్వ సేవలు, హక్కుగా ప్రజలు పొందేటట్లు చూడడం ప్రజాప్రతినిధుల, ప్రభుత్వద్యోగుల విధి.

ప్రభుత్వం ఎప్పటికప్పుడు వెలువరించే మార్గదర్శక సూత్రాల ను, ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ, ముందుకు సాగినప్పుడే, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం అవతరిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

***- కె. యాదయ్య***
*జాయింట్ డైరెక్టరు (FAC), అపార్డు*

# మనం గ్రామాల దగ్గరకు ఎందుకు వెళ్ళాలి !

☆ మన దేశంలో నేటికి అత్యధిక శాతం గ్రామంలోనే ఉన్నారు.

☆ మనందరం గ్రామాల నుండి వచ్చినా వాళ్ళం. అక్కడుండే జనం కూడా మనవారే.

☆ పల్లెటూళ్లన్నీ ఈనాడు అనేక సమస్యల బరువుతో కృంగిపోతున్నాయి. మన పునాది అయిన గ్రామాలు కుంగితే మనం కూలిపోతాం. కావున మన ఊర్లు బాగుపడక పోతే మనం బాగుపడం.

☆ మనల్ని చదివించాలని, తద్వారా ముసలి తనంలో ఇబ్బంది పడకుండా ఉండాలని మన తల్లిదండ్రులు భావిస్తారు. కాని మనం చదవగలిగినంత చదివించే స్తోమత మన తల్లిదండ్రులకు లేదు. ఎందుకని?


☆ మనకు అపారమైన సహజవనరులున్నాయి. వీటిమీద కష్ట పడి పనిచేసే జనం కూడ ఉన్నారు. అయినా సహజవనరులు వినియోగం సక్రమంగా జరగడంలేదు.

☆ సహజవనరుల వినియోగానికి రూపొందించబడే పథకాలు గ్రామ ప్రజల ప్రాధాన్యతల క్రమాన్ని బట్టి గాక, పైవారు నిర్ణయించిన ప్రాధాన్యతల ను బట్టి రూపొందించబడుతున్నాయి. కాబట్టి జనం వాటిని సొంతం చేసుకోవటంలేదు.

☆ వనరుల పంపిణీలోను, వినియోగంలోను, సమతూకం లోపించింది. ఈ క్రమంలో అసమానతలు, వ్యత్యాసాలు పెరుగుతున్నాయి.

☆ గ్రామంలో ఉత్పత్తి అయ్యే సంపద తిరిగి గ్రామ అవసరాలు తీర్చడానికి అక్కడే ఖర్చు చేయడం వలన కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఇది పరిశ్రమల స్థాపనకు అవసరం అవుతుంది. కాని గ్రామ సంపద ఎక్కువ భాగం బయటకు తరలిపోతుంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, వ్యవసాయ ఆధారపరిశ్రమలు, వ్యవసాయ పరికరాల పరిశ్రమలు, గ్రామ ప్రాంతాల్లో ఏర్పడాలి. అప్పుడే స్థానిక మానవ వనరులను, సహజవనరులను సమర్థవంతంగా ఉపయోగించుకొనగలం.

☆ ఈ కారణంగానే కుటుంబ ఆర్థిక స్థోమత, జీవన ప్రమాణాలు పెరగడం లేదు. కనుకనే పిల్లలకు కనీసం విద్యా, చదవుకోగలిగినంత చదువు చెప్పించలేక పోవుచున్నారు. ఈ పరిస్థితి మరింత దారిద్ర్యానికి, అనారోగ్యానికి, అనాశక్తతకు దారితీస్తుంది. ఇది ఒక విషవలయం.




☆ ఒక వేళ మనం చదువుకున్నా, ఎంత సాంకేతిక నైపుణ్యాన్ని సాధించిన దాన్ని ఉపయోగించి మనకు ఉపాధి కల్పించే పరిశ్రమల అభివృద్ధి గ్రామాలలో పేదరికం ఉన్నంత కాలం జరగదు. అంటే మన శక్తి సామర్థ్యాలు వినియోగించుకొనకపోవడం ద్వారా శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను వాడుకొనే శక్తి లేకపోవడం ద్వారా గ్రామీణ పేదరికం మనందరికీ నిరుద్యోగాన్ని లేదా చిరుద్యోగాన్ని మాత్రమే ప్రసాదించ గలుగుతుంది.

☆ నిరుద్యోగులుగా మిగిలిన యువకులు అశాంతితో అరాచకానికి కారణమౌతారు. శాంతి భద్రతలు క్షీణిస్తాయి.

☆ చిరుద్యోగులుగా చాలీ చాలని జీతంతో తీరని అవసరాలు, అసంతృప్తితో, తనశక్తి సామర్థ్యాల బరువుతో కృంగిపోతూ వారు సమాజానికి గుదిబండగా తయారవుతారు. నిరాశ, నిస్పృహలతో ప్రక్క త్రోవలు తొక్కుతారు. సమాజాన్ని ప్రక్క తోవ పట్టిస్తారు. చదువుకొన్న తరంలోని ఈ స్థితి మూఢ నమ్మకాలు పెరగడానికి, అతీత శక్తులను నమ్మడానికి తద్వారా శాస్త్రీయ భావాల పెరుగుదలను తృణీకరించడానికి కారణమవుతున్నది. ఇంకోరకంగా చెప్పాలంటే గ్రామాలలో ఇప్పటికీ బలంగా ఉన్న మూఢనమ్మకాలను రెచ్చగొట్టడం ద్వారా గ్రామాల పరిస్థితి దయనీయంగా తయారవుతుంది. గ్రామాల అభివృద్ధికి గొడ్డలి పెట్టు.

☆ మన చదువుపై ప్రభుత్వం చాలా ఖర్చు చేస్తుంది అంటే మన చదువు ఖర్చును నిరక్షరాస్యులై గ్రామాలలో వుంటున్న 60% మంది నిరక్షరాస్యులే ఎక్కువగా భరిస్తున్నారు. మనం ఈ రుణం తీర్చవలసి ఉంది.

☆ మన మీద, ఎన్నో ఆశలు పెంచుకున్న తల్లిదండ్రులు కనీస అవసరాలు తీర్చాలంటే మనకు రోజువారీ జీవితంలో ఉపయోగపడే శాస్త్రీయ విద్య దృక్పథం అవసరం దాన్ని పెంపొందడం కోసం జరిగే ప్రయత్నాలకు మన వంతు సహకారం ఇవ్వాలి.

☆ సమాజంలో విషజ్వరంలా వ్యాపిస్తున్న అశ్లీలం, అసభ్య సంస్కృతి మన కుటుంబాన్ని తాకకుండా, ప్రభావితం చేయకుండా ఉండలేదు. ఈ ధోరణులను గుర్తించాలన్నా, నిరోధించాలన్నా ప్రజలకు కనీస విషయ పరిజ్ఞానం, అక్షరాస్యత అవసరం.

☆ మన దేశాభివృద్ధిలో కీలక పాత్రలో పోషిస్తున్న వాళ్ళంతా సాంకేతిక నైపుణ్యంతో ఉత్పత్తిలో పాల్గొంటున్న వాళ్ళుగా ఉండేవారు తక్కువ శాతం. అంటే 100 కి 30 మంది అక్షరాస్యులే మొత్తం సమాజం యొక్క బరువును 70% నిరక్షరాస్యుల బరువును మోయలంటే మోయడం సాధ్యం కాదు. ఆ బరువు తగ్గించుకోకపోతే మన ఉనికే ప్రశ్నార్థకంగా తయారవుతుంది.

☆ సమాజంలో ఉండే అనేక ప్రగతి నిరోధక భావాలు ఆచరణలో అరికట్టాలంటే ఎక్కువ మంది ప్రజలకు అభ్యుదయ భావాలు అందించాలి. కాని మెజారిటీ ప్రజలు మతాచారాల, చాంధాస భావాల చట్రంలోనే ఉన్నపుడు ఆ ప్రగతి నిరోధక భావాలే సమాజానికి మంచిగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది. దీనివల్ల ప్రప్రథమంగా నష్టపోయేది మనమే కాబట్టి మన సమస్యలను కేవలం మన కుటుంబ సమస్యలుగాను, వ్యక్తిగత సమస్యలుగాను చూచినంత కాలం వాటిని పరి ష్కరించుకోలేం. దాని వల్ల మరింత సంక్లిష్టతలోకి, అయోమయంలోకి దిగజారి పోతాం.

☆ సమాజంలో తర తరాలు మనిషి అనుభవాల సారంగా, వారసత్వంగా వస్తున్న సాంప్రదాయక శాస్త్ర పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యం, గ్రామీణుల నుంచే మనం నేర్చుకొనగలం. గ్రామాభివృద్ధికి ఇది కీలకం.

☆ ప్రజల అనుభవాలను, మన అనుభవాలను జతచేయకుండా, పరస్పరం యిచ్చిపుచ్చుకోకుండా ఎవరు అడుగు ముందుకు వేయలేరు.

అందుకే మనం గ్రామాలను మనం అభివృద్ధి పరుచుకోవాలి. గ్రామాల వారితో భాగస్వాములవ్వాలి.

- సిఎంపి

# పర్యావరణం – ప్రజారోగ్యం ఆవశ్యకత

**పర్యావరణం మానవ మనుగడకు మూల కారణం. మానవాభి వృద్ధిలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. పర్యావరణవణంలో సమతుల్యంగా ఉన్న సమాజాలే మానవ ఆరోగ్యంలో అగ్రస్థానంలో ఉంటాయి. నేడు అనేక సమాజాలు అభివృద్ధి పేరుతో పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. దీని కారణంగా మనం అనేక రుగ్మతలను ఎదుర్కొంటున్నాం. దీనితో అన్ని దేశాలు ఆత్మ పరిశోధనలో పడ్డాయి.**

### నీరు

నీరు అత్యంత ముఖ్యమైన సహజవనరు. నీరు లేకుండా మనం బతకలేం. మనమే కాదు జంతువులు, వృక్షాలు సహితం బతకలేవు. మన ప్రాచీన నాగరికతలను చూస్తే అవి అన్ని కూడా నీరు లభ్యమయ్యే నది తీరాల వెంట వెలసినవే. మెసపటోమియ నాగరికత నైలు నది తీర ప్రాంతల్లో వెల్లివిరిశాయి. నేటి ఆధునిక ప్రపంచంలో అనేక పెద్ద నగరాలు నదుల వెంట వెలసినవే కనిపిస్తాయి. కనుక నీరే జీవనాధారం అని చెప్పవచ్చు.



| నీరు లభించే ప్రాంతం | శాతం |
|---|---|
| మహాసముద్రాలు | 97శాతం |
| నదులు, సరస్సులు, కొలనులు | 1 శాతం |

మొత్తం నీరు లభ్యతలో మన అవసరాలకు పనికి వచ్చేది కేవలం ఒక శాతం మాత్రమే. ఈ తక్కువ పరిమాణంలోని నీరునే త్రాగడానికి, వ్యవసాయానికి, ఇంకా మిగతా అవసరాలకి వాడుకోవాలి. కనుక దీన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం మన అందరి బాధ్యత. పర్యావరణంలో వచ్చిన మార్పులు వల్లనే హరప్పా నాగరికత అంతరించిందనేది చరిత్ర పరిశోధనల్లో తెలిసిన సత్యం. నేడు మన నీటిని అనేక పద్ధతుల్లో కలుషితం చేస్తున్నాం. నీరు ఏ విధంగా కలుషితం అవుతుందో చూద్దాం.

- ⭑ మనం రోజు ఇంటి అవసరాల కోసం వాడి వదిలిన నీటిలో ఎక్కువగా జీవ సంబంధ వ్యర్థ పదార్థాలుంటాయి.
- ⭑ పరిశ్రమల నుండి వచ్చే వ్యర్థ నీటిలో ఆమ్లాలు, క్షారాలు, లవణాలు విష రసాయనాలు, నూనెలు కొన్ని పరిశ్రమల నుండి హానికర బాక్టీరియాలు విడుదలవుతున్నాయి. గనుల నుండి వచ్చే నీళ్లలో ఎక్కువగా ఆమ్లాలుంటాయి.
- ⭑ పంట పొలాల్లోంచి వచ్చే నీళ్లలో కుళ్లిన మొక్కల భాగాలు, పురుగు మందులు, ఎరువులు, రసాయనాలు, పంటపొల్లాల్లోంచి వర్షం. నీళ్లలో కొట్టుకువచ్చే బురద మట్టి, అసేంద్రియా రసాయనాలు ఉంటాయి.
- ⭑ చెరువులలో బట్టలు ఉతకడం, ట్రాక్టర్‌లు, పశువులను కడగడం వల్ల నీరు కలుషితమౌతుంది.
- ⭑ మనం భూగర్భజలాలను అధికంగా వాడడం వల్ల భూమిలోని నీటి మట్టం తగ్గి విష రసాయనాలు కలిగిన నీరు లభిస్తుంది.

ఈ కలుషిత నీరు త్రాగడం వల్ల వచ్చే వ్యాధులతో ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా నాలుగువేల మందికి పైగా మరణిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సంభవించే మరణాల్లో 98 శాతం కలుషిత నీటి వల్లనే జరుగుతున్నాయి.

### కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులు

*సూక్ష్మక్రిములు వల్ల వచ్చే వ్యాధులు:* ఇందులో వైరస్ వల్ల చిన్నపిల్లల్లో హెపటైటిస్ 1ఎ, హెపటైటిస్-బి, పోలియో, డయేరియా, బాక్టీరియాల వల్ల టైఫాయిడ్, పాథా టైఫాయిడ్, బాసిల్లరీ డిసేంట్రీ, ఇ -కోలి ద్వారా వచ్చే డయేరియా, కలరా, ప్రోటోజోవాల వల్ల అమీబియాసిస్, జియార్డిసిస్, హెల్మెంథ్ పురుగుల వల్ల రౌండ్ వార్మ్, టెప్‌వార్మ్ మొదలైనవి ఉన్నాయి.

*రసాయనాల వల్ల వచ్చే వ్యాధులు :* మనం తిరిగే నీళ్లలో, చేరే పరిశ్రమల వ్యర్థాలు, పంట పొలాల్లో వాడిన రసాయన ఎరువులు మొదలైన రసాయన విషాలు నీళ్లలోకి చేరుతున్నాయి. వీటివల్ల చర్మవ్యాధులు వస్తాయి. నీటిలో నైట్రేట్ ఎక్కువ చేరితే మొథనోగ్లోబి నోమియా అనే వ్యాధి వస్తుంది. ఇదే చిన్న పిల్లల్లో అయితే రక్తాన్ని నాశనం చేస్తాయి. ఒక లీటర్ నీటిలో 1 పిపిఎం మిల్లీ గ్రాములక ంటే ఎక్కువ ఫ్లోరైడ్ చేరితే ఫ్లోరోసిస్ వస్తుంది. దీనివల్ల ఎముకలు మెత్తబడి, దంతాలలో పగుళ్ళు వస్తాయి. దంతాలపై ఎనామిల్ పొర దెబ్బతింటుంది.

### నీటి సంరక్షణ

- ⭑ నీటిని రక్షించడం కోసం 2005 నుండి ప్రతి సంవత్సరం మార్చి 22ను ప్రపంచ జలదినోత్సవంగా జరుపుకుంటున్నాం. 2005 నుండి 2015 వరకు అంతర్జాతీయ జల దశాబ్దంగా గుర్తించారు.
- ⭑ మంచినీటిలో మురుగునీరు కలవకుండా చేసి ఆ మురుగునీరు మొక్కలకు అందించాలి.
- ⭑ వర్షం నీటిని వృధాగా పోనీయకుండా భూమిలోకి ఇంకేవిధంగా ఏర్పాటు చేయాలి.
- ⭑ లభించే నీటిని అభిలషణీయంగా ఉపయోగించాలి.
- ⭑ నీటిని సక్రమంగా ఉపయోగించే పద్ధతులు, దాని సంరక్షణ కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలి.
- ⭑ కలుషితమైన నీటిని శుద్ధి కేంద్రాల ద్వారా శుభ్రపరచాలి.
- ⭑ సకాలంలో వర్షం కురవడానికి దోహదం చేసే అడవులను పెంచడం, ఉన్న వాటిని సంరక్షించడం. ఇందులో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సాహించాలి.

## గాలి కాలుష్యం

- ★ పెట్రోలియం, కెమికల్స్‌ను తయారు చేసే పరిశ్రమల నుంచి సల్ఫర్, నైట్రోజన్, కార్బన్ మోనాక్సైడ్ వాయువులు, సిమెంట్ పరిశ్రమల నుంచి దుమ్ము, ధూళి కణాలు గాల్లోకి చేరుతాయి. రసాయన పరిశ్రమలు, పేపరు మిల్లులు, చక్కెర పరిశ్రమలు విడుదలు చేసే పొగలు ఎక్కువ వాసనని గాలి కాలుష్యాన్ని కలిగిస్తున్నాయి.
- ★ వాహనాలు ఫ్యాక్టరీల కంటే ఎక్కువ కాలుష్యాన్ని పుట్టిస్తున్నాయి. 60 శాతం గాలి కాలుష్యం మన వాహనాల నుంచే పుడుతోంది. పెట్రోల్, డీజిల్ పూర్తిగా మండకపోవడం వల్ల హైడ్రోకార్బన్‌లు, కార్బన్ మెనాక్సైడ్‌లు నైట్రోజన్ ఆక్సైడ్‌లు, లెడ్ ఆక్సైడ్‌లు గాలిలో చేరి ఆస్తమా, కంటి జబ్బులు, నాడీ సంబంధ చర్మవ్యాధుల్ని కలిగిస్తున్నాయి.
- ★ బొగ్గు నుండి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే థర్మల్ పవర్ స్టేషన్‌లోంచి ఘన వ్యర్థాలు, బూడిద, సల్ఫర్, హైడ్రోజన్ ఆక్సైడ్‌లు, కార్బన్ మోనాక్సైడ్‌లు వెలువడుతున్నాయి.
- ★ వాతావరణంలో చేరే విష వాయువులు మన ఆరోగ్యానికి నష్టం తెచ్చి రకరకాల జబ్బుల్ని కలిగించడమే కాకుండా, మొక్కల పెరుగుదలని తగ్గిస్తున్నాయి. ఆకుపచ్చని ఆకుల్లో ఉండే పత్రహరితాన్ని తినేస్తున్నాయి. కణాలు పెరిగే శక్తిని తగ్గించి మొక్కల పెరుగుదలని ఆపేస్తున్నాయి. ఆకుల పైభాగంలో దుమ్ము, ధూళి చేరి పత్ర రంధ్రాల్ని మూసేస్తున్నాయి.

| గాలి కాలుష్య కారకం | ప్రభావం |
|---|---|
| నైట్రోజన్ ఆక్సైడ్‌లు | శ్వాసకోశ ఇబ్బందులు, ఊపిరితిత్తులు పాడైపోవడం |
| హైడ్రోకార్బన్లు | ఊపిరితిత్తుల క్యాన్సర్ |
| సల్ఫర్ డై ఆక్సైడ్ | ఆస్తమా, శ్వాసనాళంలో మ్యూకస్ పొర దెబ్బతినడం, ఎక్కువగా పీలిస్తే మరణించడం |
| లెడ్ (సీసం) | పిల్లల్లో ఆలోచనాశక్తి తగ్గిపోవడం |
| | గాలి కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులు. |

***గాలి కాలుష్యాన్ని తగ్గించే చర్యలు***

- ★ మన వాహనాలని ఎప్పటికప్పుడు బాగుచేయించుకోవాలి.
- ★ పరిశ్రమల్లోంచి వచ్చే పొగల్ని ఫిల్టర్ చేసి ఎక్కువ ఎత్తులో బయటికి వదలాలి.
- ★ శుభ్రమైన డీజిల్, పెట్రోల్‌నే వాహనాల్లో వాడాలి.
- ★ రోడ్ల వెంట, ఇళ్లు, కాలి బాటల్లో పెరట్లో మొక్కల్ని పెంచాలి. పట్టణాల్లో ఇంటిపై భాగంలో చిన్న జాతి మొక్కలను, కూరగాయల మొక్కల్ని పెంచేలా అవగాహన కల్పించాలి.
- ★ నిబంధనలు పాటించని పరిశ్రమలను వెంటనే మూసివేయాలి. కాలం చెల్లిన వాహనాల్ని తిరగకుండా చూడాలి.

## నేల కాలుష్యం

మనకు ఉన్న నేల చాలా తక్కువ. ఈ భూమి మీద ఉండే అన్ని జీవులు చేసే ప్రతి పనిలోంచి కొంత వ్యర్థాల్ని పుట్టిస్తాయి. రోజూ మనం పుట్టించే మురికినీళ్ళు, చెత్తచెదారం మన నేలని నాశనం చేస్తున్నాయి. నేల మీదకి టన్నుల కొద్దీ చేరే చెత్త నేలలో ఉండే నీళ్ళని తేమని నాశనం చేయడమేగాక మంచి పంటల్ని పండించగలిగే బాక్టీరియాల్ని, వానపాముల్ని రకరకాల పురుగుల్ని చంపేస్తోంది. ఇలా నేలలోకి చేరిన రకరకాల చెత్తా చెదరాలు నీళ్లలో కలిసి మనకి కొత్త కొత్త రోగాల్ని కలిగిస్తున్నాయి.

- ★ పెరుగుతున్న పరిశ్రమలు ఇష్టం వచ్చినట్లు పుట్టిస్తున్న కెమికల్ చెత్తని శుద్ధి చేయడం మానేసి ఎక్కడ ఒకచోట పడేయడంతో ఆ చుట్టుపక్కలున్న నేల, నీళ్ళు పూర్తిగా భారలోహాలమయం అవుతున్నాయి. కాడ్మియం, సీసం, రాగి, ఆర్సానిక్, నికెల్ లాంటి లోహాల్ని నేలలోకి ఆవరణ వ్యవస్థలోని ఆహారపు గొలుసులోకి చేర్చి జంతువులు, మొక్కలకి రోగాల్ని కలిగిస్తున్నాయి.
- ★ మారిన వ్యవసాయ పద్ధతులు వ్యవసాయంలో వాడుతున్న మందులు, పంటలు పండించడంలోంచి కూడా రకరకాల వ్యర్థాన్ని పుట్టిస్తున్నాయి. పంటల్లో వాడే రకరకాల పురుగుమందుల అవశేషాలు పంటల్లోకి తిండి గింజల్లోకి నేలలోకి నీళ్లల్లోకి చేరి నాశనం చేస్తున్నాయి.
- ★ ఇళ్లలోంచి వస్తున్న చెత్త రోడ్లని ఆటస్థలాన్ని, ఖాళీ స్థలాన్ని ముంచేస్తుంది. ఇలా నేల రూపు పాడవడమేగాక, నేల సహజ స్వభావాన్ని మార్చేస్తుంది.


### నేల కాలుష్యంవల్ల కలిగే అనర్థాలు

- ★ నేలలోకి చేరే రకరకాల చెత్త నేలల్లోకి, నేల నుండి నీళ్లలోకి చేరి విరేచనాలు, వాంతులు, కలరా, టైఫాయిడ్ వంటి జ్వరాల్ని కలిగిస్తాయి.
- ★ మనం పంటపపొలాల్లో వాడే పాస్పేట్ ఎరువుల నుంచి పుట్టే కాడ్మియం పంటపొలాల గడ్డి నుండి ఆహారపు గొలుసు ద్వారా ఆవులు, గేదేలు కడుపుల్లోకి చేరుతుంది.
- ★ పంట పొలాల్లో వాడే రసాయన ఎరువులు, పురుగుమందుల చెత్త వల్ల నేలలో ఉండే వానపాములు మనకి ఉపయోగపడే మంచి బాక్టీరియాలు చచ్చిపోయి నేల నిస్సారమైపోతుంది. తద్వారా పంట పండే శక్తి నేలకు తగ్గి తిండి గింజల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.
- ★ గనుల త్రవ్వకం కోసం నేలను ఇష్టం వచ్చినట్లు తవ్వడం వల్ల పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి భూకంపాల లాంటి పెనువిపత్తులు సంభవిస్తాయి.
- ★ అధికమౌతున్న జనాభా అవసరాల కోసం నేల మీద పెద్ద పెద్ద భవంతుల నిర్మాణం వల్ల భూమి మీద భారం పెరుగుతున్నది.
- ★ వ్యవసాయ విస్తరణకు, కలపకోసం అడవులను నాశనం చేయడం వల్ల వర్షాలకు నేలకోలతలకు గురౌతుంది.

### నేల కాలుష్యాన్ని తగ్గించే పద్ధతులు

- ★ చెత్తని తక్కువ పుట్టించాలి. పుట్టే చెత్తని పుట్టేచోటే తడిపొడి చెత్తగా వేరేయాలి.
- ★ తడి చెత్తని ఎరువుగా మార్చాలి. పొడి చెత్తని తిరిగి వాడటానికి పంపించాలి.
- ★ చెత్తని ఎక్కడబడితే అక్కడ వేసే అలవాటు మానుకోవాలి. చెత్త బుట్టల్ని వాడడం అలవాటు చేసుకోవాలి.
- ★ గనుల విచ్చలవిడి తవ్వకం ఆపాలి. వాటిని సక్రమమైన విధానాల ద్వారా మాత్రమే త్రవ్వకాలు జరపాలి.
- ★ అధికమౌతున్న జనాభాని తగ్గించడం ద్వారా భూమిపై వత్తిడిని తగ్గించాలి.
- ★ అడవులను అధికంగా పెంచి పర్యావరణ సమతుల్యత పెరిగేలా చూడాలి. ◆

భారతదేశం గ్రామాలలో నివసిస్తుంది. అందుకు తగిన విధంగా గ్రామాలను అభివృద్ధి చేయాలనే భావన మొదటి సారిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ మొదటి ప్రధాని 1950లోనే గుర్తించారు. ఆయన చదువు కొనే రోజుల్లోనే తన గురువైన హెరాల్డ్ లాస్కీ సోషలిస్టు సిద్ధాంత కర్త ప్రొఫెసర్ ప్రభావం నెహ్రూ మీద ఉంది. ఆ ప్రభావంతోనే భారత దేశంను ప్రణాళిక బద్ధమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించారు నెహ్రూ. ఆ సమయంలోనే నెహ్రూకు గ్రామాల ప్రణాళికలను గూర్చి ఆలోచనతో సరియైన వ్యక్తి కోసం వెదకుతున్న సమయంలో టెక్నికల్ పరిజ్ఞానంతో మన దేశంలో నున్న వెనుకబడిన కమ్యూనిటీలను ముందుకు కొని పొవచ్చుననే భావనతో పని చేస్తున్న ఎస్.కె. డే కనిపించారు. ఆయన అప్పటికే భారత ప్రభుత్వంలో పునరావాస మంత్రిత్వ శాఖలో సాంకేతిక సలహాదారుగా పనిచస్తున్న 'దే'ను ఎంచికొని గ్రామ ప్రణాళికలు, సహకార రంగాల అభివృద్ధికి కృషి చేయవలసిందిగా ఆహ్వానం పంపారు. ప్రధాన మంత్రి తలచుకొంటే జరుగనిది ఏముంది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ



# గ్రామ ప్రణాళికలకు నాంది పలికిన ఎస్.కె.డే పాత్ర

ఎస్.కె.డేను కమ్యూనిటీ అభివృద్ధి మరియు సహకార శాఖల రాజ్యమంత్రిగా తన కేబినెట్‌లోకి తీసకోవడం జరిగింది. ఎస్.కె.డే కి పూర్తి బాధ్యతలను అప్పగించి దేశంలో గ్రామీణాభివృద్ధి ప్రణాళికల ద్వారా నిర్వహించడం స్వయం సమృద్ధికి మారు పేరైన గ్రామీణుల జీవితాలలో నెలకొన్న చీకటిని తొలగించి వెలుగు నింపవలెనని ఆదేశించడం జరిగింది. నెహ్రూ పూర్తి సహకారంతో ఎస్.కె.డే తన దైన శైలిలో గ్రామ ప్రణాళికలను తయారు చేసి వాటిని కమ్యూనిటీ పరంగా అమలు చేసి విజయం సాధించారు. భారత దేశంలోనున్న కమ్యూనిటీలు ప్రత్యేక గుర్తింపుతో పనిచేస్తాయి. కనుక అది గ్రహించిన డే కమ్యూనిటీల క్లస్టర్స్‌గా చేసి ఆక్లస్టర్స్‌ను జోన్‌గా తీసుకొని జిల్లా అభివృద్ధి కార్యక్రమాలను గూర్చి చర్చించి నిర్ణయాలు గైకొనడం జరిగింది. క్రింది స్థాయి నుండి పై వరకు ఉన్నత కులాలకు కూడా అభివృద్ధిని అంద చేయాలి రాజ్యాంగంలోని 40వ సూత్రం ప్రకారం ఆనాడు అధికారులు ప్రణాళిక బద్ధమైన పాలన ప్రవేశపెట్టారు.

ఆ ప్రణాళిక ఆలోచనల నుండే బ్లాక్‌లను సృష్టించారు. అప్పటికీ బ్రిటిషు పాలనలో స్థాపించబడిన స్థానిక స్వపరిపాలన సంస్థలు 1881లో వాటితో పాటు బ్లాక్ డవలప్‌మెంటు అభివృద్ధిని ప్రవేశపెట్టారు. 1952 లోనే ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీల పాలన ప్రారంబమైంది.

1920 నుండి మద్రాసు ప్రసిడెన్సీల లో గ్రామ పంచాయతీలు పని చేస్తున్నాయి. వాటినన్నింటిని సమన్వయం చేసి "కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలను ఎస్.కె.డే ప్రారంభించారు. గ్రామాలలోని అభివృద్ధిని సమన్వయం చేసేందకు "బ్లాక్ స్థాయిలో బ్లాక డవలప్‌మెంట్ అధికారులను నియమించి అభివృద్ధి కార్యక్రమాలను అమలు ప్రారంభించారు. 1956-57లో పంచాయతీపాలనను దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ దేశ వ్యాప్తంగా మూడంచెల పంచాయతీ రాజ్ పద్ధతిని అమలును పరిశీలించి, అమలు చేయటకు ఏర్పాటు చేయబడింది. ఆ కమిటీ లో శ్రీ ఎస్.కె.డే కూడా సభ్యుడు. డే యొక్క ఆగ్రో-ఇండస్ట్రీయల్ అభివృద్ధికి పట్టణా సముదాయలను గ్రామీణా భివృద్ధిలో భాగంగా రూపొందించారు. ఇందులో వ్యవసాయం,

పరిశ్రమల మీద దృష్టిపెట్టి అభివృద్ధి చేయడానికి ఒక మోడల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఒక పట్టణం చుట్టుప్రక్కల నున్న గ్రామాలకు అభివృద్ధి చేసి వస్తు సేవలను సరఫరా చేస్తాయి. ప్రాజెక్టు -1950'' నిలోకేరిలో ప్రవేశపెట్టారు. ఈ ప్రాజెక్టువలన 7000 మంది గృహావసతి లేని పాకీస్థానీ కాందిశీకులకు బాగా ఉపయోగపడింది. ఎస్.కె.డే ఈ మోడల్‌ను "సంక్షేమం రాజ్యం'' గా మార్చబడింది అన్నారు. దీనిని చూసిన నెహ్రూ బాగా ప్రతిస్పందించి ఈ అభివృద్ధి మోడల్ మక్కా ఆఫ్ అభివృద్ధిగా పేర్కొన్నారు. ఇదే మోడల్ లో దేశంలో పలుచోట్ల నిలోఖరి అభివృద్ధి పద్ధతిని ప్రవేశపెట్టడం జరిగింది. కొతకాలం దశాబ్ధకాలం పాటు పని చేసిన నిలోఖరి మోడల్ ప్రాముఖ్యతను కోల్పోగా కనీస అవసరాలైన ఆరోగ్యం, నీరు, విద్యా కూడలేక పథకం విఫలమైంది అని చెప్పవచ్చు.

ఎస్.కె.డే "రభీంద్రనాద్ ఠాగూర్ శాంతిని కేతన్‌లో ప్రవేశపెట్టిన ప్రయోగాత్మక గ్రామీణాభివృద్ధి మోడల్‌తో ప్రభావం అయ్యి గాంధియన్ ఆలోచనలు గ్రామపునాది నిర్మాణం స్వయం సమృద్ధి, పై దృష్టిపెట్టి గ్రామీణులను వృద్ధి చేయుటకు కృషిచేశారు.


డే యొక్క నిలోకేరి మోడల్ ననుసరించి నెహ్రూ డిల్లీ పరిసర ప్రాంతాలలో 1955 లో పాకీస్థాన్, తూర్పు పాకీస్థాన్ ప్రాంతాల నుండి వచ్చిన గృహాలు ఏ వసతీ లేని కాందీశీకులకు లజపతిరాయ్ నగర్, కరోల్‌బాగ్, ప్రాంతాలలో వారికి గృహవసతికల్పించి నెహ్రు తోడ్పడినాడు. ఆ విధంగా కాందిశీకుల పునర్‌నిర్మాణంను నెహ్రూ విజయవంతంగా అమలు చేసి కాశ్మీరు ను ఐక్యర్యాసమితి జనరల్ అసెంబ్లీకి నివేదించగా దానిపై జనరల్ అసెంబ్లీ 'ప్రజాభిప్రాయ సేకరణ జరిపి నిర్ణయం తీసుకోమని ఆదేశించింది. ఇప్పటికి ఆ సమస్య అపరిష్కృతం గనే మిగిలి పోయింది 'డే' యొక్క గ్రామీణాభివృద్ధి మోడల్‌ను "స్వేచ్ఛ వాదం (Liberalism) మార్క్సజమ్ (Marxism) మరియు గాంధీయిజం (Gandhism) లతో కలిసిన గ్రామీణాభివృద్ధిగా పేర్కొన్నారు. ఇందులో పౌరునికి వ్యక్తి హక్కులు, విధులు అమలును మార్క్సిజం నుండి తీసుకొన్నారు. అదే విధంగా చిన్న పరిశ్రమలు, గృహ పరిశ్రమలు, గ్రామీణ పరిశ్రమలు ఏర్పాటు గాంధీ యిజం నుండి తీసుకొని అన్నింటిని కలయికచేసి మన గ్రామీణాభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాలను రూపొందించారు. వీటిని గ్రహించి అమలు చేసే పరిజ్ఞానం గ్రామాలలో ఆనాటికి లేదు. ఆనాటికి, నేటికి పెత్తం దారీతనం, భూస్వామ్య ఆధిపత్యం, శ్రామికలుకు స్వేచ్ఛ కల్పించలేదు. వారి శ్రమకు తగిన ఫలంను అమలు చేయడం జరగలేదు. కాని గ్రామాభివృద్ధికి వ్యక్తుల అభివృద్ధికి తోడ్పాటును అందించింది.

పంచాయతీరాజ్ వ్యవస్థను మెరుగు చేయుటకు 1957 లో బల్వంతరాయ్ మెహతాకమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వం అందులో ఎన్.కె.డే సభ్యుడు. కమ్యూనిటీ డెవలెప్‌మెంటు కార్యక్రమాలు ఏ విధంగా అమలు జరుగుతున్నాయి. అనే అంశాలు పరిశీలించి నూతన సంస్థలు స్థాపించి, అభివృద్ధి లింకులను ఏర్పరుచుకొని ఆర్థిక పరిస్థితుల మెరుగు పరచుకోవలెను, గ్రామాలలో కమ్యూనిటిల అభివృద్ధిని నిర్ణయించే అంశాలను వేదిక అమలు చేయాలని సూచించారు. బల్వంతరాయ్ మెహతా కమిటీ, కమ్యూనిటీ అభివృద్ధిని క్షుణ్ణంగా పరిశిలించి దానితో గ్రామ ప్రజలను భాగస్వాములను చేస్తే వారికి తగిన అభివృద్ధి పథకాలను అమలు చేయు స్వేచ్ఛ నిచ్చింది. అంటే గ్రామాల ప్రణాళిక, నిర్ణయధికారంలో పంచాయతీలకు కొన్ని బాధ్యతలు ఇచ్చి అమలు చేశారు. అందులోనే జాతీయ పాలనకు లింకుపెట్టుమన్నారు. ఇంతవరకు కొన్ని ప్రాంతాలలో అధికారులను పంచాయతీలకు తరలించలేదు. అయినా బ్లాక్‌లో కమునిటీలను డే అభివృద్ధి కీలక పాత్ర పోషించి ముందుకు నడిపించారు. డే తన గ్రామ పంచాయతీల పాత్రను వివరిస్తూ ఒక పుస్తకం ప్రచురించారు. అదే "పంచాయతీ - రాజ్ సమాన్వయం'' (.....) అనే పేరన ప్రచురించారు. డే పంచాయతీ రాజ్ వ్యవస్థలను ప్రపంచ వ్యవస్థలకు లింకు పెట్టి "వ్యక్తి యొక్క అభివృద్దే దేశాభివృద్ధి - ప్రపంచాభివృద్ధిని'' వివరించారు. డే గ్రామ సభనుద్దేశించి మాట్లాడుతూ గ్రామసభ దేశపార్లమెంటు వలె క్రింది స్థాయిలో పనిచేస్తూ ప్రజాస్వామ్యం విజయవంతం చేస్తుందని వివరించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విజయవంతంకు గ్రామాలలో గ్రామసభ విజయవంతమవుతుందని ఎస్.కే.డే ఆశించారు. అందుకే ఆయన రాష్ట్ర ప్రభుత్వాలను పంచాయతీ రాజ్ వ్యవస్థలను స్థాపించి విజయ వంతం చేయవలెనని కోరారు. 1960 నాటికి అన్నిరాష్ట్రాలలో పిఆర్ఐ సంస్థలు స్థాపించబడ్డాయి. 2 లక్షల 17 వేల 300 పంచాయతీలు గ్రామాలలో పని చేయడం మొదలు పెట్టాయి. ఆ విధంగా గ్రామపంచాయతీలకు 'డే' ఎంతో ప్రాముఖ్యతనిచ్చి అమలు చేసి భారత దేశంను విజయపథంలో నడిపించాలని ఆశించారు. ఆయన ఆశించిన ఫలితాలు ఇంత వరకు పూర్తి కానేలేదు. అందుకు దేశంలో భూస్వామ్య వ్యవస్థ ముఖ్యకారణం 'డే' ఇతరత్రా సాధించిన విజయాలలో జాతీయ అభివృద్ధి మోడల్ ఏర్పాటు చేయుటకు ఎంతగానో కృషి చేశారు. అదే విధంగా అభివృద్ధి జర్నలిజంను ప్రజల్లోకి పోయేందుకు కురుక్షేత్రం అనే పత్రికను నెల వారిగా తేచ్చేందకు కృషి చేశారు. దేశాభివృద్ధిలో ఎస్.కే.డే భారతదేశ నిర్మాణంలోను, అత్యాత్మిక తత్వంలోను ఉపయోగించి స్వాతంత్రం అనంతరం అభివృద్ధి పథంలో దేశంను నడిపించేందుకు కృషి చేశారు ఆయన చేసిన సేవ గ్రామీణాభివృద్ధికి, పంచాయతీ వ్యవస్థల నిర్మాణం కు ఎంతో గానో ప్రశంసించతగినది. అందుకే గ్రామీణాభివృద్ధి - పంచాయతీలు పేరుతో ఎస్.కె.డే పేరు ముడిపడి ఉంది. ఆయన ఆలోచన విధానాలను గ్రంధస్థ చేయడం ద్వారా అందరికి అందుబాటులో ఉన్నాయి. ఇపుడు తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి కే.సి.ఆర్. డే మోడల్ వలె 'మన గ్రామం - మన ప్రణాళికను అహ్వానించి అన్ని స్థాయిలల్లో అమలు చేయుటకు ప్రయత్నించడంతో మరో సారి ఎస్.కె.డేని తెరమీదకు తెచ్చారు. గ్రామ సభ భావన విజయవంతమైతే ఆ 'డే' సజీవుడు.

**- సి.ఎం.పి.**

# వివిధ పంటలలో నాణ్యమైన విత్తనాన్ని సేకరించడానికి అవలంభించవలసిన మెళుకువలు





**పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఆహారధాన్యాలను ఉత్పత్తి చేయవలసి రావడంతో, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులకు డిమాండు అధికమవుతుంది. ఈ పరిస్థితులలో వ్యవసాయానికి మూలధారమైన నాణ్యమైన విత్తన ఎంపికలో మెళకువల పరిజ్ఞానం రైతులకు ఎంతో అవసరం.**

*నాణ్యమైన విత్తనం అంటే :* పంట విత్తడానికి ఉపయోగించే గింజకాని, దుంపగాని, కాండంగాని, వీటన్నింటిని విత్తనం అంటారు. ఏ పంటలోనైనా ఆయా వంగడాల పూర్తి ఉత్పాదన సామర్థ్యాన్ని పొందాలంటే నాణ్యమైన విత్తనం ద్వారానే సాధ్యపడుతుంది. విత్తనం అధిక బీజోత్పత్తి శక్తి, జన్యుస్వచ్ఛత కలిగి అధిక దిగుబడులను ఇవ్వగల లక్షణాలు కలిగిన విత్తనాన్ని నాణ్యమైన విత్తనంగా పరిగణిస్తాం. అందువల్ల అధిక దిగుబడులకు నాణ్యత గల విత్తనం కీలకమైన పెట్టుబడి. దీనివల్ల పంట దిగుబడి పెరగడమే కాకుండా పైరు పెరుగుదల సమంగా ఉండి కల్తీలు లేకుండా గింజ నాణ్యత కలిగి దిగుబడులకు అధిక ధర పలుకుతుంది.

*నాణ్యమైన విత్తనం యొక్క లక్షణాలు :*

- ★ రైతు ఎంచుకున్న రకం సంతతికి మాత్రమే చెంది ఉండి జన్యుస్వచ్ఛత కలిగి ఉండాలి. ఈ రకానికి చెందిన విత్తనం నాటినప్పుడు 100 శాతం వి త్తనం పొందాడాన్ని జన్యుస్వచ్ఛత అంటారు.
- ★ విత్తనం అధిక భౌతిక స్వచ్ఛత కలిగి ఉండాలి. విత్తనానికి ఉండాల్సిన రంగు ఉండాలి. తాలు సగం నిండిన గింజలు ఉండకూడదు. మట్టిపెడ్డలు, ఇసుక, దుమ్ము మొదలైన జడపదార్థాలు ఉండకూడదు. కలుపు విత్తనాలు, వేరే విత్తనాలు ఉండకూడదు.
- ★ విత్తనం సురక్షితమైన ప్యాకింగ్ మరియు వివరాలను ముద్రించిన లేబుల్ కలిగి ఉండాలి.
- ★ విత్తనం అధిక మొలకశాతం కలిగి ఉండాలి.



*వివిధ పంటలలో ఉండవలసిన మొలకశాతం:* వరి- 80, గోధుమ - 85, జొన్న -75, మొక్కజొన్న-సూటిరకాలు-80, సంకర రకాలు-90, సజ్జ, కొర్ర -75, అపరాలు, కంది, పెసర, మినుము -75, శనగ -85, నూనె గింజలు, సోయాచిక్కుడు, ఆముదం, వేరుశెనగ, ప్రొద్దు తిరుగు -70, నువ్వులు -80, పత్తి, గోగు - 75, జనుము-80, కూరగాయలు -60-70

*మొలకశాతాన్ని నిర్ధారించే పద్ధతులు :*

★ ట్రే పద్ధతి (Tray method) ★ గుడ్డతో మూటకట్టే పద్ధతి

★ పెట్రిడిష్ పద్ధతి (petredish) ★ పేపరు టవల్ పద్ధతి (paper method)

★ వాక్ ఇన్ జర్మినేటరం (walk in germinator)

**ట్రే పద్ధతి :** ఒక ట్రేగాని ఇసుకతో నింపి వంద విత్తనాలను నిర్ణీత లోతులో విత్తి అనుకూలమైన వాతావరణంలో ఉంచాలి. ఇసుకను నీటితో తడుపుతూ ఉంటే 8-12 రోజుల్లో మొలకలు వస్తాయి. వందకు ఎన్ని మొలకలు వచ్చినవో లెక్కించి మొలకశాతాన్ని తెలుసుకోవచ్చు.

**గుడ్డతో మూటకట్టే పద్ధతి :** వంద విత్తనాలను తడిగుడ్డలో మూటగట్టి పెట్టి తరుచూ మూటను నీటితో తడుపుతూ ఉండాలి, మొలకలొచ్చాక లెక్కించి మొలకశాతాన్ని తెలుపుకోవచ్చు.

**పెట్రి టిష్ పద్ధతి :** వంగ, టమోటా, మిరప వంటి చిన్న విత్తనాల మొలక శాతాన్ని ఈ పద్ధతి ద్వారా తెలుసుకోవచ్చును.

పెట్రి టిష్‌లో బ్లాటింగ్ పేపరు అమర్చి నీటితో తడపాలి. దానిపైన వంద విత్తనాలను అమర్చి మూత పెట్టాలి. తేమను ఆరిపోకుండా బ్లాటింగ్ ఆరిపోకుండా బ్లాటింగ్ పేపరును నీటితో తడుపుతుండాలి.

**పేపరు టవలు పద్ధతి :** ప్రత్తి, ప్రొద్దుతిరుగుడు, మినుములు, పెసలు తదితర విత్తనాల్లో మొలకశాతాన్ని నిర్ధారించడానికి ఈ పద్ధతి అనుకూలంగా ఉంటుంది. ముందుగా పేపరు టవలు తీసుకొని దానిని మ్యాంకోజబ్ ద్రావణంలో ముంచి తడపాలి. దీనిని బండపై పరచి వంత విత్తనాలను వరస క్రమంలో ఉంచాలి. విత్తనాలపై మరో టవలుగాని, వస్త్రాన్ని గాని కప్పాలి. ఈ రెండింటిని కలిపి చాపలా చుట్టి చివర రబ్బరుతో కట్టాలి.

విత్తనంలో తేమ శాతం తగినంత మాత్రమే ఉండాలి. 13 శాతం తేమ ఉన్నప్పుడు విత్తనం బాగా మొలకెత్తుతుంది.14 శాతానికి మించి ఉండే నిల్వ చేయడాన్ని పనికిరాదు

విత్తానాలపైనగాని, లోపలగానీ ఎటువంటి చీడపీడల అవశేషాలు, శిలీంధ్ర బీజాలు, గుడ్లు రోగకారక క్రిములుగానీ ఉండకూడదు. విత్తనం ద్వారా వివిధరకాలైన ఎండుతెగుళ్ళు, బాక్టీరియా తెగుళ్ళు మొక్కలకు

సంక్రమిస్తాయి. తెగుళ్ళు, శిలీంధ్రాలు, మొక్కలు మొలకెత్తినప్పుడు ఇవి కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దీనితో మొలకశాతం బాగా తగ్గి, పంట సాంద్రత తగ్గడమే కాకుండా దిగుబడిపై అధిక ప్రభావం చూపటంతో నాణ్యత కూడా దెబ్బతింటుంది. కాబట్టి పైరు మొక్క తొలిదశలో చీడపీడలను ఆశించకుండా ఉండేందుకు విత్తనశుద్ధి ప్రక్రియ తోడ్పడుతుంది.

సాధారణంగా విత్తనశుద్ధి వివిధద పద్ధతులలో చేస్తారు

**తడి విత్తన శుద్ధి** : ఒక కిలో విత్తనానికి సూచించిన మోతాదులో మందుని ఒక లీటరు నీటిలో కలిపి విత్తనాలను నానబెట్టాలి. తరువాత విత్తుకోవచ్చు.

**పొడి విత్తన శుద్ధి** : సూచించిన మోతాదు పొడి మందు తీసుకొని ట్రేలోగాని, కుండల్లోగాని, పాలిథీన్ సంచులలో కాని విత్తనాలకు బాగా కలిపి పట్టించాలి. విత్తన శుద్ధి డ్రమ్ము పరికరంలో విత్తనాలను సూచించిన మోతాదులో మందు కలిపి బాగా కలియ తిప్పి విత్తుకోవచ్చు. పొడి మందుతో విత్తన శుద్ధి చేసినపుడు ముందుగా విత్తనానికి కొద్దిగా గంజ ద్రావణం లేదా జిగురు లాంటి పదార్థాన్ని పట్టించినట్లయితే మందు విత్తనానికి బాగా అతుక్కుంటుంది.

లెగ్యూమే జాతి పంటలకు విత్తనాన్ని శిలీంధ్రానాశినితో విత్తనశుద్ధి చేసిన తరువాత రైజోబియం కల్చర్‌తో పట్టించడం ద్వారా దీనిలోని బ్యాక్టీరియా వేరుపైన ఉండే బుడిపెలలో నివసిస్తూ గాలిలోని నత్రజనిని నేలలో స్థిరీకరించి పంటకు మేలు చేస్తుంది.

| పైరు | వాడాల్సిన రసాయనం మోతాదు | | పద్ధతి |
|---|---|---|---|
| వరి | కార్బండిజమ్ | 3గ్రా కార్బండిజమ్/ కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| | కార్బండిజమ్ | 1గ్రా కార్బండిజమ్/ లీటర్ నీళ్ళు | తడిపద్ధతి |
| మొక్కజొన్న | మ్యాంకోజెబ్ | 3గ్రా మ్యాంకోజెబ్/ కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| జొన్న | థైరమ్/కాప్టాన్ | 3గ్రా థైరమ్/ కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| సజ్జ | థైరమ్/కాప్టాన్ | 3గ్రా/కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| రాగి | కార్బండజమ్ | 3గ్రా/కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| **అపరాలు** | | | |
| పెసర, వినుము | కార్బోసల్ఫాన్ లేదా థయోమిథాక్సల | 30గ్రా/కిలో విత్తానానికి 5గ్రా/కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| కంది | రైజోబియంకల్చర్ | 70గ్రా/300 మిలీనీరు | పొడిపద్ధతి |
| వేరుశనగ | మ్యాంకోజెబ్ | 3గ్రా/కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| ప్రొద్దుతిరుగుడు | కాప్టాన్(లేదా)థైరమ్ | 3గ్రా/కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| ఆముదం | థైరమ్, కార్బండజమ్ | 3గ్రా/కిలో విత్తానానికి | పొడిపద్ధతి |
| ప్రత్తి | గాఢ సల్ఫూరికామ్లం | 100మిలీ/ కిలో విత్తానానికి | |
| | కార్బోసల్ఫాన్ | 40-50గ్రా/కిలో విత్తానానికి | |
| | ఇమిడాక్లోప్రిడ్ | 8గ్రా/ కిలో విత్తానానికి | |



*విత్తన సేకరణలో మెళుకువలు :*

- ★ విత్తనాలను కొనేముందు కొనవలసిన రకం మన ప్రాంతానికి, సీజనుకి అనుకూలమో కాదా అనే విషయాన్ని నిర్ధారణ చేసుకోవాలి
- ★ వ్యవసాయ శాఖ వారి అనుమతి పొందిన వాటినే కొనుగోలు చేయడం మంచిది.
- ★ ఏ పంటలో అయినా రైతులు ఒక రకం మీద మోజు పెంచుకోకుండా వారి ప్రాంతానికి, వారి అనుభవ ప్రకారం విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలి.
- ★ రైతు విత్తనాలను లైసెన్స్ వున్న డీలర్ వద్దనే కొనుగోలు చేయాలి. దానికి సరిపడా ఒరిజినల్ బిల్లును తీసుకొని తమ వద్ద పంట పూర్తయే వరకు భద్రంగా ఉంచుకోవాలి మరియు ఖాళీ విత్తన ప్యాకెట్లను, సంచులను భద్రపరచి వుంచాలి.
- ★ ప్రైవేటు కంపెనీలు తయారుచేసిన విత్తనం కొనేముందు ఆయా రకాలను వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు కానీ, వ్యవసాయ శాఖవారు గానీ సాగు చేశారో (లేక) ఆ ప్రాంతరైతులే సాగుచేసి ధృవీకరించారా అన్న అంశాన్ని పరిగణలోనికి తీసుకోవాలి.
- ★ నాణ్యమైన విత్తనం దశల వారీగా ఉత్పత్తి చేస్తారు. విడుదల అయిన రకాల విత్తనోత్పత్తికి అవసరమైన బ్రీడరు విత్తనం, వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు కానీ, ప్రభుత్వ రంగ సంస్థ కానీ విత్తనోత్పత్తి సంస్థలకు అందచేస్తారు. ఆ సంస్థలు బ్రీడరు విత్తనాన్ని ఫౌండేషన్ విత్తనంగానూ తరువాత ధృవీకరణ విత్తనంగానూ మార్చి రైతులకు అందుబాటులోకి తెస్తారు.
- ★ పంటలో రకాన్ని వాడాల్లో రైతులు ముందుగా నిర్ణయించుకొని వీల యినంత వరకూ నీలిరంగు లేబుల్ ధృవీకరణ విత్తానాన్ని కొనాలి.
- ★ విత్తానం నాటేముందు నమూనాలో మొలకశాతం పరీక్షించి సంతృప్తికరంగా ఉన్నట్లయితే ముందుకు పోవాలి.

*- ఎన్. నాగలక్ష్మి, యం. సుధారాణి,*
*యం. మాధవి, ఎన్.వి. నాయుడు,*
*విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్*

# గ్రామీణ జీవితంలో జానపద కళారూపాలు

**కళలు వేరు - కళారూపాలు వేరు అనేందుకు వీలులేదు. ఎందుకంటే అవి అవినాభావ సంబంధులు. 'క్లాడ్ బెర్నార్డ్' మహాశయుడు చెప్పిన దాన్ని బట్టి కళ వ్యక్తిగతం, విజ్ఞానం సమిష్టిగతం. కళలకు ఆంధ్రదేశం పుట్టినిల్లు. అందునా జానపద కళారూపాలకు కాణాచిగా పేరుపొందినది.**

**తెలుగు నేల నాలుగు చెరగులవున్న కళారూపాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేవన్నది సత్యదూరం కాదు. గ్రామాలలో పుట్టి అక్కడ నివశించే ప్రజల నిత్యజీవన ప్రస్థానంలో అంతర్భాగంగా మమేకమైపోయాయి ఈ కళలు. జనపదం అనగానే జనులు నివశించే పల్లెటూరు. దీనినే గ్రామం అనీ చెబుతారు.**

తరతరాలుగా పాడుకునే పాటలను జానపదగేయాలని, వాటిని జీవనాధారంగా ప్రదర్శిస్తు గ్రామ గ్రామానికి సంచరించే కళారూపాల తాలూకు వ్యక్తులను జానపద కళాకారులని వ్యవహిస్తారు.

### యక్షగానం

ఇది మిక్కిలి ప్రాచీనమైన కళారూపంగా పెద్దలు పేర్కొన్నారు. జక్కు శబ్దం- యక్షుగా మారి జక్కుల వారు ప్రదర్శించే ప్రబంధానికి 'యక్షగానం' అనే పేరు కాలానుగుణ్యంగా ఏర్పడింది. ఇవి ఎక్కువగా ఒకనాటి కాకతీయ సామ్రాజ్యంలో, విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజుల కాలంలో బాగా ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నాయి.

తంజావూరు (నేడిది తమిళనాడులో ఉంది) సరస్వతీ మహల్‌లో సుమారు 400 యక్షగానాల తాళపత్ర (తాటాకు) పత్రులు నేటికీ ఉండటం విశేషం. దక్షిణాదిలో యక్షగానాలు ఎక్కువగా వర్ధిల్లినట్లు పాల్కురికి సోమనాథ కవి తన 'పండితారాధ్య చరిత్ర' లో పేర్కొన్నాడు. కూచిపూడి సిద్ధేంద్ర యోగి, భాగవతుల దశ రథరామయ్య, లేపాక్షి, వేమనపల్లి, తాడిపత్రి, మేళాలు యక్షగానానికి చెప్పుకోదగినటువంటి ప్రచారం చేయడం విశేషం.



### కురవంజీ

ముఖ్యంగా తెలుగు వారు కళారంగంలో అడుగులు వెయ్యడం ప్రారంభించినది ఈ 'కురవంజ' కళారూపంతోనే. కురవలు వేస్తున్న అడుగు అయినందు వల్ల దీనిని కురవంజి అని పిలుస్తూ రావడం జరిగింది. అయితే అరణ్యాలలో నివశించే చెంచులు, కోయవారు, కురవలు మొదలైన జాతి జనులు ఎక్కువగా ఈ 'కురవంజి' ప్రదర్శిస్తుండేవారు. మీదు మిక్కిలి వీరు ఆనాళ్లలో తిరుపతి, శ్రీశైలం, భద్రాచలం, సింహాచలం వంటి పుణ్యక్షేత్రాలలో తీర్థ యాత్రికుల వేడుక కోసం పురాణాలు, పుణ్యక్షేత్ర మహాత్మ్యాలు ప్రదర్శించడం చేస్తుండేవారు.

### వీధినాటకాలు

ఈ వీధినాటకాలనే 'బయలాట' అని కూడా పిలవడం కద్దు. వీటిని ఇంగ్లీషులో 'స్ట్రీట్ ప్లేస్' అంటారు. ఇది సంగీత, నృత్యాలతో కూడిన రూపకం. యక్షగానానికి రూపాంతరమైనట్టి వీధినాటకానికి సూత్రధారుడే (దర్శకుడు) ఆయా పట్టులాంటి వాడు. దీనిలోగల పాత్రలన్నీ తమను తామే పరిచయం గావించుకుంటూ రంగప్రవేశం చేస్తుంటాయి.

పదునారవ శతాబ్దిలో మొదలైన వీధినాటకాలను యక్షగాన నాటకం, వీధి భాగవతం అంటూ ఉండేవారు. ఈ వీధినాటకాల్ని అధికంగా ప్రచారంలోకి తెచ్చింది కూచిపూడి భాగవతులే. అసలిది మతప్రచారానికి అనువైనది. కళారూపంగా వెలుగులోకి వచ్చింది. శిర్నాడ వెంకట్రాయ కవి లేఖిని నుండి వెలువడ్డ 'లేపాక్షి కృష్ణ నాటకం' వీటిలో పేరిన్నిక గన్నది. కాకతీయ ప్రభువుల ఏలుబడి కాలంలో ప్రదర్శితమైన 'క్రీడాభిరామం' కూడా వీధినాటకంగా ప్రసిద్ధిగాంచింది.

### తోలు బొమ్మలాట

దీనిని ఆంగ్లభాషలో 'పాపెట్ - షో' అంటారు. ఇది ఒక విధంగా చూస్తే మనం నేడు చూసే సిన్మాలకు దగ్గరగా అనిపిస్తుంది. కానీ సాంకేతికంగా చాలా తేడా కనిస్తుంది. ఈ బొమ్మలను పారదర్శకమైనట్టి పల్చని తోలుతో రంగుల బొమ్మలను తయారు చేసి తెల్లని తెరవెనుక ఆముదపు దీపాల (నేడు గ్యాస్ లైట్లు) వెలుతురులో బొమ్మలను ఆడిస్తుండేవారు. ఇప్పుడు మానవుడు సాధించిన సాంకేతిక ప్రగతి వల్ల పెట్రోమాక్సు లైట్లు, విద్యుద్దీపాల కాంతితో ఆడుతున్నారు.

ఈ తొలుబొమ్మల కథలికలకు అనుగుణంగా బొమ్మల్ని ఆటాడించే కళాకారులే పాటలు, శ్లోకాలు, పద్యాలు, మాటలు తెరవెనుక నుండి చెప్పడం జరుగుతుంది. భారతదేశంలో అత్యధికంగా తొలు బొమ్మలాటలు ప్రాచుర్యం పొందినమాట వాస్తవం. తలలు కూడా కదిలించగలగడం మన దేశపు తోలుబొమ్మల విశిష్ట లక్షణమని చెప్పవచ్చు.

పౌరాణిక (రామాయణ, భారత, భాగవతం వంటివి),



హాస్య పూరితమైన కథాంశాలతో వర్తమాన కాలంలో సామాజిక సంక్షేమానికి పనికి వచ్చే అంశాలను చొప్పించి, ప్రదర్శిస్తూ ఉండడం దీనితో సాధించిన మరో ప్రయోజనం. బంగారక్క, కేతిగాడు వంటి ప్రత్యేక హాస్య పాత్రల్ని సృష్టించి ఈ కళారూపాన్ని రక్తికట్టించగలగడం దీనిలో ఒక ప్రత్యేకతగా మనం చెప్పుకోవాలి.

## జంగం కథ

ఆంధ్రప్రదేశ్‌లో జంగాలు అనే పేరుతో ఒక జాతిని పేర్కొనడం, మనం చూస్తున్నాం! వారు చెప్పిన కథల్నే జంగం కథలుగా పరిగణలోనికి తీసుకుని ఉండొచ్చు. ఆ జాతికి అది ఒక ఉపాధి కల్పించే వృత్తిగా వారు చేసుకొని ఉండి ఉంటారు. కథాపరంగా దీని గురించి పరిశీలిద్ధాం.

ఒకప్పుడు దేశభక్తి, మతప్రచారాల నిమిత్తం ఎంతగానో తోడ్పడినా, ఈ జంగం కథ నేడు ఆయా కళాకారుల జీవన భృతికి మాత్రమే పనికి వస్తున్నాయని చెప్పుకోవాలి. నేటి బుర్ర కథకు పూర్వరూపమే ఈ జంగం దేవర కథలు. వీటినే తందాన తాన కథలనీ, తంబుర కథలనీ, మారతి కథలనీ, డక్కుకథలనీ, బుర్ర కథలనీ పేర్కొనడం జరుగుతున్నది.

## పగటివేషాలు

పగటి పూట దేవుళ్లుగానో, రాక్షసులుగానో, దేవతలుగానో వేసే వేషాల్ని పగటి వేషాలంటారు. ముఖ్యంగా ఏ రూపకమైనా రాత్రి పూట ప్రదర్శిస్తుంటారు. అందుచేత పగలు వేసే వేషాలు గనుక వీటిని పగటి వేషాలనే నామకరణం ఏర్పడి ఉంటుంది.

కానీ నిజానికి వేషాలు పూర్వకాలంలో శత్రు రాజుల గుట్టు తెలుసుకుని వచ్చేటందుకు గుఢాచారులు మారువేషాలలో వెళ్లి శత్రువుల ఆచూకీ తీసుకనేందుకు ఇవి ఉపయోగించేవి. పైన మనం చెప్పుకున్నట్లుగా పగటి వేషగాళ్లు పట్టపగలే వేషాలు ధరించి వీధి వీధి తిరుగుతూ కూడలిలో అంశాల్ని ప్రదర్శించేవారు. అన్నిటికన్న వీరి వేషాల వల్ల ఆ నాటి సంఘంలో నెలకొన్న మూడనమ్మకాలను, దోపిడి దార్లను, లంచగొండులను, ఇంకా పలు అరాచకలను సృష్టించేవారిని హాస్యధోరణిలో వీరు బట్టబయలు చేస్తుండేవారు.

## బుర్ర కథ

ఈ కళారూపంలో కథ చెప్పే కథకుడు కాకుండా వంతలిద్దరు అటు వైపు ఇటువైపు నిలబడి కథకొనసాగుతున్నప్పుడు 'తందానతాన' అంటూ అతనికి వత్తాసి పాడుతుంటారు. తెలుగు గడ్డపై జరిగిన వీరగాథలను ఉద్రేకపూరితంగా చెప్పి ప్రజలను ఉత్రూతలూగించ గల కథకులెందరో 'నాజర్' వంటి కళాకారులుండేవారు. ఇదే వరవడిలో కథకులు విషాద గాథల్నీ చెప్పి ప్రేక్షకుల కళ్లంట నీరు తెప్పించగల సమర్థులు ఇంకెందరో ఉన్నారు.

ఈ నాడు అధిక ప్రాచుర్యాన్ని సంతరించుకున్న కుటుంబనియంత్రణ గురించి, పర్యావరణ, కాలుష్యాలు వంటి పలు అంశాల గురించి, మరుగుదొడ్ల వాడకం గురించి, గ్రామీణ ప్రాయంలో ప్రచారం చేసే దాని్న ఈ బుర్ర కథ ఎంతో గొప్పగా తోడ్పడుతుందనడానికి ఆక్షేపణ లేదు. ఈ కథల్లో పౌరాణిక, జానపద (దేశింగు రాజు, బాలనగమ్మ) చారిత్రాత్మక, సాంఘిక బుర్ర కథలెన్నో జనం మధ్యలోకి వచ్చాయి. కాల క్రమంలో నేటి రాజకీయ ఎన్నికల సమరంలో కూడా అభ్యర్థులు ఓటు వెయ్య వలసిందిగా కర్తవ్యాన్ని ఉపదేశించేందుకూ దీనిని జనంలోకి తీసుకు పోవడం జరుగుతున్నది.

ఈ బుర్ర కథకు జముకుల కథకు పెద్దతేడా అగుపించదు. జముకుల కథలే కూడా కథ చెప్పే కథకుడితో పాటు యిద్దరు వంతలుంటారు. అయితే బుర్ర కథలోని గుమ్మెటాల స్థానంలో దీనిలో 'జముకులు' రావడం తేడా తప్పితే మరో తేడా అగుపించదు. ప్రత్యేకంగా ఈ జముకుల కథలు తెలంగాణా, తూర్పు - పశ్చిమ గోదావరి జిల్లాలలో, విశాఖ, శ్రీకాకుళం జిల్లాలలో ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి. ఈ మాదిరి కథల్లో మిక్కలి ప్రసిద్ధిపొందినది 'కన్యక కథ'. కాకతీయుల కాలంలో కూడా బసవనివారు కాక తమ్మ, బతుకమ్మ, జాడ్డెమ్మ కథలను భక్తి శ్రద్ధలు చెప్పేల్లేటట్లు చెబుతుండేవారని చరిత్ర చెబుతున్నది.



వీటన్నిటితోబాటు నేడు గ్రామ సీమలలో ఇంకా పలు జానపద కళారూపాలు అక్కడక్కడా మనకు కనబడుతుంటాయి. వాటిలో కొన్ని ఇక్కడ ఉదాహరిస్తాను. పిట్టలదొరవేషం, దాసరులు చెప్పేకథలు, కంజరి కథలు, గొల్లసుద్దులు, సిక్కోలు యుద్ధం భామాకలాపం వంటి వెన్నా గ్రామీణా ప్రాంతాలలో నేటికీ అక్కడక్కడా ప్రదర్శింపబడుతునే ఉన్నాయి.

ఈనాడు వాటి ప్రాముఖ్యం తగ్గుతున్నా, దూరదర్శన్ ప్రభావం చేత ఇటువంటి గ్రామీణ జానపద కళారూపాలను దర్శించగలగటం మన సంస్కృతీ సంప్రదాయాలకు దూరం కాకుండా దగ్గరగానే ఉన్నామని గుర్తుకు వస్తున్నది.

- *డా॥ మంతెన సూర్యనారాయణ రాజు*
*విశ్రాంత ఉపన్యాసకులు*

# ఖరీఫ్ సాగుకు అనువైన మేలైన మొక్కజొన్న మరియు చిరుధాన్యాల రకాలు

**తొలకరి ఆసన్నమవుతుంది. రైతాంగం ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతోంది. మారిన జీవన శైలిలో మనం చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల మధుమేహం మరియు ఊబకాయం బారిన పడకుండా ఉండవచ్చు. చిరుధాన్యాలతో పోషక విలువలు మెండుగా ఉండటంతో పాటుగా వీటిని సులభంగా పండించవచ్చు. చీడపీడలు తక్కువగా నీటి ఎద్దడి ప్రాంతాల్లోనూ, వర్షాధారంగాను చిరుధాన్యాలను తేలికగా సాగుచేసుకోవచ్చును.**

**వివిధ చిరుధాన్యాల పంటలలో సాగుకు ఆనువైన రకాల గురించి తెలుసుకుందాం.**

**మొక్కజొన్న:** మొక్కజొన్నలో దీర్ఘకాలిక (100-200) రోజులు, మధ్యకాలిక (90-100) రోజులు, మరియు స్వల్పకాలిక (90 రోజులు) రకాలు అందుబాటులో ఉన్నాయి.

ఖరీఫ్‌లో జూన్ రెండవ వారం నుండీ జూలై రెండవ వారం దాకా విత్తుకోవాలి. విత్తనం సంకర రకాలయితే 20 క్విహె, సాళ్ళ మధ్యదూరం 60 సెం.మీ మరియు మొక్కల మధ్య దూరం 20 సెం.మీ గా ఉండేలా విత్తుకోవాలి. విత్తేముందు కిలో విత్తనానికి 3గ్రా మాంకోజెబ్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో మొక్కలను తెగుళ్ళ బారి నుండి కాపాడుకోవచ్చు. ఖరీఫ్‌కు అనువైన విత్తనాలను పట్టికలో పొందుపరచడమైంది.

**జొన్న:** ఖరీఫ్‌లో జూన్ మాసంలో విత్తుకోవాలి. ఎకరానికి 3-4 కిలోల విత్తనం సరిపోతుంది. వరసల మధ్య 45 సెం.మీ వరుసలలో మొక్కల మధ్య 12-15 సెం.మీ దూరంలో విత్తాలి. ఎకరానికి 58,000 -72,000 మొక్కలు ఉండాలి. కిలో విత్తనానికి 3 గ్రా థైరము లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. ఖరీఫ్‌కి అనుకూలమైన విత్తనాలను పట్టికలో పొందుపరచడమైనది.

**సజ్జ:** ఖరీఫ్‌లో జూన్ మాసంలో విత్తుకోవాలి. ఎకరానికి 1.6 కిలోల విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 45 సెం.మీ మొక్కల మధ్య 12-15 సెం.మీ దూరం ఉండేటట్లు గొర్రుతో విత్తుకోవాలి. నారుపోసి 15 రోజులు వయసు గల నారు మొక్కలను పైన తెల్పిన దూరంలో నాటవచ్చు. ఎకరాకు 58,000 - 72,000 మొక్కలు ఉంచాలి. కిలో విత్తనానికి 3 గ్రా థైరంతో విత్తన శుద్ధి చేయాలి.

**రాగి:** రాగిని ఖరీఫ్‌లో జూలై-ఆగస్టు మాసాల్లో విత్తుకోవాలి. 2.5 కిలోల విత్తనంలో 5 సెంట్లతో పెంచిన నారు ఎకరా పొలంలో నాటడానికి సరిపోతుంది. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 3-4 కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి 2 గ్రా కార్బండిజమ్ లేదా 3 గ్రా మాంకోజెబ్ తో కలిపి విత్తన శుద్ధి చేయాలి.

**సామ:** జూన్ 15వ నుండీ జూలై 15 వరకూ విత్తకోవచ్చును. ఎకరానికి 3.2 కిలోల విత్తనం కావాలి. వరుసల మధ్య 25 సెం.మీ మరియు మొక్కల మధ్య 7.5 సెం.మీ ఎడంగా గొర్రుతో విత్తుకోవాలి. ఒక కిలో విత్తనానికి 2 గ్రా కార్బండిజమ్ లేదా 3గ్రా కాప్టన్/థైరమ్‌తో గానీ కలిపి విత్తుకోవాలి. కా-2 అనేరకం 80-85 రోజులలో కోతకు వస్తుంది. ఓ.యల్.యం 203, ఓ.యల్.యమ్ 36 రకాలు 100-150 రోజులలో కోతకు వస్తాయి.



**జొన్న**

| హైబ్రిడ్ / రకం | ఋతువు | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (క్వి/ఎ) | గుణగణాలు |
|---|---|---|---|---|
| హైబ్రిడ్‌లు సి.ఎస్.హెచ్-16 | ఖరీఫ్ మరియు మాఫీ | 105-110 | 15-17 | బూజు మరియు ఆకుపచ్చ తెగుళ్లను తట్టుకుంటుంది. |
| సి.యస్.హెచ్ -14 | ఖరీఫ్ | 95-100 | 12-13 | బూజు మరియు ఆకుపచ్చ తెగుళ్లని తట్టుకొంటుంది. తక్కువ వర్షపాత ప్రాంతాలకు అనుకూలం. |
| సి.యస్.హెచ్ -18 | ఖరీఫ్ | 110-115 | 16-17 | గింజపై వచ్చే బూజు తెగులును తట్టుకొంటుంది. |
| పి.ఎస్.వి -1 | ఖరీఫ్ | 105-110 | 10-12 | గింజ తెలుపు, చొప్ప పశువులు తినడానికి అనుకూలంగా ఉంటుంది. |
| సి.ఎస్.వి -15 | ఖరీఫ్ | 110 | 10-12 | అన్ని లక్షణాలు, సుమారు పి.ఎస్.వి-1 మాదిరిగానే ఉంటాయి. |
| పాలెం - 2 | ఖరీఫ్ | 105-110 | 11-12 | గింజ తెలుపు, అధిక చొప్ప దిగుబడి నిస్తుంది. బూజు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. |



## మొక్కజొన్న

| హైబ్రిడ్ / రకం | ఋతువు | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (క్వి/ఎ) | గుణగణాలు |
| --- | --- | --- | --- | --- |
| **సంకర రకాలు** | | | | |
| **ద్విసంకర రకాలు** | | | | |
| డి.హెచ్.యం-1 | అన్ని కాలాల్లో | 85-90 | 18-20 | ఆకు ఎండు తెగులును సమర్ధవంతంగా నిరోదించగలదు. |
| డి.హెచ్.యం-103 | అన్ని కాలాల్లో | 105-120 | 22-25 | ఆకు ఎండ మరియు కాండం కుళ్ళు తెగుళ్ళను నిరోధించగలదు. |
| డి.హెచ్.యం-105 | అన్ని కాలాల్లో | 105-120 | 25-30 | ఆకు ఎండు మరియు కాండం కుళ్ళు తెగుళ్ళను నిరోధించగలదు. స్థిరమైన అధిక దిగుబడినిస్తుంది. |
| డిహెచ్.యం-107 | అన్ని కాలాల్లో | 88-95 | 22-25 | నీటి ఎద్దడిని కొంత వరకు తట్టకొనును. కోత సమయంలో కర్ర పచ్చిగా ఉండి మేలైన పశుగ్రాసంగా పనికొస్తుంది. |
| **త్రిసంకరణ రకాలు** | | | | |
| త్రిశూలత | అన్ని కాలాల్లో | 105-120 | 25-30 | కాండం తొలుచు పురుగును తట్టుకొంటుంది. స్వల్పకాలిక హైబ్రిడ్, |
| డి.హెచ్యం-109 | అన్ని కాలాల్లో | 85-90 | 22-25 | ఖరీఫ్‌కు అనుకూలం. నీటి ఎద్దడిని కొంతవరకు తట్టకొంటుంది. |
| **ఏక సంకర రకాలు** | | | | |
| డి.హెచ్.యం-111 (బి.హెచ్ 1576) | అన్ని కాలాల్లో | 90-95 | 25-30 | అధిక దిగుబడినిచ్చు, మధ్యకాలిక రకం. ఇది ఆకు ఎండు, కాండం కుళ్ళు మరియు కంకి ఎండు తెగుళ్ళను తట్టుకుంటుంది. కోత సమయంలో కర్ర పచ్చిగా ఉంది మేలైన పశుగ్రాసంగా పనికొస్తుంది. |
| డి.హెచ్.యం.113 (బి.హెచ్. 1620) | అన్ని కాలాల్లో | 105-120 | 28-30 | అధిక దిగుబడినిచ్చు, దీర్ఘకాలిక రకం, ఖరీఫ్‌కు అనువైనది. ఇది కొంతవరకు కాండం తొలుచు పురుగు మరియు పూత తరువాత వచ్చే ఎండు తెగులును తట్టుకొంటుంది. |
| డి.హెచ్.యం-115 (బి.హెచ్ 2187) | అన్ని కాలాల్లో | 85-90 | 26-28 | స్వల్పకాలిక హైబ్రిడ్. ఆకర్షణీయమైన నారింజరంగు, గుండ్రని గింజలు కల్గి, ఆకు ఎండు, త్రుప్పు మరియు కాండం కుళ్ళు తెగులును తట్టుకొంటుంది. |
| డి.హెచ్.యం-117 | అన్ని కాలాల్లో | 95-100 | 30-35 | అధిక దిగుబడినిచ్చు మధ్యకాలిక రకం, ఖరీఫ్ మరియు రబీకి అనువైనది. మంచి యాజమాన్య పద్ధతులలో 40 క్వింటాళ్ళ వరకు దిగుబడినిస్తుంది. ఇది కొంతవరకు ఖరీఫ్, రబీలో వచ్చు కాండం తొలిచే పురుగును, ఆకు ఎండు తెగులును మరియు పూత తరువాత వచ్చే ఎండ తెగుళ్ళను తట్టుకొంటుంది. కోత సమయంలో కర్ర పచ్చిగా ఉండి మేలైన పశుగ్రాసంగా పనికొస్తుంది. |
| డి.హెచ్.యం-119 (బి.హెచ్. 4062) | అన్ని కాలాల్లో | 95-100 | 30-35 | కాండం తొలుచు పురుగు మరియు ఆకు ఎండ తెగులును తట్టకుంటుంది. |
| సింథటిక్స్/కాంపోజిట్స్ | | | | |
| అశ్విని/హర్ష/వరుణ్ | అన్ని కాలాల్లో | 90-100 | 18-20 | వర్షాభార పరిస్థితులకు అనుకూలం, మేలైన అధిక దిగుబడినిచ్చు రకాలు. ఒకసారి కొన్న విత్తనం 3-4 సం॥ వరకు వాడుకొనవచ్చును. |
| **ప్రత్యేకరకాలు** | | | | |
| అంబర్ శక్తి-1 | అన్ని కాలాల్లో | 90-100 | 20-26 | మధ్యకాలిక, నాణ్యమైన ప్రోటీన్స్ గల సంకర జాతి రకం గింజలు మధ్యస్థ నొక్కులు కల్గి, పసుపు నారింజ రంగులో ఉంటాయి. ఆకు ఎండు మరియు కాండం కుళ్ళు తెగులును తట్టుకొంటుంది. |
| అంబర్ పాప్‌కార్న్ | అన్ని కాలాల్లో | 90-95 | 10-14 | నాణ్యమైన పేలాలకు అనువైనది. |
| మాధురి (తీపిరకం) | అన్ని కాలాల్లో | 75-80 | 30-32 వేల పచ్చికండెలు | తీపిగల కండెరకం. 24% చక్కెర కలిగి ఉడికించి తినటానికి అనువైనది. ఎకరాకు 6-8 పచ్చి చొప్పన ఇస్తుంది. |
| ప్రియ (తీపిరకం) | | 78-85 | 30-32 వేల పచ్చికండెలు | తీపికండె రకం, 20-20% చక్కెర కలిగి పొడవైన కండెలు గల రకం. ఉడికించి తినుటకు అనువైనది. ఎకరాకు 6-8 టన్నుల పచ్చి చొప్పను ఇస్తుంది. |

## సజ్జ

| రకం | ఋతువు | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (క్వి/ఎ) | గుణగణాలు |
|---|---|---|---|---|
| హెచ్.హెచ్.బి-67 (హైబ్రిడ్) | ఖరీఫ్, వేసవి | 68-70 | 8-10 | అతి తక్కువ కాలంలో కోతకు వచ్చే సంకర రకం వెర్రి కంకి తెగులును తట్టుకొంటుంది. |
| ఐ.సి.యం.హెచ్ 356 (హైబ్రిడ్) | ఖరీఫ్, వేసవి | 80-85 | 10-12 | సంకర రకం, పైరు 185 సెం.మీ ఎత్తు ఎదిగి, 2-3 పిలకలు వేస్తుంది. గింజలు మధ్యస్థ లావుగా బూడిద రంగులో ఉంటాయి. వెఱి కంకి తెగులును తట్టుకొంటంది. అన్ని ప్రాంతాలకు అనుకూలం. |
| ఆర్.హెచ్.బి-121 (హైబ్రిడ్) | ఖరీఫ్, వేసవి | 80-85 | 12-14 | వెర్రికంకి తెగులును తట్టుకొంటుంది. |
| ఐ.సి.టి.పి-8203 (కాంపోజిట్) | ఖరీఫ్, వేసవి | 80-85 | 8-10 | గింజలు లావుగా, తెల్లగా ఉంటాయి. వెర్రికంకి తెగులుగు, బెట్టను తట్టుకుంటుంది. |
| ఐ.సి.యమ్.వి-221 (కాంపోజిట్) | ఖరీఫ్, వేసవి | 85-90 | 8-10 | వెర్రికంకిని తట్టుకోగల కాంపోజిట్ రకం, అన్ని ప్రాంతాలకు అనుకూలం. డబ్ల్యుసిసి-75 కంటే మేలైనది. |

## రాగి/తైదలు

| రకం | ఋతువు | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (క్వి/ఎ) | గుణగణాలు |
|---|---|---|---|---|
| గోదావరి | ఖరీఫ్, రబీ | 120-125 | 12-16 | అన్ని ఋతువుల్లో పండించవచ్చు. పైరు ఎక్కువగా పిలకలు వేస్తుంది. మొక్క పచ్చగా ఉండి, వెన్నుల పెద్దగా, ముద్దగా ఉంటాయి. గింజలు ఎరువు, గోధుమ రంగు కలిగి మధ్యస్థమైన లావుంటాయి. |
| రత్నగిరి | ఖరీఫ్, వేసవి | 110-115 | 12-16 | పైరు ఎక్కువగా పిలకలు వేస్తుంది. మొక్క ఆకుపచ్చగా ఉండి 90 సె.మీ ఎత్తు వరకు ఎదుగుతుంది. వెన్నులు పెద్దగా, ముద్దగా ఉంటాయి. గింజలు ఎరువు గోధుమ రంగులో ఉండి, మధ్యస్థమైన లావుగా ఉంటాయి. |
| సప్తగిరి | ఖరీప్, రబీ | 110-115 | 12-16 | పైరుఎత్తుగా పెరిగి, పిలకలు ఎక్కువగా వేస్తుంది. చిత్తూరు జిల్లాకు అనుకూలం. |
| మారుతి | ఖరీఫ్, వేసవి | 85-90 | 10-12 | బెట్టను, అగ్గి తెగులును అన్ని దశల్లోను తట్టుకొంటుంది. |
| చంపావతి | అన్నికాలాలకు | 80-85 | 10-12 | రాగిపండించే అన్ని ప్రాంతాలకు అనువైనది. బెట్టను తట్టుకొంటుంది. అంతర పంటగా కందితో పండించేందుకు అనువైనది. |
| భారతి | అన్నికాలాలకు | 115-110 | 14-16 | అన్ని ఋతువుల్లో పండించవచ్చు. వెన్నులు పెద్దగా, ముద్దగా ఉంటాయి. అగ్గి తెగులును కొంతవరకు తట్టుకోగలదు. |
| శ్రీచైతన్య | ఖరీఫ్ | 110-115 | 12-16 | పైరు ఎత్తుగా పెరిగి పిలకలు ఎక్కువగా వేస్తుంది. ఖరీఫ్‌లో అన్ని ప్రాంతాలకు అనువైనది. |



## కొర్ర


| రకం | ఋతువు | పంటకాలం (రోజుల్లో) | దిగుబడి (క్వి/ఎ) | గుణగణాలు |
|---|---|---|---|---|
| ప్రసాద్ | ఖరీఫ్/వేసవి | 70-75 | 8-12 | కంకులు పెద్దగా ఉండి, గింజలు లావుగా, లేత పసుపు రంగులో ఉంటాయి. మొక్కలు 110 సెం.మీ, ఎత్తు పెరిగి ఆకులు వెడల్పుగా ఉండి 3,4 పిలకలు వేస్తాయి. |
| కృష్ణదేవరాయ | ఖరీఫ్, వేసవి | 80-85 | 10-12 | గింజలు లావుగా, లేత పసుపు రంగులో ఉంటాయి. మొక్కలు 110 సెం.మీ.ఎత్తు ఎదిగి 4-6 పిలకలు పిలకలు వేస్తాయి. చొప్ప నాణ్యమయినది. |
| నరసింహరాయ | ఖరీఫ్, వేసవి | 80-85 | 10-12 | గింజలు లావుగా, పసుపు రంగులో ఉంటాయి. మొక్కలు 110-120 సెం.మీ ఎత్తు ఎదిగి బాగా పిలకలు వేస్తాయి. |
| శ్రీలక్ష్మి | ఖరీఫ్, వేసవి | 80-85 | 10-12 | మొక్కలు 120 సె.మీ ఎత్తు పెరిగి, వెర్రికంకి, తుప్పు మరియు అగ్గితెగుళ్ళను కొంత వరకు తట్టుకొంటాయి. |
| ఎన్ఐఎ 3085 | ఖరీఫ్, వేసవి | 76-80 | 10-12 | బెట్టను తట్టుకొంటుంది. అగ్గి తెగులును, గింజ బూజు తెగుళ్లను తట్టుకొంటుంది. గింజ పసుపు రంగులో ఉంది నాణ్యత కలిగి ఉంటుంది. |

*- ఎన్. నాగలక్ష్మి, యం. సుధారాణి, యం. మాధవి, ఎన్.వి. నాయుడు,*
*విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్*

# ప్రైమింగ్ ప్రక్రియతో జొన్నలో అధికోత్పత్తి

**ఆంధ్రప్రదేశ్‌లో జొన్న పంట ఖరీఫ్‌లో 2.8 లక్షల ఎకరాల్లోను, రబీ 3.5 లక్షల ఎకరాల్లోనూ సాగుచేయబడుచున్నది. ఎకరానికి సుమారుగా ఖరీఫ్‌లో 400 కిలోలు మరియు రబీలలో 553 కిలోలు దిగుబడి వస్తోంది. సాధారణంగా నల్లరేగడి మరియు తేలికైన ఎర్రనేలల్లో ఖరీఫ్, రబీ, లేట్ రబీ మరియు మాఘ సీజన్లలో పండిస్తున్నారు.**

వ్యవసాయ వర్సిటీ పరిశోధనలో భాగంగా జొన్న విత్తనాన్ని ప్రైమింగ్ ప్రక్రియతో శక్తివంతంగా తయారుచేసి 3 సంవత్సరాలు పరిశీలించిన మీదట రైతుల క్షేత్రంలో పరిశీలించటానికి మరియు వారికి అవగాహన కలిగించటానికి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రదేశాలలోని చిన్న, సన్నకారు రైతుల క్షేత్రాలలో పరీక్షచేసి అనుభవాలను పంచుకొంటున్నాం. ఈ ప్రక్రియ వర్షాధార భూముల్లోనూ, తేలిక , సాధారణం కంటే దిగువస్థాయి పోషకాలు గల నేలల్లోనూ బాగా ఉపకరిస్తుంది.




### ప్రైమింగ్ అంటే ఏమిటి?

విత్తనాలను నీటిలోకానీ, వివిధ రసాయనాలలోగానీ ఉదాహరణకు kcl ,kno3, పాలిథిలీన్ గ్లైకాల్ వంటి రసాయనాలలో నిర్ణీత సమయం నానబెట్టి తరువాత నీడపట్టున ఆరబెట్టడం ద్వారా విత్తనాలలోని శక్తి పెరిగి గింజ మొలకెత్తడానికి మరియు తొలిదశలలో చక్కగా పెరగడానికి దోహదపడే ప్రక్రియ.

### ప్రైమింగ్ ఎలా చేస్తారు?

సాధారణంగా ఎకరానికి 3.4 కిలోల విత్తనం అవసరం అవుతుంది. విత్తనం సేకరించిన తరువాత 4 కేజీల ఇసుకని 4 లీటర్ల నీటిలో తడుపుకోవాలి. ఇలా తడిచిన ఇసుకలో 4 కేజీల విత్తనాన్ని 16-18 గంటల పాటు ఉంచాలి. తరువాత విత్తనాన్ని ఇసుకతో పాటుగా నీడపట్టున ఆరబెట్టాలి. ఎండలో సాధారణ స్థాయి వచ్చే వరకూ ఆరబెట్టాలి. తరువాత ఇసుకని జల్లెడతో వేరు చేసి జొన్న విత్తనాలను విత్తుకోవాలి.

### ప్రైమింగ్ ఎప్పుడు చేయాలి?

విత్తనం సేకరించుకొన్న తరువాత విత్తుకోవడానికి 4-5 రోజుల ముందుగా ప్రైమింగ్ చేయడం వలన మంచి ఫలితాలు ఉంటాయి. ముఖ్యమైన జాగ్రత్త చర్యగా ప్రైమింగ్ తరువాత విత్తనంలో తేమ ఎక్కువగా ఉండకుండా చూడాలి. లేనిచో శిలింధ్రా నాశినులు ఆశించి విత్తనం పాడవుతుంది.

### ప్రైమింగ్ ప్రక్రియ వలన ఫలితాలు

రంగారెడ్డి జిల్లాలోని కొడంగల్, పెద్దేమూన్ మరియు అనంతరామ తాండ మరియు కర్నూలు జిల్లాలోని మిత్నాల, ముక్కామల మరియు సుంకేసుల గ్రామాల్లో రైతులకు ప్రత్యక్షంగా ప్రైమింగ్ విధానాన్ని బోధపరిచి, వారిచే చేయించి, దిగుబడిలో అభివృద్ధి సాధించడమైనది. ప్రైమింగ్ ప్రక్రియ వలన కలిగిన అభివృద్ధిని పట్టికలో పొందు పరచడమైనది.

**ప్రైమింగ్ విధానం వలన జొన్నలో మొలక మరియు దిగుబడిలో అభివృద్ధి (2012-13)**

| ప్రాంతం | మొలకశాతం | | మొలక శాతంలో సగటు పెరుగుదల | మొక్కలసాంద్రత | | మొక్కల పెరుగుదల శాతం | దిగుబడి (క్వి/ఎ) | పెరుగుదల శాతం | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | ప్రైమింగ్ చేయనిది | ప్రైమింగ్ చేసినది | | ప్రైమింగ్ చేయనిది | ప్రైమింగ్ చేసినది | | | | |
| క్షేత్రం-1 | 89.8 | 98.4 | 9.23 | 13.3 | 14.6 | 9.26 | 1480 | 12.5 | |
| క్షేత్రం-2 | 85.7 | 96.5 | ॥ | 12.7 | 14.3 | ॥ | 2382 | 10.4 | 10.3 |
| క్షేత్రం-3 | 85.7 | 89.8 | ॥ | 12.6 | 13.3 | ॥ | 1386 | 8.1 | |
| **ప్రైమింగ్ విధానం వలన జొన్నల్లో మొలక మరియు దిగుబడిలో అభివృద్ధి (2013-14)** | | | | | | | | | |
| క్షేత్రం-1 | 87 | 94 | 6.52 | 27 | 30 | 10.9 | 1970 | 2125 | |
| క్షేత్రం-2 | 90 | 95 | 6.52 | 25 | 28 | 10.9 | 1865 | 1985 | 10.3 |
| క్షేత్రం-3 | 85 | 90 | 6.52 | 30 | 32 | 10.9 | 1990 | 2059 | |

ఈ విధంగా సుమారుగా పదిశాతం దిగుబడిలో పెరుగుదల గమనించడం జరిగింది. మొక్కల సాంద్రతలో తేడాని పొందుపరచబడి ఛాయాచిత్రాలలో కూడా గమనించగలరు. కేవలం ఖర్చు లేకుండా నీటిలో ఇసుకతో పాటుగా నానబెట్టడం వలన దిగుబడిలో మంచి ఫలితాలు సాధించడం జరిగింది.

*- ఎన్. నాగలక్ష్మి, యం. సుధారాణి, యం. మాధవి, ఎన్.వి. నాయుడు,*
*విత్తన పరిశోధన మరియు సాంకేతిక కేంద్రం, రాజేంద్రనగర్, హైదరాబాద్*



# రైల్వే బడ్జెట్ ద్వారా రవాణా రంగానికి దిశా నిర్దేశనం : ప్రధాని మోడీ

**ప్రస్తుత రైల్వే బడ్జెట్ రైల్వే శాఖకే గాక దేశంలోని అన్ని రంగాలకు స్పష్టమైన మార్గ నిర్దేశనం చేస్తుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ తెలిపారు.**

రైల్వే మంత్రి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ప్రధాని మాట్లాడుతూ - జాతి ప్రగతికి రైల్వేశాఖ గుండెకాయ వంటిదని, రైల్వే బడ్జెట్ దేశ అభివృద్ధికి కీలకం కాగా, రైల్వే ఆధునీకరణ, భద్రత, సేవలను పటిష్టంగా అమలు చేయవలసి ఉంటుందని అప్పుడే దేశం ప్రగతి మార్గంలో ముందుకు సాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రైల్వే బడ్జెట్లో ప్రపంచ వాణిజ్యరంగానికి అవకాశం కల్పించడం జాతీయ ఆర్థికాభివృద్ధిలో కీలకమైన మలుపుగా ఆయన అభివర్ణించారు. రైల్వే వంటి కీలకమైన ప్రణాళిక అమలుచేయవలసి ఉంటుందని, ఇందులో పారదర్శకత, సమర్థత ఎంతో అవసరమని, ఇవన్నీ జాతీయ ఆర్థికాభివృద్ధికి అవసరమైన అంశాలేనని ఆయన వివరించారు.

వివిధ వర్గాలకు చెందిన కోట్లాది మంది ప్రయాణికుల మనోభావాలకు అనుగుణంగా రైల్వేలను నిర్వహించవలసి ఉందని, వారందరి సౌకర్యం కోసం చేయవలసిని కృషి ఎంతో ఉందని అన్నారు. రైల్వే ప్రణాళిక నిర్దేశించిన లక్ష్యాలను సులభంగా చేరుకోగలమని ప్రధాని మోఆశాభావం వ్యక్తం చేశారు.

---

# ఎ.ఎం.ఆర్- అపార్డు లో సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, జి.పి. ఛైర్మన్‌లకు శిక్షణ

**మన ఊరు-మన ప్రణాళిక కార్యక్రమాన్ని చేపడుతున్నామని, అందులో భాగంగా, అపార్డులో సర్పంచులు ఎం.పి.టిసి, ఎంపిపిలు, జెడ్.పి.టి.సి లకు, మున్సిపల్ ఛైర్మన్లకు శిక్షణా తరగతులు ఇప్పిస్తామని తెలంగాణా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తెలంగాణాలో జూలై 17న ఒక టెలివిజన్‌కు ఇచ్చిన గంటసేపు ఇంటర్వ్యూలో రాజకీయవేత్త చెన్నమనేని రాజశ్వేరరావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.**



సిహెచ్ రాజేశ్వరరావు అడిగిన ప్రశ్న పంచాయతీ అధికారాల బదలాయింపు ఎప్పటినుంచి అనే దానికి సమాధానం చెప్పారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ అదే సమయంలో అధికారాలు బదలాయింపుపై దృష్టి సారించాం అన్నారు.



# ఇ - పంచాయితీ పోర్టల్‌పై పంచాయితీరాజ్ సిబ్బందికి శిక్షణ



**పంచాయితీరాజ్ సంస్థలలో పౌర సేవలను సులభతరం చేయటానికి, వేగవంతంగా అందచేయటానికి ఉద్దేశించిన ఇ - పంచాయితీ పోర్టల్‌పై పంచాయితీరాజ్ శాఖ సిబ్బంది, నేషనల్ ఇన్ఫర్మేటిక్సు సెంటర్ జిల్లా ఇన్ఫర్మేటిక్సు అధికారులకు శిక్షణా కార్యక్రమాలను అపార్డులో నిర్వహించారు.**

నేషనల్ పంచాయితీ పోర్టల్ నిర్వహణ, ఇ - పంచాయితీ పోర్టల్ నిర్వహణావిధానం, పంచాయితీ భౌతిక సమాచార నిర్వహణ, ప్రియాసాఫ్ట్, ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్, తదితర అంశాలపై ఎన్ఐసి నిపుణులు శిక్షణలో పాల్గొన్న సిబ్బందికి అవగాహన కలుగచేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అపార్డ్ అధికారులు కంప్యూటర్ల వినియోగం వల్ల సేవలలో పారదర్శకత పెరగటమే కాక జవాబు దారీ తనం కూడా పెరుగుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పంచాయితీరాజ్ సంస్థలు కూడా మారాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ సంస్థలలో కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం అవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి. ఆర్. జి.ఎఫ్ అధికారులు, బి.ఆర్.జి.ఎఫ్ జిల్లాలో ప్రణాళికా రూపకల్పన "ప్లాన్ ప్లస్" కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ డిప్యూటీ కమీషనర్ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమ ఏర్పాట్లను అపార్డు అందించింది.

Printed & Published by: G.D. Priyadarshini, Director, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : G.D. Priyadarshini**